సూర్య 19వ వసంతంలోకి ...
www.suryaa.com
visit us @ https://www.suryaepaper.com

# సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

గురువారం | 5 మార్చి 2026 | హైదరాబాద్
సంపుటి 19 | సంచిక 135
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...





☞ APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
☞ నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
☞ కరెంట్ అఫైర్స్
☞ నమూనా ప్రశ్నాపత్రాలు
☞ విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

అనుగ్రహం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - శిశిర రుతువు, ఫాల్గుణ మాసం బహుళ పక్షం, విదియ సా.4.51, ఉత్తర ఉ.8.16, వర్జ్యం సా.5.04 నుంచి 6.44 వరకు
రాహుకాలం మ.1.30 నుంచి 3.00 వరకు దుర్ముహూర్తం ఉ.10.14 నుంచి 11.01 వరకు తిరిగి మ.2.55 నుంచి 3.42 వరకు

## నష్టాల్లో స్టాక్ మార్కెట్లు



5లో

- అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో పెట్టుబడిదారుల్లో పెరిగిన ఆందోళన
- 1122 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్.. 385 పాయింట్లు పతనమైన నిఫ్టీ
- 10 నెలల కనిష్ట స్థాయికి సెన్సెక్స్.. ఆరు నెలల కనిష్టానికి నిఫ్టీ

## రాజ్యసభ బరిలో బీజేపీ
# హేమాహేమీలు

- బీహార్ నుంచి నితిన్ నబీన్, శివేష్ కుమార్
- తొమ్మిది మంది అభ్యర్థులను ప్రకటించిన హైకమాండ్

వివరాలు-6లో

## ఇరాన్‌కు న్యూక్లియర్ బాంబ్ లేదు



- తయారు చేస్తున్నట్లు ఎలాంటి ఆధారాలు లేవు
- ఇరాన్ వద్ద అణు గ్రేడ్ యురేనియం నిల్వలున్నాయి
- ఇది ఆందోళన కలిగించే విషయం
- ఐఏఈఏ డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రోస్సీ

వివరాలు-6లో

## రూపాయికి యుద్ధం సెగ



డాలర్‌తో పోలిస్తే ఆల్ టైమ్ కనిష్టానికి పతనం

పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య దాడులు తీవ్రం కావడంతో భారత రూపాయి విలువ బుధవారం కుప్పకూలింది. ముడిచమురు ధరలు ఆకాశాన్ని తాకడం, అంతర్జాతీయ మార్కెట్లో డాలర్‌కు డిమాండ్ పెరగడంతో రూపాయి విలువ ఎన్నడూ లేని విధంగా 92.41 వద్ద చరిత్రాత్మక కనిష్ట స్థాయికి చేరుకుంది. మంగళవారం 91.47 వద్ద ముగిసిన రూపాయి విలువ, బుధవారం ఉదయమే 92 మార్కును దాటేసింది. చివరకు బ్లూమ్‌బర్గ్ డేటా ప్రకారం 92.15 వద్ద స్థిరపడింది.

వివరాలు-6లో

## రాజ్యసభకు వెళ్లే
# పెద్దలెవరో?

- నేడు నామినేషన్లకు చివరి రోజు
- ఢిల్లీ అధిష్టానంతో సీఎం రేవంత్ సుదీర్ఘ చర్చలు
- చర్చల్లో పాల్గొన్న మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- అభిషేక్ సింఘ్వీ పేరు దాదాపు ఖరారైనట్టే?
- మిగిలిన స్థానానికి పలువురు పోటీ?
- బీఆర్ఎస్ పోటీకి దిగితే పరిస్థితి ఏంటని అధిష్టానం ఆరా
- ఎంఐఎం సహకారం ఉందన్న సీఎం, పీసీసీ చీఫ్‌లు

తెలంగాణలో వేసవి ఎండల కంటే ఎక్కువగా రాజ్యసభ ఎన్నికల వేడి సెగలు రేపుతుంది. రాష్ట్రం నుంచి కాంగ్రెస్ కు చెందిన అభిషేక్ సింఘ్వీ, బీఆర్ఎస్ కు చెందిన సురేష్ రెడ్డిల పదవీ కాలం ముగియ్యడంతో వారి స్థానంలో ఇద్దరు అభ్యర్థులకు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటికే రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రక్రియ కొనసాగుతుండగా.. నామినేషన్ల దాఖలుకు నేడు 5వ తేదీ చివరి రోజు. దీంతో ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్ లు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నాయి.



3లో

## యుద్ధ ప్రాతిపదికన
# సింగూరు ప్రాజెక్ట్

- డ్యామ్ సేఫ్టీ పనులను పూర్తి చేయాలి
- జులై నెలాఖరులోగా రైతులకు సాగునీరు అందించాలి
- ఉగాదిలోగా పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పనులకు శంకుస్థాపన చేయాలి
- మంత్రులు ఉత్తమ్, దామోదర రాజనర్సింహ, వివేక్

ఈ సమావేశంలో రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన సింగూరు డ్యాం సేఫ్టీ పై రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ ఉత్తమ్ కుమార్ రెడ్డి వివేక్ వెంకటస్వామిలు చర్చించారు. డ్యామ్ సేఫ్టీ ప్రభుత్వానికి ఎంతో ప్రాధాన్యత అంశం అన్నారు. నేషనల్ డ్యామ్ సెక్యూరిటీ సంస్థ రూపొందించిన నిబంధనల మేరకు సింగూర్ డ్యాం ను పరిరక్షించాలని మంత్రులు ఇరిగేషన్ శాఖ అధికారులకు ఆదేశించారు.



3లో

సూర్య వెబ్‌సైట్
సూర్య ఈ - పేపర్

## 8 మంది ఎమ్మెల్యేలపై
# ఫిర్యాదులు

- రాహుల్ గాంధీ ఆదేశాలతో వారితో మాట్లాడిన పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- డీసీసీలకు ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా సపోర్టు చేయాలి
- అందరినీ కలుపు కుంటూ పని చేయాలని డీసీసీలకు కీలక ఆదేశాలు



3లో

జిల్లా అధ్యక్షులకు నేతలంతా సహకరించాల్సిందేనని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మరోసారి నొక్కి చెప్పారు. ఆయన గాంధీభవన్ లో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కొందరు ఎమ్మెల్యేలకు డీసీసీలకు సహకరించడం లేదనే ఫిర్యాదులు వచ్చాయని, ఈ అంశంపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సీరియస్ గా ఉన్నట్లు పీసీసీ చీఫ్ చెప్పారు.

## అమిత్ షాతో
# సీఎం రేవంత్ భేటీ

- లొంగిపోయిన మావోయిస్టుల గురించి చర్చలు
- సీఎం రేవంత్ రెడ్డి వెంట డీజీపీ, ఐఎస్‌బి ఐజీ సుమతి, ఇంటెలిజెన్స్ ఐజీ విజయకుమార్
- అజ్ఞాతంలో ఉన్న గణపతి గురించి సైతం చర్చించే అవకాశం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యూఢిల్లీ పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. బుధవారం రాత్రి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. అందుకోసం అమిత్ షా కార్యాలయానికి ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి చేరుకున్నారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.


వివరాలు-3లో



## ట్యాక్స్ కలెక్షన్స్‌పై
# ఫుల్ ఫోకస్

- కోర్ అర్బన్ రీజియన్‌లోని జనాభాకు తగ్గ వసూళ్లు
- జీహెచ్ఎంసీలో విలీనంతో ట్యాక్స్ కలెక్షన్ రూ. 3 వేల కోట్లు టార్గెట్
- ఇప్పటి వరకు మూడు కార్పొరేషన్ల పరిధిలో దాదాపు రూ.2 వేల కోట్ల వరకు ట్యాక్స్ వసూలు


కోర్ అర్బన్ రీజియన్ లోని సుమారు కోటి 40 లక్షల మంది జనాభా కు అవసరాలకు తగిన అభివృద్ధితో పాటు పౌర, అత్యవసర సేవలందించే మూడు మున్సిపల్ కార్పొరేషన్లకు ప్రధాన ఆర్థిక వనరుల్లో ఒకటైన ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్‌పై మూడు కార్పొరేషన్ లోని అధికారులు బుధవారం నుంచి ఫుల్ ఫోకస్ పెట్టనున్నారు.






2లో

## అంతా ఇంతే!





అధిష్టానంతో పైరవీ చేయించుకుంటే చాలు!



6లో

## అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలపై
# భీకర దాడులు

- 40 క్షిపణులు, 230 డ్రోన్లతో 17వ విడత దాడులు
- అమెరికా స్థావరాలే లక్ష్యంగా క్షిపణులు ప్రయోగించినట్లు వెల్లడి

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరుకున్నాయి. ఇరాన్ సైనిక విభాగం 'ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్' (ఐఆర్జీసీ) బుధవారం దాడులను తీవ్రతరం చేసింది. అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలపై 17వ విడత దాడులను ప్రారంభించినట్లు అధికారికంగా ప్రకటించింది. దీన్ని 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్ 4' గా ఇరాన్ వెల్లడించింది.

## మోడీతోనే
# బీసీలకు న్యాయం

- చరిత్రలో ఏ పార్టీ ప్రభుత్వం కులగణన చేయలేదు - ఆ ఘనత మోడీకే దక్కుతుంది
- మోడీ నాయకత్వంలోనే చట్ట సభలలో రిజర్వేషన్లు సాధిస్తాం
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య

బి.సి లకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంఘం అధ్యకులు ఆర్. కృష్ణయ్య తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొలిసారిగా జనగణనలో కులగణన చేపడుతుంది. ఇది దేశచరిత్రలో రికార్డు, 76 సంవత్సరాల చరిత్రలో ఈ పార్టీ కూడా కులగణన చేయలేదు.



2లో

## మధ్యతరగతిపై
# ఆర్థిక పిడుగు



6లో

- భారతీయుల చావుకొచ్చిన యుద్ధం
- భారీగా పెరగనున్న ధరలు
- సామాన్యులలో ఆందోళన

ఇరాన్-ఇజ్రాయెల్- అమెరికా మధ్య చెలరేగిన ఉద్రిక్తతలు రోజు రోజుకు మరింత తీవ్రతరం అవుతున్నాయి. ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా దాడి చేస్తుంటే.. ఇరాన్ గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై క్షిపణుల వర్షం కురిపిస్తోంది.

# 12 ఏళ్లకోసారి వచ్చే మహా ఘట్టం



● ఇంద్రకీలాద్రిపై 'మహా కుంభాభిషేకం' ● విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధిలో అద్భుత ఆధ్యాత్మిక ఘట్టం
● రేపటి నుండి 8 వరకు వేడుకలు ● విచ్చేయనున్న కంచి కామకోటి పీఠాధిపతి
● ముఖ్యమంత్రి, మంత్రులకు ప్రత్యేక ఆహ్వానాలు

ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : బెజవాడ దుర్గమ్మ ఆలయం ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక ఘట్టానికి వేదిక కాబోతోంది. అదే 'మహా కుంభాభిషేకం'. ఇది ప్రతి ఏటా వచ్చే పండుగ కాదు. పన్నెండేళ్లకు (పుష్కర కాలం) ఒకసారి మాత్రమే వచ్చే అత్యంత అరుదైన, పవిత్రమైన క్రతువు. ఆగమ శాస్త్రోక్తంగా ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఇంద్రకీలాద్రిపై ఈ మహా యజ్ఞం కన్నుల పండువగా జరగనుంది. ఈ ఉత్సవం కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, కనకదుర్గమ్మ ఆలయానికి ఒక 'పునర్జన్మ' లాంటిది. దైవిక శక్తిని తిరిగి మేల్కొలిపి, ఆలయానికి పునర్జీవం పోసే ఈ మహా కుంభాభిషేక వేడుకల కోసం ఇంద్రకీలాద్రి సర్వాంగ సుందరంగా సిద్ధమైంది.

**12 ఏళ్లకు ఒకసారే ఎందుకు? :** మహా కుంభాభిషేకానికి హిందూ ధర్మంలో, ఆగమ శాస్త్రాల్లో ఎంతో విశిష్టత ఉంది. దేవాలయాల్లో ప్రతిష్ఠించిన మూలవిరాట్ (విగ్రహాలు) ఎంతో శక్తివంతమైనవి. అయితే నిత్యం జరిగే పూజలు, అభిషేకాలు, లక్షలాది మంది భక్తుల తాకిడి వల్ల కాలక్రమేణా ఆ విగ్రహాలు తమ దైవిక శక్తిని కొంతమేర కోల్పోతాయని శాస్త్రాలు చెబుతున్నాయి. సరిగ్గా 12 ఏళ్లకు ఒకసారి ఆ దైవిక శక్తిని, చైతన్యాన్ని తిరిగి విగ్రహాల్లోకి నింపే పవిత్ర ప్రక్రియే ఈ 'కుంభాభిషేకం'. మన శరీరానికి ధ్యానం ఎంత అవసరమో, ప్రాణశక్తిని నిలపడానికి ఆలయానికి ఈ క్రతువు అంతే ప్రాణాధారం అని వేద పండితులు వివరిస్తున్నారు.

**ప్రకృతిని శుద్ధి చేసే మహా యజ్ఞం :** ఈ మూడు రోజుల పాటు ఇంద్రకీలాద్రిపై ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగనున్నాయి. యజ్ఞం చేయడం ద్వారా గాలిని శుద్ధి చేస్తారు. హోమం ద్వారా అగ్నిని పవిత్రం చేస్తారు. మంత్రోచ్ఛారణల ద్వారా ఆకాశాన్ని (శూన్యాన్ని) శుద్ధి చేస్తారు. ఇలా చేయడం వల్ల ఆలయ పరిసరాల్లో ఉన్న ప్రతికూల శక్తులన్నీ తొలగిపోయి, సానుకూల శక్తి వెల్లివిరుస్తుంది. ఈ ఘట్టం ఈనెల 6వ తేదీ ఉదయం నుంచి అధికారికంగా ప్రారంభమవుతుంది. తొలిరోజు విఘ్నేశ్వరుడికి విశేష పూజలు చేస్తారు. అనంతరం పుణ్యాహవచనం, దీక్షాధారణ చేపడతారు. అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపనతో యజ్ఞశాల కార్యక్రమాలు శాస్త్రోక్తంగా మొదలవుతాయి. దేశంలోని పుణ్య నదుల నుంచి, సప్త సముద్రాల నుంచి సేకరించిన పవిత్ర జలాలతో అమ్మవారికి మంత్రమయ తర్పణాలు అర్పిస్తారు.

**మార్చి 8న ప్రధాన ఘట్టం :** ఈ కుంభాభిషేక మహోత్సవంలో ప్రధానమైన ఘట్టం మార్చి 8వ తేదీన జరగనుంది. ఆ రోజు ఉదయం 9:34 గంటలకు దివ్యమైన మేష లగ్నంలో ఈ మహా క్రతువు జరుగుతుంది. ఆలయ విమాన గోపురంపై ఉన్న 'బంగారు కలశానికి' పండితులు మహా కుంభాభిషేకం నిర్వహిస్తారు. కుంభాభిషేక సమయంలో గర్భాలయంలోని అమ్మవారి దైవ శక్తిని పండితులు తాత్కాలికంగా ఆ కలశాల్లోకి ఆవాహన చేస్తారు. అందుకే ఆ కలశానికి చేసే అభిషేకాన్ని కళ్లారా వీక్షించడం ఎన్నో జన్మల పుణ్యఫలంగా భక్తులు భావిస్తారు. కుంభాభిషేకం నేపథ్యంలో దుర్గగుడి పాలకమండలి భారీ ఏర్పాట్లు చేసింది. భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సర్వ సన్నద్ధం అయ్యారు. ఈ వేడుకకు కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి విచ్చేస్తున్నారు. ఆయన చేతుల మీదుగా భక్తులకు అనుగ్రహ భాషణం జరగనుంది. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర ప్రముఖులకు ఆలయ అధికారులు స్వయంగా వెళ్లి ఆహ్వాన పత్రికలు అందజేశారు.

**ఫోటో నెంబర్ 992 :** కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నాం : బొర్రా రాధాకృష్ణ గాంధీ, దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్

"రాష్ట్ర ప్రభుత్వ సలహాలు, సూచనల మేరకు 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ మహా కుంభాభిషేకం కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నాం. సీనియర్ అర్చక స్వాములు, ప్రముఖ పీఠాధిపతులు, వేద పండితుల సమక్షంలో ఈ పవిత్ర కార్యక్రమం జరుగుతుంది. ఈ మూడు రోజుల్లో సుమారు లక్ష నుంచి లక్షన్నర మంది భక్తులు ఇంద్రకీలాద్రికి వస్తారని అంచనా వేస్తున్నాం. ఆ రద్దీకి తగ్గట్టుగా ఏర్పాట్లు చేశాం. భక్తులు కుంభాభిషేక కార్యక్రమాన్ని ఎక్కడినుంచైనా సౌకర్యవంతంగా వీక్షించడానికి వీలుగా కొండపై, కింద భారీ ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేస్తున్నాం. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**ఫోటో నెంబర్ 993 :** ముందస్తు చర్యలు తీసుకున్నాం.- వీకే శీనానాయక్, దుర్గగుడి కార్యనిర్వహణ అధికారి

"కంచి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరగబోతోంది. ఇది 'మినీ దసరా' ఉత్సవాల్లాగే ఉండబోతోంది. భక్తులకు ఏ చిన్న ఇబ్బంది కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాం. కనకదుర్గా నగర్ నుంచి, అలాగే ఘాట్ రోడ్డు వైపు నుంచి భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం. వృద్ధులకు, విభిన్న ప్రతిభావంతులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రత్యేక దర్శన ఏర్పాట్లు ఉన్నాయి. రద్దీని నియంత్రించేందుకు దాదాపు 1000 నుంచి 1500 మంది పోలీసు సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశాం. భక్తులకు లడ్డూ ప్రసాదం కొరత రాకుండా చేస్తామన్నారు.

# కవిత రాజకీయ ఒంటరి ఈ ప్రయాణం ఎన్నాళ్లు?

● తిరిగి బీఆర్ఎస్‌లో చేరిపోతారంటూ పుకార్లు
● సొంతగా పార్టీ పెట్టుకుంటానని ఇప్పటికే కవిత ప్రకటన
● ఇతర పార్టీలలో సీనియర్లను ఆకర్షించడానికి చాలా స్పష్టమైన సంకేతం

హైదరాబాద్: కల్వకుంట్ల కవిత తెలంగాణ రాజకీయాలలో ఒంటరి ప్రయాణం చేయగలరా? తిరిగి బీఆర్ఎస్‌లోకి వెళ్ళిపోవడం ఖాయమేనా? అనే అనుమానాలు, ఊహాగానాలను ఆమె ఒక్కొక్కటిగా పటాపంచలు చేస్తున్నారు. రాజకీయాలు చేయాలంటే ధైర్యం ఉండాలని చెప్పి చూపిస్తున్నారు. పార్టీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం సరైన నిర్ణయమే. అవసరమే. తాను కాలక్షేపానికి రాజకీయాలు చేయడం లేదని, ఎన్నికలలో పోటీ చేస్తామని, గెలిస్తే అధికారం చేపడతామని స్పష్టంగా చెప్పడం ద్వారా ఆమె ఇతర పార్టీలలో సీనియర్లను ఆకర్షించడానికి చాలా స్పష్టమైన సంకేతం పంపారు. కానీ ఇదొక్కటే సరిపోదు. తన వెంట గుప్పెడు మంది అనామకులున్నా చాలు వారితో కలిసి ప్రజా సమస్యలపై పోరాటాలు చేయగలనని నిరూపించుకుంటున్నారు. గతంలో పవన్ కళ్యాణ్ జనసేన స్థాపించినప్పుడు ఇలాగే ముందుకు సాగారు. నాడు ఆయనను ఎద్దేవా చేసిన కవిత నేడు అదే మార్గంలో నడుస్తున్నారు. అవమానాలు, విమర్శలు, ఒంటరితనం అన్నీ భరించగలిగితేనే గమ్యం చేరగలమని ఆయన నిరూపించి చూపారు. ఇప్పుడు ఆమె ట్రై చేస్తున్నారు. పార్టీ అధికారికంగా ప్రకటించే వరకు జాగృతి జెండాలు, కండువాలతో పోరాటాలు కొనసాగించడం వ్యూహాత్మకంగా మంచిదే. సంస్థాగత నిర్మాణం లేనప్పుడు ఓ ఉద్యమ వేదిక అవసరం. జాగృతిని అందుకు ఉపయోగించుకుంటున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ.5,000 కోట్లతో హైదరాబాద్‌లో ప్రపంచంలోకెల్లా ఎత్తైన గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించడం, దాని కోసం భూసేకరణ, ఇళ్ళ కూల్చివేత... ఇవన్నీ రాజకీయ అవకాశాలే. వాటిని సకాలంలో గుర్తించడం, సరిగ్గా వినియోగించడం కూడా అవసరమే. కవిత అదే చేస్తున్నారు. మూసీ బఫర్ జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయనే అంశాన్ని హైలైట్ చేస్తూ పేదల ఇళ్ళు ఎందుకు కూల్చేస్తున్నారని ప్రశ్నించడం ద్వారా ఆమె రాజకీయ చతురతకి ఓ చిన్న నిదర్శనం. ధర్నా చేయడం, పోలీసుల అరెస్ట్ ప్రయత్నం, ఆమె ఎదురుతిరగడం, మీడియా ముందు మాట్లాడడం, సోషల్ మీడియాలో ప్రచారం, ఇవన్నీ 'స్టాండర్డ్ రాజకీయ ఫార్మాట్'లో ఉన్నవే. రాజకీయాలలో ఉన్నవారు ఇదే ఫార్మాట్ ఫాలో అవుతుంటారు. కనుక కవిత సరైన దిశలోనే అడుగులు వేస్తున్నరనుకోవచ్చు. కానీ ఇది చాలా లాంగ్ జర్నీ ఈ 'జర్నీ ఖర్చులు' చాలా భారీగా ఉంటాయి. ఆమె పార్టీ ఏర్పాటు చేసుకుంటున్నారంటే దానర్థం ఆమెకు అంత ఆర్థిక స్తోమత ఉందనే. ఒకప్పుడు గులాబీ కారుకి జాగృతి స్టెఫినీగా ఉన్నది. ఇప్పుడు అదే ఆమెకు ఉపయోగపడుతోంది. బీఆర్ఎస్ నుంచి ఓ నలుగురు సీనియర్లు రప్పించగలిగితేనే స్టెఫీనీకి వెహికల్ అమర్చినట్లవుతుంది. తెలంగాణ సీఎం అవ్వాలనే రూట్ మ్యాప్ ఆమె వద్ద ఇప్పటికే సిద్ధంగా ఉంది. కనుక ఆ తర్వాత అసలు ప్రయాణం మొదలవుతుంది.

# బెయిల్‌పై విడుదలైన బాల్క సుమన్



● పోలీసులు విశాఖ ఇండస్ట్రీస్ ఉద్యోగులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణ ● జై రాజకీయ వైరుధ్యాన్ని మంత్రి వివేక్ వ్యక్తిగతంగా తీసుకున్నారని ఆగ్రహం ● మంచిర్యాల కలెక్టర్, డీసీపీ, సీఐ, ఎస్సైలు వివేక్ తొత్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపాటు

మంచిర్యాల : మంచిర్యాల జిల్లా కలెక్టర్, డీసీపీ, సీఐ, ఎస్సైలు సహా రెవెన్యూ అధికారులు మంత్రి వివేక్ వెంకటస్వామి విశాఖ కంపెనీ ఉద్యోగులుగా మారిపోయారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలను ఇప్పటికైనా పాటించి క్యాతన్పల్లి మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా జైలులో 14 రోజుల పాటు రిమాండ్‌లో ఉన్న ఆయన ఈరోజు ఉదయం విడుదల అయ్యారు. మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక జరిగే తరుణంలో : గత నెలలో మున్సిపల్ ఫలితాల అనంతరం క్యాతన్పల్లి మొత్తం 22 స్థానాలకు బీఆర్ఎస్, సీపీఐలు కలిసి 14 దక్కించుకోగా 7 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచింది. దీంతో మున్సిపల్ ఎన్నిక నిర్వహించే తరుణంలో జరిగిన ఘర్షణలో సుమన్పై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. పలు రకాలుగా లాయర్లు బెయిల్ కోసం ప్రయత్నించగా ఈరోజు సుమన్ విడుదలయ్యారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ పార్టీకి చెందిన మరో ముగ్గురు నేతలు మూల రాజిరెడ్డి, దోమకొండ అనిల్, రామగిరి లక్ష్మణ్ కూడా బెయిల్‌పై విడులయ్యారు.

బయటకు రాకుండా కుట్రలు : ఈ సందర్భంలో మాజీ మంత్రి జోగు రామన్న బీఆర్ఎస్ నేతలు భారీ సంఖ్యలో వచ్చి జైలు నుంచి విడుదలైన బాల్క సుమన్‌కు పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. దీంతో జైలు పరిసరాల్లో పోలీసు శాఖ గట్టి బందోబస్తు ఏర్పాటు చేసింది. క్యాతన్పల్లి మున్సిపల్ ఎన్నికల్లో సంపూర్ణ ఆధిక్యత కలిగిన బీఆర్ఎస్కు పాలకవర్గం పగ్గాలు దక్కకుండా మంత్రి వివేక్ సూచనలకు అనుగుణంగా మంచిర్యాల జిల్లా అధికార యంత్రాంగం మొత్తం సహకరించిందని సుమన్ మండిపడ్డారు. ఈరోజు తన చిన్నకుమారుడి జన్మదినం ఉన్నందున తనను జైలు నుంచి బయటకు రాకుండా వేర్వేరు కేసులను తెరపైకి తెచ్చి అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. హోలీ రోజు తన కుటుంబం కార్యకర్తలతో కలిసి గడపకుండా ఉండేందుకు కుట్రలు చేశారన్నారు."మా కౌన్సిలర్లను ప్రలోభ పెట్టి మున్సిపాలిటీని దక్కించుకోవాలని చూశారు. నేనుంటే అది సాధ్యం కాలేదని నన్ను జైల్లో పెట్టి క్యాతన్పల్లి మున్సిపల్ ఛైర్మన్ పదవి వశపరచుకోవాలని మంత్రి వివేక్ వెంకటస్వామి చూశారు. అయినా కూడా మా కార్యకర్తలు బలంగా, మొండిగా నిలబడ్డారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్లు ప్రజాతీర్పును గౌరవించి అర్థం చేసుకోవాలని కోరుతున్నా. రాజకీయాల్లో వివిధ పార్టీల్లో వ్యక్తులు ఉండటం సహజం. రాజకీయ వైరుధ్యాలుగానే చూడాలి తప్ప వ్యక్తిగతంగా చూడకూడదు. నేను ఎప్పుడు ఎవరితోనూ వ్యక్తిగత శత్రుత్వాలు పెట్టుకోలేదు. కానీ ఈరోజు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ నాయకులను శత్రువులుగా చూస్తున్నారు. నేను పదేళ్లలో ఒక్కరిని కూడా జైలుకు పంపలేదు" అనిమాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, అన్నారు. అధికారులు పైన వచ్చే ఆదేశాలను పాటించారు : ఈ జిల్లాలోని అధికారులకు చట్టం, రాజ్యాంగం ఏమైనా తెలుసా? అని సుమన్ ధ్వజమెత్తారు. ప్రభుత్వాలు వస్తుంటాయ్ పోతుంటాయని అని అన్నారు. జైలులో తనకు చాలా ఇబ్బందులు ఎదురయ్యాయని చెప్పారు.




# ట్యాక్స్ కలెక్షన్స్‌పై ఫుల్ ఫోకస్..

● కోర్ అర్బన్ రీజియన్‌లోని జనాభాకు తగ్గ వసూళ్లు ● జీహెచ్ఎంసీలో విలీనంతో ట్యాక్స్ కలెక్షన్ రూ. 3 వేల కోట్లు టార్గెట్
● ఇప్పటి వరకు మూడు కార్పొరేషన్ల పరిధిలో దాదాపు రూ.2 వేల కోట్ల వరకు ట్యాక్స్ వసూలు

హైదరాబాద్: కోర్ అర్బన్ రీజియన్ లోని సుమారు కోటి 40 లక్షల మంది జనాభాకు అవసరాలకు తగిన అభివృద్ధితో పాటు పౌర, అత్యవసర సేవలందించే మూడు మున్సిపల్ కార్పొరేషన్లకు ప్రధాన ఆర్థిక వనరుల్లో ఒకటైన ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్‌పై మూడు కార్పొరేషన్ లోని అధికారులు బుధవారం నుంచి ఫుల్ ఫోకస్ పెట్టనున్నారు. ఇప్పటి వరకు జరిగిన ట్యాక్స్ కలెక్షన్లలో భాగంగా సైబరాబాద్ పేరుకు తగ్గట్టుగా కలెక్షన్ జరిగింది. మూడు కార్పొరేషన్లగా విభజించకముందు తొలుత రూ. 2200 కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్ ను అధికారులు టార్గెట్ గా పెట్టుకోగా, నవంబర్ 25 తర్వాత కోర్ అర్బన్ రీజియన్ లోని 27 పట్టణ స్థానిక సంస్థలను జీహెచ్ఎంసీలో విలీనం చేయటంతో ట్యాక్స్ కలెక్షన్ ను రూ. 3 వేల కోట్లుగా నిర్ణయించారు.

**రూ.2 వేల కోట్ల వరకు ట్యాక్స్ వసూలు :** పాత జీహెచ్ఎంసీ పరిధిలో సుమారు 19.5 లక్షల ప్రాపర్టీ ట్యాక్స్ ఇండెక్స్ నెంబర్లు (పీటీఐఎన్ ) ఉండగా, పట్టణ స్థానిక సంస్థల విలీనంతో పీటీఐఎన్ ల సంఖ్య అదనంగా మూడున్నర లక్షల వరకు పెరిగి, మూడు కార్పొరేషన్ల పరిధిలో పీటీఐఎన్ ల సంఖ్య సుమారు 23 లక్షలకు పెరిగినట్లు తెలిసింది. ఇప్పటి వరకు మూడు కార్పొరేషన్ల పరిధిలో దాదాపు రూ.2 వేల కోట్ల వరకు ట్యాక్స్ వసూలు కాగా, వీటిలో రూ. 815 కోట్ల కలెక్షన్ తో సైబరాబాద్ మొదటి స్థానంలో ఉండగా, రూ. 750 కోట్లతో జీహెచ్ఎంసీ రెండో స్థానంలో ఉండగా, రూ. 435 కోట్లతో మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ మూడో స్థానంలో ఉన్నట్లు అధికారులు వెల్లడించిన గణాంకాలు చెబుతున్నాయి.

**రూ.750 కోట్లు వసూలు :** పాత జీహెచ్ఎంసీ పరిధిలో సుమారు 19.5 లక్షల ప్రాపర్టీ ట్యాక్స్ ఇండెక్స్ నెంబర్లు (పీటీఐఎన్ ) ఉండగా, పట్టణ స్థానిక సంస్థల విలీనంతో పీటీఐఎన్ ల సంఖ్య అదనంగా మూడున్నర లక్షల వరకు పెరిగి, మూడు కార్పొరేషన్ల పరిధిలో పీటీఐఎన్ ల సంఖ్య సుమారు 23 లక్షలకు పెరిగినట్లు తెలిసింది. వీటిలో 11 పీటీఐఎన్ లు జీహెచ్ఎంసీ పరిధిలోకి రాగా, వీటి ద్వారా ఈ నెలాఖరు కల్లా సుమారు రూ. 1100 కోట్ల ట్యాక్స్ కలెక్షన్ చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు రూ.750 కోట్లు వసూలు కాగా, ఈ ఒక్క కార్పొరేషన్ పెట్టుకున్న టార్గెట్ ను చేరేందుకు రానున్న 25 రోజుల్లో దాదాపు రూ. 350 కోట్లను వసూలు చేయాల్సి ఉంది. సైబరాబాద్, మల్కాజ్ గిరి కార్పొరేషన్లను కలుపుని ఈ నెలాఖరు కల్లా మరో రూ. వెయ్యి కోట్లను వసూలు చేయాలన్న టార్గెట్ ఉంది.

**ఉచ్చు బిగించనున్నారా? :** ఒక వేపు అప్పులతో సంక్షోభం మరో వైపు ఆదాయ మార్గాలు తగ్గిపోవటంతో జీహెచ్ఎంసీ ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు చేసుకునేందుకు ఉచ్చు బిగించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ముఖ్యంగా ఏళ్ల నుంచి పన్ను చెల్లించని మొండి బకాయిదారులను గుర్తించి ఇప్పటికే వారికి రెండో నోటీసులు జారీ చేశారు. మరోసారి రెడ్ నోటీసులు జారీ చేసి వసూళ్ల కోసం ఫీల్డు లెవెల్ కు వెళ్లేందుకు జోనల్, డిప్యూటీ కమిషనర్లు కూడా వ్యూహం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. మూడోసారి రెడ్ నోటీసు జారీ చేసిన తర్వాత మూడు నుంచి అయిదు రోజుల గడువు విధించి, ఆ తర్వాత కూడా చెల్లించని పక్షంలో నేరుగా ప్రాపర్టీ వద్దకు వెళ్లి, సీజ్ చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

# మోడీతోనే బీసీలకు న్యాయం



● చరిత్రలో ఏ పార్టీ ప్రభుత్వం కులగణన చేయలేదు - ఆ ఘనత మోడికే దక్కుతుంది ● మోడీ నాయకత్వంతోనే చట్ట సభలలో రిజర్వేషన్లు సాధిస్తాం ● జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : బి.సి లకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంఘం అధ్యకులు ఆర్. కృష్ణయ్య తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొలిసారిగా జనగణనలో కులగణన చేపడుతుంది. ఇది దేశచరిత్రలో రికార్డు, 76 సంవత్సరాల చరిత్రలో ఏ పార్టీ కూడా కులగణన చేయలేదు. కులగణన తర్వాత బి.సి.లకు అన్ని రంగాలలో ముఖ్యంగా ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్యా, ఉద్యోగ రంగాలలో జనాభా ప్రకారం వాటా లభిస్తుంది. అన్ని కోణాలలో కులగణన తర్వాత సమాజంలో విప్లవాత్మక మైన మార్పు వస్తుందన్నారు.

75 కోట్లకు పైగా ఉన్న బీసీ వర్గాల చిరకాల కులగణన డిమాండ్ను కేంద్రం గౌరవించినట్లుగా ఆయన పేర్కొన్నారు. 1931లో బ్రిటిష్ ప్రభుత్వం తీసిన లెక్కల తరువాత నరేంద్ర మోడి ప్రభుత్వం సాహసిపోతా నిర్ణయం తీసుకుందని ప్రశంసించారు. ఇది చరిత్ర యన్నారు.కుల గణన తర్వాత బీసీలకు చట్టసభలలో 50% రిజర్వేషన్లు, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ, జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు పెంపు వంటి నిర్ణయాలు కూడా తీసుకుంటారని కృష్ణయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీల ఆశలకు ఆశయాలకు అలాగే డిమాండ్లకు అనుగుణంగా ప్రధానమంత్రి నిర్ణయాలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బి.సి.లు అన్ని రంగాలలో అభివృద్ధి మోడి ద్వారానే జరుగుతుందన్నారు.

బీసీలకు రిజర్వేషన్లను జనాభా గ్రూపులుగా వర్గీకరణ చేయడానికి జస్టిస్ రోహిణి అధ్యక్షతన కమిటీ నియమించారు ఆ రిపోర్ట్ ప్రకారం గ్రూపులు చేస్తున్నారు అలాగే ప్రత్యేక సంక్షేమ పథకాల రూపకల్పన, అవసరమైన బడ్జెటు కేటాయింపు, కార్యాచరణ ప్రణాళిక అమలులో ముందడుగు వంటివాటికి మార్గం సుస్పష్టం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థలలో బి.సి రిజర్వేషన్ల స్థానాలను పెంచి కేటాయించడానికి ఉపయోగపడుతుంది.

బీజేపీ పార్టీ బి.సి వర్గానికి చెందిన నరేంద్ర మోడీనే ప్రధాన మంత్రిగా చేసారు. అంతే కాదు 27 మంది మంత్రులను, నలుగురు గవర్నర్లను చేసారు. అలాగే ఒక గిరిజన మహిళను రాష్ట్రపతి చేసారు. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గా ఒక దళితున్ని చేశారు. మొత్తం దేశంలో యున్న ఉన్నత పదవులన్నీ బీజ/రాజ/గు లాకి ఇచ్చారు. గతం ఆ పార్టీ అయిన ఇలా ఇచ్చారా! అని ప్రశ్నించారు. ఇది సామాజిక న్యాయ చరిత్రలో ముందడుగుయని వ్యాఖ్యానించారు. దీనితో బి.సి.ల లెక్కలు పక్కగా ఖచ్చితమైన సంఖ్య తెలుపుతారు. అప్పుడే అన్ని రంగాలలో వాటా లభిస్తుంది.


ఈ సమావేశంలో ఈ క్రింది తీర్మానాలు ఆమోదించారు.

పార్లమెంట్ లో బి సి బిల్లు పెట్టి అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలలో 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలి.

కేంద్రం లో బి.సి లకు ప్రతేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసి 2 లక్షల కోట్లతో ప్రతేక అభివృద్ధి పథకం ప్రకటించాలి. బి సి ల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50 శాతం పెంచాలి. బి సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి. ఈ మేరకు రాజ్యాంగాన్ని సవరించాలి. బి.సి ల విద్య- ఉద్యోగ రిజర్వేషన్లు పై యున్న క్రిమిలేయర్ ను తొలగించాలి.

బి.సి లకు పారిశ్రామిక పాలసీ లో 50 శాతం కోటా ఇవ్వాలి.

హై కోర్టు – సుప్రీంకోర్టు జడ్జిల నియమాకంలో ఎస్సీ ఎస్టీ బీసీ రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలి. ప్రైవేటు రంగం లో ఎస్సీ ఎస్టీ బీసీ లకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలి. కేంద్రంలో ఖాలిగా యున్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి. అని ఆర్ కృష్ణయ్య పేర్కొన్నారు.




## ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై మంత్రుల సమీక్ష




హైదరాబాద్ : ములుగు జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి రైతులకు త్వరితగతిన నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రులు ఆదేశించారు. జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇవాళ ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న ప్రధాన ప్రాజెక్టుల పనుల స్థితిగతులు, నిధుల వినియోగం, ఎదురవుతున్న అడ్డంకులపై అధికారులు వివరణ ఇచ్చారు. కాగా జిల్లాలోని దేవాదుల ఎత్తిపోతల సహా గోదావరి నదిపై నిర్మాణంలో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉంది.

ఈ మేరకు గత నెలలో సీఎం ఈ ప్రాజెక్టులపై సీఎం క్లారిటీ ఇచ్చారు. రాబోయే రెండేళ్లలో ఎట్టి పరిస్థితుల్లో వీటిని ఎట్టిపరిస్థితుల్లో పూర్తి చేయాలనే చిత్తశుద్ధితో ఉన్నామని చెప్పారు. అవసరమైన నిధులు సత్వరం విడుదల చేస్తామన్నారు.

# ప్రజలే న్యాయ నిర్ణేతలు

● ప్రధానిగా చూడాలన్నది మా ఆశ ● కాదనటానికి మీరెవ్వరు
● బండి సంజయ్‌కి మంత్రి పొన్నం కౌంటర్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని ఆశించడం ఒక రాజకీయ పార్టీ గా మా హక్కు. అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బుధవారం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో నాయకత్వం ఎవరికి దక్కాలో నిర్ణయించేది బండి సంజయ్ కాదు. మరో వ్యక్తి కాదు. ప్రజలే న్యాయ నిర్ణేతలు..అన్నారు. ప్రజాస్వామ్యంలో పదవులు శాశ్వతం కావు. అవి ప్రజల విశ్వాసంపై ఆధారపడి ఉంటాయని ఈ దేశానికి పట్టిన గ్రహణం ఎవరో ప్రజలకు తెలుసన్నారు. గత 12 ఏళ్లుగా ప్రజలు ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నారని ఈ దేశాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి తమాషా చూస్తున్నారని ఎద్దేవా చేసారు. దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టిన మీరా మాట్లాడేది..? మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన వ్యవస్థలు అస్తవ్యస్థంగా మారింది..ప్రభుత్వ రంగ సంస్థలు తెగనమ్ముతున్నారన్నారు పొన్నం. ధరలు విపరీతంగా పెరుగుతున్నా, ఏనాడు .పేదలను ఆదుకునే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేయలేదు కానీ విద్వేషాన్ని రెచ్చగొట్టి మైనార్టీ లను అణగారిన వర్గాలను బూచిగా చూపి అధికారాన్ని చెలాయిస్తున విషయాన్ని జనం గమనిస్తున్నారన్నారు. బీజేపీ అదేశంలో . నిత్యం మతవిద్వేశాలు రెచ్చగొడుతూ రాజకీయం చేస్తోందని,.. కేంద్ర దర్యాప్తు సంస్థలను ఈడి సీబీఐ కేసులతో విపక్ష ప్రభుత్వాలను కూల్చి వేస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తు రాజకీయం మీదని పొన్నం ఆగ్రహం వ్యక్తం చేసారు. దేశ ఐక్యత కోసం కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసి దేశ ప్రజలకు ఐక్యతను చాటిన ఘనత రాహుల్‌దని గుర్తు పెట్టుకోవాలని అదే బిజెపీ ప్రభుత్వానికి నిద్ర లేకుండా చేస్తోందని అందుకే రాహుల్ గాంధీ ని విమర్శించడం చూస్తుంటే ఆకాశం మీద ఉమ్మిస్తే మీ ముఖం మీదే పడుతుంది ఆ వాస్తవాన్ని బండి సంజయ్ తెలుసుకోవాలి. రెండు సార్లు ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి అయి తెలంగాణ కు ప్రత్యేక నిధులు తీసుకురాని దద్దమ్మ బండి సంజయ్ మీ వ్యవహారశైలి మార్చుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## అమ్మవారి అనుగ్రహం అందరిపైన ఉండాలి



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: అమ్మవారి అనుగ్రహం అందరి పైన ఉండాలని, మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటూ, సమాజ ఐక్యత కోసం ముదిరాజ్ సోదరులు చేస్తున్న కృషి అభినందనీయం నీ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. బుధవారం మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ముడుచింతలపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టా మహోత్సవానికి ముఖ్య అతిథిగా ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలందరిపై అమ్మవారి చల్లని చూపు ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. గ్రామాభివృద్ధి కోసం, సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా అడుగులు వేయాలన్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన ముదిరాజ్ సంఘం సభ్యులకు, గ్రామ పెద్దలకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అమ్మవారి అనుగ్రహం మనందరిపై ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మూడు చింతపల్లి చైర్మన్ జామ్ రవి, ముడిచింతలపల్లి కౌన్సిలర్ నీరజ్ గౌడ్, నాగ్సెట్పల్లి కౌన్సిలర్ నవీన్ నాయక్, లక్ష్మాపూర్ కౌన్సిలర్ చినలచ్చి సరిత శ్రీనివాస్ గౌడ్, చంద్రశేఖర్ యాదవ్, మండల అధ్యక్షులు తప్పెట్ల నరేందర్ గౌడ్, జనరల్ సెక్రటరీ మరియు కౌన్సిలర్ శ్రీకాంత్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ శ్రీశైలం, ఉపాధ్యక్షురాలు సింగం విజయలక్ష్మి, రమ్య, వంగ రవీందర్ రెడ్డి, సుధాకర్ నాయక్, వీరేష్ నాయక్, రాయ్ శ్రీకాంత్ రెడ్డి, అరుణ్, నరేష్ పటేల్, గూగుల్ లోతు వెంకటేష్ నాయక్, మచ్చేందర్ రెడ్డి, రవి పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీకి లేఖ రాసిన మందకృష్ణ మాదిగ



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి ఎమ్మార్పీ ఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణలో భర్తీకాబోతున్న రాజ్యసభ స్థానాల్లో ఓ స్థానం మాదిగలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎస్సీ స్థానాలైన పెద్దపల్లి, వరంగల్, నాగర్ కర్నూల్ స్థానాల్లో కూడా మాదిగలకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి పార్లమెంట్‌లో మాదిగలకు ప్రాతినిధ్యం లేదని చెప్పుకొచ్చారు. ఇప్పుడు రాజ్యసభ స్థానాల్లో ఓ స్థానమైనా మాదిగలకు అవకాశం కల్పించాలని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు.

# సంపాదకీయం

suryaeditpage@gmail.com

## విశ్వవేదికపై భారత గళం

భారతదేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా మార్చి ఐదు నుంచి ఏడు వరకు ప్రతిష్టాత్మక రైసినా డైలాగ్ జరగనుంది. ఇది ప్రపంచ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థల గురించి చర్చించేందుకు భారతదేశం నిర్వహిస్తున్న అత్యంత ముఖ్యమైన అంతర్జాతీయ సదస్సు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహిస్తాయి. మారుతున్న ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ దేశాలన్నీ ఒకే వేదికపైకి వచ్చి తమ అభిప్రాయాలను పంచుకునేందుకు ఈ సదస్సు ఒక అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను సమష్టిగా ఎలా ఎదుర్కోవాలనే విషయంమై ఇందులో ప్రధానంగా చర్చిస్తారు. ఈ సదస్సుకు అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఆధునిక ప్రపంచంలో టెక్నాలజీ, వాతావరణ మార్పులు, ఉగ్రవాదం లాంటి ఎన్నో సమస్యలు అన్ని దేశాలను ప్రభావితం చేస్తున్నాయి. ఇలాంటి సమయంలో భూగోళం నలుమూలల నుంచి వివిధ దేశాల ప్రతినిధులు ఒకచోట చేరి పరిష్కార మార్గాలను అన్వేషించడానికి రైసినా డైలాగ్ ఒక వారధిలా పనిచేస్తుంది. ఆసియా ఖండం నుంచే కాకుండా ప్రపంచం నలుమూలల నుంచి వస్తున్న వివిధ సమస్యలపై గళం విప్పేందుకు, ప్రపంచ శాంతి కోసం కొత్త విధానాలను రూపొందించేందుకు ఇది సరైన వేదికగా నిలుస్తుంది. భౌగోళిక రాజకీయాల్లో వస్తున్న మార్పులను విశ్లేషించడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం.

ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అనేక దేశాల అధినేతలు, ప్రధాన మంత్రులు, విదేశాంగ మంత్రులు, ఉన్నతాధికారులు హాజరవుతారు. వారితో పాటు వివిధ అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, ప్రముఖ వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, మీడియా ప్రతినిధులు, రక్షణ రంగ నిపుణులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. దాదాపు వందకు పైగా దేశాల నుంచి వందలాది మంది ప్రతినిధులు ఈ సదస్సులో తమ గళాన్ని వినిపిస్తారు. వివిధ దేశాల నిర్ణయాలను ప్రభావితం చేయగల వ్యక్తులంతా ఒకే చోట చేరడం వల్ల ఈ సమావేశాలకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక ఆకర్షణ సంతరించుకుంది. ఈ సదస్సు వల్ల భారతదేశానికి అనేక విధాలుగా ప్రయోజనాలు చేకూరుతాయి. ప్రపంచ దేశాల దృష్టిలో భారతదేశపు దౌత్యపరమైన హోదా మరింత పెరుగుతుంది, అంతర్జాతీయ నిర్ణయాలలో మన దేశం కీలక పాత్ర పోషించడానికి అవకాశం దక్కుతుంది. వివిధ దేశాల అధినేతలతో నేరుగా చర్చలు జరపడం వల్ల ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడతాయి, వాణిజ్యపరమైన ఒప్పందాలు పెరగడానికి దారి తీస్తుంది. సాంకేతిక పరిజ్ఞానం, రక్షణ రంగం లాంటి విషయాల్లో ఇతర దేశాలతో కొత్త ఒప్పందాలు కుదుర్చుకోవడానికి ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుంది. మొత్తంగా చూసుకుంటే ప్రపంచ వేదికపై భారతదేశాన్ని ఒక బలమైన శక్తిగా నిలబెట్టడానికి రైసినా డైలాగ్ ఒక ముఖ్యమైన సాధనంగా మారుతుంది.

ఈ సదస్సులో చర్చించే అంశాలు కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా మానవాళి ఎదుర్కొంటున్న అనేక సంక్లిష్ట సమస్యలను స్పృశిస్తాయి. ముఖ్యంగా గ్లోబల్ సౌత్ అని పిలవబడే అభివృద్ధి చెందుతున్న దేశాల గొంతుకను ప్రపంచానికి వినిపించడంలో ఈ వేదిక కీలక పాత్ర పోషిస్తుంది. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ఆర్థిక అసమానతలు, సరఫరా గొలుసు వ్యవస్థలో తలెత్తుతున్న ఆటంకాలు, ఆహార భద్రత వంటి అంశాలపై ఇక్కడ లోతైన విశ్లేషణలు జరుగుతాయి. డిజిటల్ విప్లవం కొనసాగుతున్న తరుణంలో సైబర్ భద్రత, కృత్రిమ మేధస్సు వల్ల కలిగే లాభనష్టాల గురించి ప్రపంచ మేధావులు తమ అభిప్రాయాలను పంచుకుంటారు. ఈ చర్చలు భవిష్యత్తులో దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడానికి, అంతర్జాతీయ నిబంధనలను రూపొందించడానికి పునాదిగా మారుతాయి. అంతేకాకుండా సముద్ర తీర భద్రత, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల పరిష్కారానికి ఈ వేదిక వేదికగా నిలుస్తుంది. పర్యావరణ మార్పుల వల్ల చిన్న దేశాలు ఎదుర్కొంటున్న ముప్పులను పెద్ద దేశాల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా ఒక సమతుల్యమైన అభివృద్ధిని సాధించాలని ఈ సదస్సు ఆకాంక్షిస్తుంది. భారతదేశం తన వసుధైవ కుటుంబకం అనే నినాదంతో ప్రపంచాన్ని ఒకే తాటిపైకి తెచ్చే ప్రయత్నంలో ఈ డైలాగ్ ఒక మైలురాయిగా నిలుస్తుంది. వివిధ దేశాల మధ్య ఉన్న విభేదాలను పక్కన పెట్టి మానవతా దృక్పథంతో ఆలోచించేలా ప్రతినిధులను ప్రోత్సహించడం దీని ప్రధాన లక్ష్యం. ఈ మూడు రోజుల పాటు జరిగే మేధోమథనం కేవలం మాటలకే పరిమితం కాకుండా ఆచరణాత్మక ఫలితాలను ఇచ్చే దిశగా సాగుతుంది. ఇరాన్ యుద్ధ వాతావరణం వల్ల భారతదేశం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చాబహార్ ఓడరేవు ప్రాజెక్టు, అంతర్జాతీయ ఉత్తర-దక్షిణ రవాణా కారిడార్ వంటి కనెక్టివిటీ పథకాలపై నీలినీడలు ముసురుకుంటున్నాయి. ఈ సదస్సులో భారత దౌత్యవేత్తలు ఈ ప్రాజెక్టుల భవిష్యత్తు గురించి, అలాగే మధ్య ఆసియా దేశాలతో మన సంబంధాలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చిస్తారు. యుద్ధం వల్ల సరఫరా గొలుసులో తలెత్తే ఇబ్బందులు, సముద్ర మార్గాల్లో భద్రత వంటి అంశాలు రైసినా డైలాగ్ వేదికగా చర్చకు రానున్నాయి. ఇరాన్‌లో అధికార మార్పిడి లేదా అక్కడి అంతర్గత పరిస్థితులు పొరుగు దేశాలపై చూపే ప్రభావంపై నిపుణులు తమ విశ్లేషణలను అందిస్తారు. పశ్చిమ ఆసియాలో శాంతి నెలకొంటేనే భారత్ ఆర్థికంగా మరింత పురోగమించగలదు, అందుకే ఈ సదస్సు ద్వారా ఒక మధ్యేమార్గ పరిష్కారాన్ని అన్వేషించే ప్రయత్నం జరుగుతుంది. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉన్న వైరుధ్యాలను తగ్గించడానికి దౌత్యపరమైన మార్గాలను ఈ వేదిక సూచిస్తుంది. కేవలం సైనిక చర్యల ద్వారా కాకుండా, చర్చల ద్వారానే దీర్ఘకాలిక శాంతి సాధ్యమని భారతదేశం తన గట్టి నమ్మకాన్ని ఈ ప్రపంచ వేదికపై చాటి చెప్పనుంది. ఈ సంక్షోభం వల్ల ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యం ముప్పులను అరికట్టడానికి అన్ని దేశాలు సమష్టిగా పని చేయాల్సిన అవసరాన్ని రైసినా డైలాగ్ నొక్కి చెబుతుంది. ఒరైసినా డైలాగ్ వేదికగా భారతదేశం తన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని ప్రపంచానికి మరోసారి చాటిచెప్పనుంది. ఇరాన్ సంక్షోభం వంటి క్లిష్ట సమయాల్లో ఏదో ఒక పక్షం వహించకుండా, శాంతి స్థాపన కోసం మధ్యవర్తిత్వం వహించగల సామర్థ్యం భారత్‌కు ఉందని ఈ చర్చల ద్వారా స్పష్టమవుతుంది. ముఖ్యంగా ఇంధన అవసరాల కోసం పశ్చిమ ఆసియా దేశాలపై ఆధారపడిన భారత్, అక్కడ యుద్ధ వాతావరణం నెలకొంటే తన ఆర్థిక ప్రయోజనాలను ఎలా కాపాడుకోవాలో ఈ వేదికపై వివరిస్తుంది. అంతర్జాతీయ చట్టాలను గౌరవిస్తూనే, దేశీయ అవసరాలకు ప్రాధాన్యతనిచ్చే భారత వ్యూహం ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఒక దిక్సూచిలా మారుతుంది. ఈ క్రమంలోనే రష్యా, అమెరికా వంటి అగ్రరాజ్యాలతో సమతుల్య సంబంధాలను కొనసాగిస్తూనే, ప్రాంతీయ స్థిరత్వం కోసం భారత్ చేసే ప్రతిపాదనలు అందరినీ ఆకర్షిస్తాయి. ఈ సదస్సులో భాగంగా నిర్వహించే ప్రత్యేక సమావేశాల్లో ఉగ్రవాద నిర్మూలన, సముద్రపు దొంగల బెడద, సైబర్ దాడుల వంటి అంశాలపై గట్టి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఇరాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరగడం వల్ల అంతర్జాతీయ వాణిజ్య మార్గాలకు కలిగే ముప్పును అరికట్టడానికి ఒక ఉమ్మడి భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయాలని భారత్ కోరవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులు ఒకచోట చేరి చేసే ఈ ఆలోచనలు, కేవలం చర్చలకే పరిమితం కాకుండా ఐక్యరాజ్యసమితి వంటి సంస్థల్లో కూడా ప్రతిధ్వనిస్తాయి. భారత్ నాయకత్వంలో గ్లోబల్ సౌత్ దేశాలన్నీ ఒకే తాటిపైకి వచ్చి తమ గొంతుకను వినిపించడం వల్ల అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక నూతన అధ్యాయం మొదలవుతుంది. మొత్తం మీద చెప్పాలంటే, మార్చి 5 నుంచి 7 వరకు జరిగే ఈ రైసినా డైలాగ్, ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో భారతదేశాన్ని ఒక తిరుగులేని శక్తిగా నిలబెడుతుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా దౌత్యనీతిని మార్చుకుంటూ, ప్రపంచ శాంతి కోసం భారత్ పడుతున్న తపన ఈ సదస్సు ద్వారా ప్రతిబింబిస్తుంది. ఇరాన్ యుద్ధ భయాలు, ఆర్థిక అనిశ్చితి వంటి సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవడానికి అవసరమైన ధైర్యాన్ని, దిశానిర్దేశాన్ని ఈ వేదిక అందిస్తుంది. ఢిల్లీ వేదికగా జరిగే ఈ మేధోమథనం కేవలం మూడు రోజుల కార్యక్రమం మాత్రమే కాదు, ఇది రాబోయే దశాబ్ద కాలపు ప్రపంచ గమనాన్ని నిర్దేశించే ఒక గొప్ప ప్రయత్నం.



# ఇరాన్ యుద్ధం ఎన్నాళ్లు ?

- దేశ సర్వోన్నత నాయకుడు అలీ ఖమేనీ మరణంసైతం ఆపని యుద్ధం
- కీలక సైనిక శక్తి -విప్లవ దళాల అగ్రనేతలు అంతమైనా వెనుదిరగని అగ్రరాజ్యం
- పెరుగుతున్న అంతర్గత అలజడిని కొత్త నాయకత్వం అదుపు చేయగలదా ? అని అనుమానాలు
- హమాస్, హిజ్బుల్లా, హౌతీ వంటి అనుబంధ గ్రూపుల ద్వారా ఇతర దేశాలపై ఒత్తిడి పెంచుతున్న ఇరాన్
- చమురు ధరల పెరుగుదల నుంచి అంతర్జాతీయ భద్రత వరకు ప్రతిదీ చర్చనీయ అంశం

తేజస్విని
హైదరాబాద్

ప్రస్తుతం ఇరాన్ ఒక చారిత్రాత్మక సంధి కాలంలో నిలిచి ఉంది, ఆ దేశ సర్వోన్నత నాయకుడు అలీ ఖమేనీ మరణంతో పాటు అగ్రశ్రేణి సైనిక కమాండర్లు వరుస దాడుల్లో ప్రాణాలు కోల్పోవడం ప్రపంచవ్యాప్తంగా పెను సంచలనాన్ని సృష్టిస్తోంది. ఇరాన్ ఇస్లామిక్ విప్లవం తర్వాత ఆ దేశాన్ని దశాబ్దాల పాటు నడిపించిన ఖమేనీ యుగం ముగియడం, అదే సమయంలో కీలక సైనిక శక్తి అయిన విప్లవ దళాల అగ్రనేతలు అంతమవ్వడం వల్ల టెహ్రాన్ అధికార కేంద్రంలో భారీ శూన్యం ఏర్పడింది. ఈ నాయకత్వ పతనం కేవలం ఇరాన్‌కు మాత్రమే పరిమితం కాకుండా, మొత్తం పశ్చిమ ఆసియాలో యుద్ధ జ్వాలలను మరింత రాజేస్తోంది. అస్థిరతకు మారుపేరుగా మారిన ఈ పరిస్థితులు, ప్రపంచాన్ని మరో భీకర యుద్ధం వైపు నెట్టివేస్తున్నాయి.

ఇరాన్ పగ్గాలు ఇప్పుడు ఎవరి చేతుల్లోకి వెళ్తాయి, పెరుగుతున్న అంతర్గత అలజడిని కొత్త నాయకత్వం అదుపు చేయగలదా అన్నది ఇప్పుడు ప్రపంచ దేశాల ముందున్న అతిపెద్ద ప్రశ్న. ఖమేనీ వంటి బలమైన శక్తి లేని సమయంలో ఇరాన్ అనుబంధ గ్రూపులైన హిజ్బుల్లా, హమాస్, హౌతీలు తమ ఉనికిని కాపాడుకోవడానికి మరింత భీకర దాడులకు పాల్పడే అవకాశం ఉంది. ఈ నాయకత్వ నిర్మూలన వ్యూహం ఇరాన్‌ను లొంగదీసుకుంటుందా లేదా మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీసే విధంగా ప్రతిఘటనను పెంచుతుందా అన్నది అగ్రరాజ్యాల ఎత్తుగడలపై ఆధారపడి ఉంది. చమురు ధరల పెరుగుదల నుంచి అంతర్జాతీయ భద్రత వరకు ప్రతి అంశం ఇప్పుడు ఇరాన్‌లో తలెత్తిన ఈ పెను మార్పులతో ముడిపడి ఉంది.

**ఇరాన్ నాయకత్వ సంక్షోభం:** ఇరాన్ దేశంలో అగ్రశ్రేణి సైనిక, రాజకీయ నాయకులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరుగుతున్నా, ఆ దేశ పాలనా యంత్రాంగం అంత సులభంగా కుప్పకూలదు. ఇరాన్ కేవలం ఒక వ్యక్తి చుట్టూ తిరిగే నియంతృత్వ దేశం కాదు, అక్కడ అధికార వికేంద్రీకరణతో కూడిన బహుళ అంచెల వ్యవస్థ ఉంది. అత్యున్నత నాయకుడు అలీ ఖమేనీ సైన్యం, న్యాయవ్యవస్థ, విదేశాంగ విధానంపై పూర్తి పట్టు కలిగి ఉంటారు. ఒకవేళ మొదటి శ్రేణి నాయకత్వం దెబ్బతిన్నా, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ తన మూడవ శ్రేణి కమాండర్లను రంగంలోకి దించి పోరాటాన్ని కొనసాగించేలా ముందే శిక్షణ ఇచ్చింది. నాయకత్వం ఎంతవరకు సమర్థవంతంగా పనిచేస్తుందనేది ఆ దేశ ప్రజల మద్దతు, అంతర్గత ఐక్యతపై ఆధారపడి ఉంటుంది. దశాబ్దాలుగా ఇరాన్ ఇటువంటి క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవడానికి తన కమ్యూనికేషన్ వ్యవస్థను సిద్ధం చేసుకుంది. ఒకవేళ కీలక నాయకులు దూరమైనా, మతపరమైన కౌన్సిల్, జాతీయ భద్రతా మండలి నిర్ణయాలు తీసుకుంటూ యుద్ధాన్ని ముందుకు నడిపించే అవకాశం ఉంది. అయితే సుదీర్ఘ కాలం దాడులు కొనసాగితే వ్యూహాత్మక సమన్వయం లోపించి పట్టు కోల్పోయే ప్రమాదం కూడా లేకపోలేదు.

**ఆయుధ సంపత్తి,యుద్ధ కాల పరిమితి:** ఇరాన్ సైనిక వ్యూహం కేవలం సంప్రదాయ యుద్ధంపైనే కాకుండా, శత్రువులను అలసిపోయేలా చేసే సుదీర్ఘ పోరాటంపై ఆధారపడి ఉంటుంది. గత కొన్ని దశాబ్దాలుగా ఆ దేశం వేల సంఖ్యలో బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లను భారీగా నిల్వ చేసుకుంది. వీటిని భూగర్భ నగరాల్లో భద్రపరచడం వల్ల వైమానిక దాడుల నుంచి వాటిని కాపాడుకోవడం వారికి సులభం అవుతుంది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి వద్ద ఇరాన్ నౌకాదళం శత్రువులకు పెద్ద సవాలుగా మారుతుంది. తీవ్రమైన దాడులు ఎదురైనప్పుడు ఇరాన్ వద్ద ఉన్న క్షిపణి నిల్వలు కొన్ని వారాల నుంచి కొన్ని నెలల వరకు సరిపోవచ్చు. డ్రోన్లను వారు స్వదేశీ పరిజ్ఞానంతో వేగంగా తయారు చేయగలరు కాబట్టి వాటి సరఫరా నిరంతరాయంగా సాగే అవకాశం ఉంది. కానీ సరఫరా గొలుసు దెబ్బతిని, మౌలిక సదుపాయాలు ధ్వంసమైతే సుమారు అరవై నుంచి నూట ఇరవై రోజుల తర్వాత వారి పోరాట సామర్థ్యం గణనీయంగా తగ్గుతుంది. అంతర్జాతీయ ఆంక్షల వల్ల ముడి పదార్థాల కొరత ఏర్పడితే యుద్ధాన్ని ఎక్కువ కాలం కొనసాగించడం ఇరాన్‌కు కష్టతరంగా మారుతుంది.

**అనుబంధ గ్రూపుల పాత్ర, మద్దతు:** ఇరాన్ తన సొంత భూభాగం నుంచి కాకుండా హమాస్, హిజ్బుల్లా, హౌతీ వంటి అనుబంధ గ్రూపుల ద్వారా ఇతర దేశాలపై ఒత్తిడి పెంచుతుంది. లెబనాన్ కేంద్రంగా పనిచేసే హిజ్బుల్లా వద్ద భారీ క్షిపణి సంపత్తి ఉండటం వల్ల వారు ఇజ్రాయెల్‌కు నిరంతర ముప్పుగా పరిణమిస్తారు. యెమెన్‌లోని హౌతీలు ఎర్ర సముద్రంలో అంతర్జాతీయ నౌకాయానాన్ని అడ్డుకోవడం ద్వారా ప్రపంచ వాణిజ్యాన్ని స్తంభింపజేయగలరు. ఒకవేళ ఇరాన్ బలహీనపడితే ఈ గ్రూపులకు అందుతున్న ఆర్థిక, ఆయుధ సహకారం తగ్గిపోతుంది. హమాస్ ఇప్పటికే తీవ్రమైన దాడుల వల్ల కొంత మేర బలహీనపడినప్పటికీ, హిజ్బుల్లా స్వతంత్రంగా ఎక్కువ కాలం పోరాడగలదు. హౌతీలు స్థానికంగా పట్టు కలిగి ఉండటం వల్ల ఇరాన్ సహాయం తగ్గినా ఆ ప్రాంతంలో అశాంతిని కొనసాగించగలరు. ఈ గ్రూపులు యుద్ధాన్ని ప్రాంతీయ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

**రష్యా, చైనా, ఉత్తర కొరియా వైఖరి:** రష్యా, చైనా వంటి దేశాలు ఇరాన్‌కు దౌత్యపరమైన మద్దతు ఇస్తున్నప్పటికీ, నేరుగా యుద్ధంలోకి దూకే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. రష్యా ఇప్పటికే ఉక్రెయిన్ యుద్ధంలో నిమగ్నమై ఉండటం వల్ల కేవలం సాంకేతిక పరిజ్ఞానం లేదా నిఘా సమాచారాన్ని మాత్రమే ఇరాన్‌కు అందించవచ్చు. అమెరికా లేదా ఇతర అగ్రరాజ్య దళాలు పూర్తి స్థాయిలో రంగంలోకి దిగితే తప్ప రష్యా తన సైన్యాన్ని పంపే సాహసం చేయదు. మరోవైపు చైనా తన ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవడానికే మొదటి ప్రాధాన్యత ఇస్తుంది. పశ్చిమ ఆసియా నుంచి వచ్చే చమురుపై చైనా ఆధారపడి ఉన్నందున, అక్కడ యుద్ధం ఆగిపోవాలని కోరుకుంటుందే తప్ప ప్రత్యక్ష జోక్యం చేసుకోదు. ఉత్తర కొరియా రహస్యంగా ఆయుధాలను సరఫరా చేసినా, బహిరంగంగా ఇరాన్ పక్షాన నిలబడటం కష్టమే. మొత్తంగా చూస్తే వీరు కేవలం తెర వెనుక సహాయం చేసే మిత్రులుగా మాత్రమే మిగిలిపోయే అవకాశం ఉంది.


**మూడవ ప్రపంచ యుద్ధం ముప్పు, దౌత్య వైఫల్యం:** ప్రస్తుత పరిస్థితులు మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీస్తాయా అనే ఆందోళన అందరిలోనూ నెలకొంది. ప్రపంచ యుద్ధం సంభవించాలంటే అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యా, చైనా నేరుగా ఒకదానితో ఒకటి తలపడాలి. ప్రస్తుతం ఏ దేశం కూడా అణు యుద్ధాన్ని లేదా ప్రపంచ స్థాయి ఆర్థిక సంక్షోభాన్ని కోరుకోవడం లేదు. అయితే ఏదైనా పొరపాటున అమెరికా స్థావరాలపై లేదా ఇజ్రాయెల్ అణు కేంద్రాలపై దాడులు జరిగితే పరిస్థితులు అదుపు తప్పుతాయి. ఒకవేళ యుద్ధం ముదిరితే అగ్రరాజ్యాలు ఇరాన్ లో తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించవచ్చు. గతంలో ఇరాక్ వంటి దేశాల్లో జరిగిన చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుంటే, ఆధునిక కాలంలో నేరుగా ఆక్రమించుకోవడం రాజకీయంగా చాలా ఖరీదైన వ్యవహారం. అందువల్ల అంతర్గత తిరుగుబాటులను ప్రోత్సహించడం ద్వారా పాలనను మార్చే వ్యూహాన్ని అమెరికా అనుసరించే అవకాశం ఉంది.

**ఆర్థిక ప్రభావం, భారతదేశంపై పర్యవసానాలు:** ఈ యుద్ధం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది, ముఖ్యంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకుతాయి. హోర్ముజ్ జలసంధి మూతపడితే చమురు ధరలు గతంలో ఎన్నడూ లేని విధంగా పెరిగే ప్రమాదం ఉంది. దీనివల్ల రవాణా ఖర్చులు పెరిగి ప్రపంచవ్యాప్తంగా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతాయి. పెట్టుబడిదారులు స్టాక్ మార్కెట్ల నుంచి డబ్బు వెనక్కి తీసుకోవడం వల్ల మార్కెట్లు కుప్పకూలే అవకాశం ఉంది. భారతదేశం తన చమురు అవసరాల కోసం పశ్చిమ ఆసియాపై ఎక్కువగా ఆధారపడి ఉంది కాబట్టి ఇక్కడ ఇంధన ధరలు పెరుగుతాయి. దీనివల్ల రూపాయి విలువ పడిపోవడం, ద్రవ్యోల్బణం పెరగడం వంటి సమస్యలు ఎదురవుతాయి. మధ్య ప్రాచ్యంలో పనిచేస్తున్న లక్షలాది మంది భారతీయుల భద్రత కూడా ఆందోళనకరంగా మారుతుంది. ఇటువంటి సమయంలో భారత్ తటస్థ వైఖరిని అవలంబిస్తూనే, తక్షణమే యుద్ధ విరమణ జరగాలని అంతర్జాతీయ వేదికలపై గళం విప్పుతుంది.

**సామాన్యుడిపై ప్రభావం:** యుద్ధం వల్ల సామాన్య ప్రజలు ఎదుర్కొనే కష్టాలు వర్ణనాతీతం. ఆహార పదార్థాల కొరత, నిరుద్యోగం, అధిక వడ్డీ రేట్లు సామాన్యుడి నడ్డి విరుస్తాయి. ఇరాన్ లోని ప్రజలు విద్యుత్ కోతలు, బ్యాంకింగ్ సేవల నిలిపివేత, నిరంతర భయంతో బతకాల్సి వస్తుంది. యుద్ధం ఏ దేశంలో జరిగినా దాని ప్రభావం ఇంటర్నెట్ ద్వారా అనుసంధానమైన నేటి ప్రపంచంలో ప్రతి ఇంటా కనిపిస్తుంది. యుద్ధం ఎంతకాలం కొనసాగుతుందనేది మూడు రకాలుగా ఊహించవచ్చు. ఒకవేళ ఇరాన్ నాయకత్వం త్వరగా లొంగిపోతే కొన్ని రోజుల్లో ముగిసిపోవచ్చు. అలా కాకుండా క్షిపణి దాడులు కొనసాగితే రెండు నుంచి నాలుగు నెలల వరకు సాగుతుంది. ఒకవేళ ఇతర దేశాలు, అనుబంధ గ్రూపులు పూర్తి స్థాయిలో పాల్గొంటే ఈ యుద్ధం ఆరు నెలల నుండి రెండు ఏళ్ల వరకు సాగే ప్రమాదం ఉంది. చివరికి యుద్ధం ఎవరికి విజయాన్ని అందించినా, మానవజాతికి మాత్రం తీరని నష్టాన్ని మిగిలిస్తుంది. యుద్ధం ఎంత భీకరంగా సాగుతున్నా, చివరికి శాంతి అనేది చర్చల ద్వారానే సాధ్యమవుతుందని చరిత్ర చెబుతోంది. ప్రస్తుతం ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు ఇరాన్ దాని ప్రత్యర్థిదేశాల మధ్య మధ్యవర్తిత్వం వహించడానికి ప్రయత్నిస్తున్నాయి. అయితే ఇరు పక్షాల మధ్య నమ్మకరాహిత్యం పెరగడం వల్ల ఈ దౌత్య ప్రయత్నాలు ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇవ్వడం లేదు. ఈ క్రమంలో భారతదేశం వంటి దేశాలు అనుసరించే తటస్థ వైఖరి ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుంది. యుద్ధం వల్ల కలిగే ఆర్థిక నష్టాలను నివారించడానికి అభివృద్ధి చెందిన దేశాలు ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది.

మరోవైపు ఇరాన్ తనఅణు కార్యక్రమాలను వేగవంతం చేసే అవకాశం ఉందన్న వార్తలు అంతర్జాతీయ సమాజంలో మరింత కలకలం రేపుతున్నాయి. ఒకవేళ ఇరాన్ అణు సామర్థ్యాన్ని ప్రదర్శిస్తే, అది మధ్య ప్రాచ్యంలో ఆయుధ పోటీకి దారితీస్తుంది. ఇది కేవలం ప్రాంతీయ యుద్ధంగా మిగిలిపోకుండా, ప్రపంచ దేశాలన్నింటినీ ప్రభావితం చేసే అణు యుద్ధంగా మారే ప్రమాదం ఉంది. అందువల్ల దౌత్య మార్గాల ద్వారా ఇరాన్ అభ్యంతరాలను వినడం, అదే సమయంలో ఆ ప్రాంతంలో స్థిరత్వాన్ని కాపాడటం ప్రపంచ దేశాల ముందున్న తక్షణ సవాలు. యుద్ధం ఎక్కడ జరిగినా దాని మొదటి బాధితులు నిరపరాధులైన సామాన్య ప్రజలే. ఇరాన్‌లో యుద్ధం తీవ్రతరమైతే లక్షలాది మంది ప్రజలు పొరుగు దేశాలైన టర్కీ, పాకిస్థాన్ , ఇరాక్ వైపు శరణార్థులుగా తరలిపోయే అవకాశం ఉంది. ఇది ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలపై భారాన్ని పెంచడమే కాకుండా, మానవ హక్కుల ఉల్లంఘనకు దారితీస్తుంది. ఆహారం, మందులు , కనీస అవసరాల కోసం ప్రజలు అల్లాడిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. అంతర్జాతీయ సహాయక సంస్థలు ఈ ముప్పును ముందుగానే పసిగట్టి సహాయక చర్యల కోసం సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా యుద్ధ భూమిలో చిక్కుకున్న మహిళలు , పిల్లల పరిస్థితి అత్యంత దయనీయంగా మారుతుంది. విద్యా వ్యవస్థలు దెబ్బతినడం, ఆసుపత్రులపై దాడులు జరగడం వంటి పరిణామాలు ఆ దేశ భవిష్యత్తును దశాబ్దాల వెనక్కి నెట్టివేస్తాయి. యుద్ధం ముగిసినా ఆ గాయాల నుంచి కోలుకోవడానికి ఇరాన్ ప్రజలకు చాలా సమయం పడుతుంది. ప్రపంచ దేశాలు కేవలం వ్యూహాల గురించి మాత్రమే కాకుండా, ఈ మానవతా కోణం గురించి కూడా ఆలోచించి యుద్ధాన్ని ఆపడానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇరాన్ యుద్ధం అనేది కేవలం ఒక ప్రాంతానికి సంబంధించిన సమస్య కాదు, ఇది గ్లోబల్ విలేజ్ అని పిలవబడే నేటి ఆధునిక ప్రపంచపు మనుగడకు సంబంధించిన అంశం. యుద్ధం ఎంతకాలం కొనసాగుతుందనేది టెహ్రాన్ నాయకత్వ స్థిరత్వం, అమెరికా రాజకీయ నిర్ణయాలు , రష్యా-చైనాల మద్దతుపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ యుద్ధం సుదీర్ఘ కాలం సాగితే ప్రపంచం ఆర్థిక మాంద్యం దిశగా పయనించే ప్రమాదం ఉంది. దీనివల్ల ధనిక దేశాల కంటే భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలే ఎక్కువ నష్టపోతాయి. శక్తి రాజకీయాలు ఎప్పుడూ దేశాల మధ్య వైరాన్ని పెంచుతాయి, కానీ ఆర్థిక సంక్షోభం మాత్రం అన్ని దేశాలను ఒక్కటిగా ఆలోచింపజేస్తుంది. ఇప్పుడు ప్రపంచం ఒక సందిగ్ధంలో ఉంది: వినాశకరమైన యుద్ధాన్ని కొనసాగించాలా లేదా చర్చల ద్వారా సామరస్యపూర్వక పరిష్కారాన్ని అన్వేషించాలా? చరిత్ర మనకు నేర్పిన పాఠం ఏమిటంటే, యుద్ధాలు గెలుపు ఓటములను నిర్ణయించవు, కేవలం విధ్వంసాన్ని మాత్రమే మిగిలిస్తాయి. ప్రపంచ దేశాలన్నీ తమ స్వార్థ ప్రయోజనాలను పక్కన పెట్టి, మానవతా దృక్పథంతో వ్యవహరిస్తేనే ఈ సంక్షోభం నుంచి బయటపడటం సాధ్యమవుతుంది.

# రవాణాకే కాదు, సంస్కృతికి కూడా వారధి.. !



పెంటమరాజు గోపాల్ రావు
9494273373

ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం ఒక వినూత్న మలుపు తిరిగింది. సాధారణంగా ఒక పర్యాటకుడు కొత్త నగరంలో అడుగుపెట్టగానే మొదట కలిసేది, పలకరించేది ఆటో లేదా క్యాబ్ డ్రైవర్‌నే. ఆ మొదటి పరిచయమే ఆ నగరంపై, ఆ రాష్ట్రంపై ఒక అభిప్రాయాన్ని కలిగిస్తుంది. ఈ కీలకమైన అంశాన్ని గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, 'రాపిడో' సంస్థతో కలిసి చేపట్టిన 'డ్రైవర్-కమ్-గైడ్' శిక్షణ కార్యక్రమం పర్యాటక రంగంలో ఒక విప్లవాత్మక అడుగుకు నాంది పలికింది.

**డ్రైవర్ నుంచి రాయబారి వరకు** విజయవాడ వేదికగా ప్రారంభమైన ఈ పైలట్ ప్రాజెక్ట్ కేవలం ఉపాధి నైపుణ్యాల పెంపు మాత్రమే కాదు, ఒక సామాజిక గౌరవ ప్రధాన ఉత్సవం. డ్రైవర్లను కేవలం వాహన చోదకులుగా చూడకుండా మన చరిత్రను, సంస్కృతిని చాటిచెప్పే 'పర్యాటక రాయబారులుగా' తీర్చిదిద్దడం వెనుక ఉన్న దూరదృష్టి అభినందనీయం. అమరావతి, నాగార్జునసాగర్ వంటి రాష్ట్రంలోని చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల గురించి కథల రూపంలో వివరించగలిగేలా వారికి శిక్షణ ఇవ్వడం వల్ల, పర్యాటకులకు కేవలం ప్రయాణం మాత్రమే కాకుండా ఒక అనుభూతి లభిస్తుంది. శిక్షణలో భాగంగా పర్యాటకులను ఆకట్టునేలా'జిజ్ఞాస ఆర్ట్‌వర్స్' సహకారంతో ప్రత్యేక స్టోరీ టెల్లింగ్ కోర్సుతో కేవలం చరిత్రనే కాకుండా, ఆధునిక సాంకేతికతను జోడించడం ఈ ప్రాజెక్టులోని అసలు సిసలు బలం. విదేశీ పర్యాటకులతో భాషా సమస్య లేకుండా సంభాషించడానికి భాషిణి యాప్ ఒక గొప్ప ఆయుధం. అదే విధంగా రాపిడో యాప్‌లో టూరిస్ట్ గైడ్ అని ప్రత్యేక ఐకాన్ ప్రవేశపెట్టి టెక్నాలజీ ద్వారా పర్యాటకులు సులభంగా సర్టిఫైడ్ డ్రైవర్లను గుర్తించే వీలు కల్పించడం వల్ల భద్రత, భరోసా రెండూ పెరుగుతాయి. ప్రధానంగా ఈ శిక్షణలో మహిళా డ్రైవర్ల భాగస్వామ్యం రాష్ట్ర పర్యాటక రంగంలో భద్రతకు, సమానత్వానికి నిదర్శనం. మహిళా పర్యాటకులు ఒంటరిగా ప్రయాణించేటప్పుడు ఇటువంటి శిక్షణ పొందిన మహిళా డ్రైవర్లు ఉండటం వల్ల ఆంధ్రప్రదేశ్ ఒక సురక్షిత పర్యాటక కేంద్రంగా అంతర్జాతీయ స్థాయిలో పేరు గడిస్తుంది అన్నది కూటమి ప్రభుత్వ ఉద్దేశం.."ఇన్నాళ్లు మేము కేవలం డ్రైవర్లమే, కానీ ఇప్పుడు విజయవాడను మా కళ్లతో పర్యాటకులకు చూపించే రాయబారులుగా మారాము. ఇది మా వృత్తికి సమాజంలో గౌరవాన్ని పెంచుతుంది. ఈ శిక్షణ ద్వారా మేము పర్యాటకులతో మరింత ప్రొఫెషనల్‌గా వ్యవహరించగలం. దేశీయ మరియు అంతర్జాతీయ పర్యాటకులను సాదరంగా ఆహ్వానిస్తూ, విజయవాడ గొప్పతనాన్ని వారికి వివరించడానికి మేము సిద్ధంగా ఉన్నాం" అని శిక్షణ పొందిన డ్రైవర్లు చెబుతుండటం గమనార్హం. కేంద్ర ప్రభుత్వ 'స్వదేశీ దర్శన్' పథకం స్ఫూర్తితో భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా డ్రైవర్లను కేవలం వాహన సారథులుగానే కాకుండా, స్థానిక పర్యాటక రాయబారులుగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు అజయ్ జైన్, ఆమ్రపాలి కాటల నేతృత్వంలో సాగుతున్న ఈ ప్రయోగం విజయవంతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విజయవాడలో ప్రారంభమైన ఈ ప్రస్థానం త్వరలోనే తిరుపతి, విశాఖపట్నం వంటి నగరాలకు విస్తరించడం పర్యాటక శాఖ ఆదాయానికే కాకుండా, వేలాది మంది డ్రైవర్ల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతుంది. "అతిథి దేవో భవ" అనే సూక్తిని ఆచరణలో చూపిస్తూ,

## అక్రమ మానవ రవాణా ముఠాలకు ఏ ఐ కంచె

డిజిటల్ యుగంలో ప్రపంచం దగ్గరవుతోంది.. కానీ మానవత్వం దూరమవుతోంది. సాంకేతిక విప్లవం మన జీవితాలను సులభతరం చేసినప్పటికీ, అదే సాంకేతికతను అడ్డం పెట్టుకుని మానవ అక్రమ రవాణా ముఠాలు అమాయకుల జీవితాలను చీకటిలోకి నెట్టేస్తున్నాయి. మహిళలను వ్యభిచార బారిన, చిన్నారులను వెట్టిచాకిరీ బారి న, పేదలను నిర్బంధ శ్రమ బారిన పడేస్తూ అంతర్జాతీయ స్థాయిలో నేరజాడలు విస్తరిస్తున్నాయి. అవయవాల అక్రమ వ్యాపారం ఈ దందాకు మరింత క్రూరత్వాన్ని జోడిస్తోంది. ఈ కొత్త తరహా నేరాన్ని పాత పద్ధతులతో ఎదుర్కోలేం. నేరగాళ్లు కృత్రిమ మేధను దుర్వినియోగం చేస్తున్న ఈ కాలంలో, అదే కృత్రిమ మేధను సమాజ రక్షణకు ఆయుధంగా మలచాల్సిన అత్యవసర పరిస్థితి నెలకొంది. మహిళలను వ్యభిచారానికి, బాలలను వెట్టిచాకిరీకి, పేదలను నిర్బంధ శ్రమకు గురిచేస్తూ దారుణాలు సృష్టిస్తున్నాయి. అవయవాల అక్రమ వ్యాపారం ఈ చీకటి ప్రపంచానికి మరింత బలాన్నిస్తోంది. జాతీయ నేర గణాంకాల సంస్థ గణాంకాలు ఈ విపత్తు తీవ్రతను చూపిస్తున్నాయి. 2023లో 2,183 కేసులు నమోదై 6,288 మంది బాధితులుగా గుర్తించబడ్డారు. వీరిలో 42 శాతానికి పైగా మైనర్లే. 2018 నుంచి 2022 మధ్య నమోదైన వేల కేసుల్లో అరెస్టులు జరిగినా శిక్షల శాతం అత్యల్పం. నేరం వేగంగా మారుతున్నా చట్టపరమైన వ్యవస్థ మాత్రం అంతే వేగంతో మారలేకపోతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే 2026 చివర నాటికి కేసులు మరింత పెరిగే ప్రమాదం ఉంది. మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిశా, ఉత్తరప్రదేశ్, బిహార్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు ప్రధాన కేంద్రాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో కృత్రిమ మేధ ఒక శక్తివంతమైన ఆయుధంగా మారవచ్చు. సామాజిక మాధ్యమాలు, డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ వేదికలను వినియోగిస్తూ నేరగాళ్లు తమ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. ఇదే డిజిటల్ ప్రపంచంలో కృత్రిమ మేధను వినియోగించి నేరాలను ముందుగానే పసిగట్టడం సాధ్యం. రియల్ టైమ్ విశ్లేషణ, నమూనాల గుర్తింపు వంటి పద్ధతులతో అనుమానాస్పద కదలికలను గుర్తించవచ్చు. లక్షల ప్రకటనలను క్షణాల్లో స్కాన్ చేసి అనుచిత పదజాలం, చిత్రాలను గుర్తించడం ద్వారా అధికారులను అప్రమత్తం చేయవచ్చు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, వంటి రవాణా కేంద్రాలు అక్రమ రవాణాదారుల ప్రధాన మార్గాలు. అక్కడ ఏర్పాటు చేసే సీసీటీవీ కెమెరాలను కృత్రిమ మేధతో అనుసంధానిస్తే అదృశ్యులైన బాధితులను, రికార్డులకెక్కిన నేరగాళ్లను గుర్తించడం సులభమవుతుంది. ముఖగుర్తింపు సాంకేతికత, ప్రవర్తన విశ్లేషణ పద్ధతులు బాధితులను రక్షించడంలో తోడ్పడగలవు. అమెరికా, కెనడా, ఐరోపా దేశాలు వినియోగిస్తున్న ఆధునిక పద్ధతులను భారతదేశం కూడా స్వీకరించాలి. అంతర్జాతీయ సహకారం పెంపొందించాలి. పెండింగులో ఉన్న మానవ అక్రమ రవాణా నిరోధ చట్టానికి రూపం ఇవ్వాలి. వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేయాలన్న సుప్రీంకోర్టు సూచనలను కార్యరూపం దాల్చాలి. అయితే కృత్రిమ మేధ వినియోగం గోప్యత, మానవ హక్కుల పరిరక్షణకు భంగం కలిగించకూడదు. డేటా సేకరణలో పక్షపాతం చోటుచేసుకోకూడదు. ముఖగుర్తింపు సాంకేతికతలు దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన నియంత్రణ అవసరం. నేరగాళ్లు కూడా కృత్రిమ మేధను వాడుతున్న ఈ కాలంలో పోలీసు, భద్రతా సంస్థలకు నిరంతర శిక్షణ, సరిపడ నిధులు అత్యవసరం. సాంకేతికత స్వయంగా మంచిదో కాదో కాదు, ఏఐని ఎలా వినియోగిస్తామన్నదే కీలకం. బాధితులు పెరుగుతున్న నేపథ్యంలో ఏ ఐ మేధను బాధ్యతాయుతంగా వినియోగించి, మానవ అక్రమ రవాణాను నిర్మూలించేందుకు సమగ్ర పోరాటం అవసరం. చట్టం, సాంకేతికత, సమాజం... ఈ మూడు కలిసివచ్చినప్పుడే ఈ చీకటి వ్యాపారానికి ముగింపు పలకగలం.

**ఈ. శ్రీనివాస్ రావు, 9912121319**


## ఎన్నికలు నిలిపితే నాయకత్వం ఎక్కడి నుంచి?

విశ్వవిద్యాలయాలు దేశ భవిష్యత్తును నిర్మించే జ్ఞానాలయాలు. ఇక్కడ విద్య మాత్రమే కాదు, విలువలు, ప్రజాస్వామ్య చైతన్యం, నాయకత్వ లక్షణాలు కూడా పెంపొందుతాయి. అందుకే విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలు ఒక సాధారణ ప్రక్రియ కాకుండా, ప్రజాస్వామ్య సాధనగా భావించాలి. ఇటీవలి కాలంలో విద్యా కమిషన్ చేసిన సిఫారసులు ఈ ఎన్నికల నిర్వహణపై దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. ఈ సందర్భంలో విశ్వవిద్యాలయ ఎన్నికల అవసరం, వాటి ప్రయోజనాలు, సమస్యలు, అలాగే కమిషన్ సూచనల ప్రాధాన్యతపై లోతైన విశ్లేషణ అవసరం. విద్యార్థి సంఘాల ఎన్నికలు భారత ప్రజాస్వామ్యానికి పునాది స్థాయిలో శిక్షణ శిబిరాలుగా నిలుస్తాయి. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఇక్కడ కూడా ప్రచారం, చర్చలు, వాగ్దానాలు, ఓటింగ్ వంటి ప్రక్రియలు జరుగుతాయి. ఈ అనుభవం ద్వారా విద్యార్థులు బాధ్యత, సమన్వయం, నాయకత్వ నైపుణ్యాలు అలవరచుకుంటారు. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన పలువురు నాయకులు తమ రాజకీయ ప్రస్థానాన్ని విశ్వవిద్యాలయాల నుంచే ప్రారంభించారు. ఉదాహరణకు అరుణ్ జైట్లీ మరియు సీతారాం యేచూరి వంటి నాయకులు విద్యార్థి రాజకీయాల నుంచే ఎదిగి జాతీయ స్థాయికి చేరుకున్నారు. ఈ ఉదాహరణలు విద్యార్థి ఎన్నికల ప్రాముఖ్యతను స్పష్టం చేస్తాయి. అయితే, ఈ ఎన్నికలు కొన్నిసార్లు అనర్థాలకు దారితీస్తున్నాయన్న వాదన కూడా ఉంది. రాజకీయ పార్టీల జోక్యం, డబ్బు, మద్యం ప్రభావం, కుల-మత ప్రాతిపదికల విభజనలు, హింసాత్మక ఘటనలు వంటి సమస్యలు విశ్వవిద్యాలయ వాతావరణాన్ని దెబ్బతీస్తున్నాయి. విద్యకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన ప్రదేశాల్లో రాజకీయ కలహాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగించే విషయం. కొన్ని సందర్భాల్లో తరగతులు నిలిచిపోవడం, క్యాంపస్‌లో అశాంతి నెలకొనడం కూడా జరిగింది. ఈ నేపథ్యంలో ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు అవసరమన్న అభిప్రాయం బలపడింది. ఈ నేపథ్యంలో విద్యా కమిషన్ చేసిన సిఫారసులు సమతుల్య దృక్పథాన్ని ప్రతిబింబిస్తున్నాయి. కమిషన్ ప్రధానంగా విద్యార్థి ఎన్నికలను నిషేధించాలనే దృక్పథం కాకుండా, పారదర్శకత, నియంత్రణ, బాధ్యతను పెంపొందించాలనే లక్ష్యంతో మార్గదర్శకాలు ప్రతిపాదించింది. ఖర్చుల పరిమితి, రాజకీయ పార్టీల ప్రత్యక్ష జోక్యంపై ఆంక్షలు, అభ్యర్థుల అర్హతలపై స్పష్టమైన ప్రమాణాలు, ప్రచారానికి సమయ పరిమితి వంటి అంశాలు సూచించబడ్డాయి. ఇవి అమలు అయితే ఎన్నికల ప్రక్రియలో క్రమశిక్షణ పెరుగుతుందని భావించవచ్చుఇప్పటికే దేశంలో కొన్ని విశ్వవిద్యాలయాలు సక్రమ పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తూ మంచి ఉదాహరణలు చూపిస్తున్నాయి. జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ మరియు ఢిల్లీ యూనివర్సిటీ వంటి విద్యాసంస్థల్లో ఎన్నికలు క్రమబద్ధంగా నిర్వహించబడుతూ, విద్యార్థుల చైతన్యానికి వేదికగా నిలుస్తున్నాయి. అక్కడ చర్చలు, వాదోపవాదాలు, విధానాలపై స్పష్టమైన చర్చలు జరుగుతాయి. అయితే కొన్ని చోట్ల మాత్రం నియంత్రణలేమి కారణంగా ప్రతికూల పరిణామాలు చోటుచేసుకున్నాయి. అందువల్ల ఒకే విధమైన జాతీయ ప్రమాణాలు అవసరమని కమిషన్ అభిప్రాయపడింది. ఇక్కడ ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే, ప్రజాస్వామ్యాన్ని నేర్పించాలంటే దాన్ని ఆచరించే అవకాశాన్ని ఇవ్వాలి. ఎన్నికలను పూర్తిగా రద్దు చేయడం సమస్యలకు శాశ్వత పరిష్కారం కాదు. అంతేకాకుండా, విద్యార్థుల్లో అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంది. బదులుగా నియంత్రిత, పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయడం సముచితం. లింగ సమానత్వం, సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల ప్రతినిధిత్వం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఎన్నికలను మరింత సమగ్రంగా మార్చవచ్చు. విశ్వవిద్యాలయాలు కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా సమాజాన్ని మార్గనిర్దేశం చేసే కేంద్రాలుగా ఉండాలి. అక్కడి ఎన్నికలు బాధ్యతాయుతంగా జరిగితేనే భవిష్యత్ నాయకత్వం సుస్థిరమవుతుంది. విద్యా కమిషన్ సూచనలు ఈ దిశగా ఒక సరైన అడుగుగా కనిపిస్తున్నాయి. అయితే అవి కేవలం పత్రాలకే పరిమితం కాకుండా కఠినంగా అమలు కావాలి. విశ్వవిద్యాలయ పరిపాలన, అధ్యాపకులు, విద్యార్థులు, ప్రభుత్వం---అందరూ కలిసికట్టుగా పనిచేసినప్పుడే ఎన్నికల వ్యవస్థ పరిపక్వత సాధిస్తుంది.

--తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

# బిజినెస్

## యెజ్డీ రోడ్ స్టర్ 'రెడ్ ఉల్ఫ్' ప్రత్యేక ఎడిషన్ విడుదల




ముంబయి, మార్చి 4, 2026: మార్చి 3, 2026న చంద్ర గ్రహణం సందర్భంగా జావా యెజ్డి మోటార్ సైకిల్స్ యెజ్డీ రోడ్ స్టర్ 'రెడ్ ఉల్ఫ్' ప్రత్యేక ఎడిషన్‌ను అధికారికంగా విడుదల చేసింది. ప్రపంచంలోనే భారతదేశంలో తయారైన ఏకైక క్లాసిక్ మోటార్‌సైకిల్ బ్రాండ్ అయిన యెజ్డీ, 1970ల తన ఐకానిక్ వారసత్వాన్ని గుర్తుచేస్తూ ఈ మోడల్‌ను లోతైన రెట్రో ఎరుపు రంగు మరియు మెరిసే క్రోమ్ డిటైల్స్‌తో అందించింది. 'బోర్న్ అవుట్ ఆఫ్ లైన్' స్ఫూర్తితో రూపొందించిన ఈ రెడ్ ఉల్ఫ్, రోడ్ స్టర్ శ్రేణిలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకునేలా తీర్చిదిద్దబడింది. ఎగ్జాస్ట్, ఇంజన్, హ్యాండిల్‌బార్‌లపై విస్తరించిన క్రోమ్ ఫినిషింగ్, తీర్చిదిద్దిన ఫ్యూయల్ ట్యాంక్, వెడల్పైన రియర్ ఫెండర్ మరియు బొబ్బర్ స్టైల్ టెయిల్ డిజైన్ ఈ మోడల్‌కు ప్రత్యేకమైన ఉనికిని ఇస్తాయి.

పర్ఫార్మెన్స్ పరంగా, రెడ్ ఉల్ఫ్ 350 ఆల్ఫా2 లిక్విడ్-కూల్డ్ ఇంజన్‌తో 6-స్పీడ్ గేర్‌బాక్స్, అసిస్ట్ ఌ స్లిప్పర్ క్లచ్ కలయికలో వస్తోంది. డ్యూయల్-చానల్ ఎబిఎస్, 320మిమీ ఫ్రంట్ మరియు 240మిమీ రియర్ డిస్క్ బ్రేకులు, ఎల్ఈడీ లైటింగ్ వంటి ఆధునిక ఫీచర్లు దీన్ని సురక్షితమైన మరియు విశ్వసనీయమైన టూరింగ్ బైక్‌గా నిలబెడతాయి. 12.5 లీటర్ల ఫ్యూయల్ ట్యాంక్‌తో 350 కిమీకి పైగా రేంజ్ అందించే సామర్థ్యం, 795 మిమీ సీటు ఎత్తు, 171 మిమీ గ్రౌండ్ క్లియరెన్స్ మరియు సెంటర్-ఫార్వర్డ్ ఫుట్‌పెగ్స్‌తో విశ్రాంతిదాయకమైన రైడింగ్ అనుభవం లభిస్తుంది. రూ. 2,09,950 (ఎక్స్-షోరూమ్ ఢిల్లీ) ప్రారంభ ధరతో అందుబాటులో ఉన్న ఈ మోడల్‌కు 4 సంవత్సరాలు/50,000 కిమీ వారంటీతో పాటు విస్తృత యజమాని హామీ కార్యక్రమం కూడా అందిస్తున్నారు.

## రంజాన్ లో శక్తివంతం కావటానికి మార్గదర్శకాలు



పవిత్ర రంజాన్ మాసం ఆధ్యాత్మికత, మననం మరియు సమాజానికి సంబంధించిన సమయం. ముఖ్యంగా తల్లులు, కళాశాల విద్యార్థులు, నిపుణులు రోజువారీ బాధ్యతలను సమతుల్యం చేసుకుంటూనే, తెల్లవారుజాము నుండి సాయంత్రం వరకు 30 రోజుల పాటు ఉపవాసం ఉండటం శారీరకంగా శ్రమతో కూడుకున్నదిగా అనిపిస్తుంది. రోజంతా స్థిరమైన రీతిలో శక్తిని నిర్వహించడానికి కీలకమైంది, ఆలోచనాత్మకంగా ప్రణాళిక చేయబడిన సెహ్రీ. సెహ్రీలో మనం ఎక్కువగా దృష్టి సారించవలసినది, సమతుల్య, నెమ్మదిగా విడుదల చేసే ఆహారాలపై! ఇవి శక్తిని నిలుపుకోవటానికి , అలసటను నివారించడానికి సహాయపడతాయి. పోషకాలు అధికంగా ఉండే ఆహారాలు స్థిరమైన రీతిలో శక్తిని అందించటంతో పాటుగా దీర్ఘకాలిక సంతృప్తిని అందించడంలో సహాయపడతాయి. మరోవైపు, వేయించిన లేదా తియ్యటి ఆహారాలతో రోజును ప్రారంభించడం వల్ల శక్తి వేగంగా పెరుగుతుంది, అలాగే తగ్గుతుంది.

రోజు గడిచేకొద్దీ అలసట మరియు సత్తువ లేనట్టి అనుభూతి కలుగుతుంది. సెహ్రీలో బుద్ధిపూర్వక, పోషకమైన ఎంపికలు చేసుకోవడం వల్ల ఉపవాస అనుభవాన్ని మరింత సౌకర్యవంతంగా , శక్తివంతంగా మార్చుకోవచ్చు. రోజంతా నిరంతర శక్తి కోసం చేర్చవలసిన ఐదు ఆహారాలు ఇక్కడ ఉన్నాయి. బాదంలో విటమిన్ బి2, విటమిన్ ఇ, మెగ్నీషియం , భాస్వరం పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆహారాల నుండి శక్తి విడుదలకు దోహదం చేస్తాయి. అవి మీరు చురుకుగా ఉండటానికి సహాయపడే ఆరోగ్యకరమైన శక్తి వనరును అందిస్తాయి. కాలిఫోర్నియా బాదంను మీ సెహ్రీలో చేర్చడం, రాత్రిపూట నానబెట్టినా లేదా స్మూతీలలో కలిపినా, పొడిగించిన ఉపవాస సమయాల్లో స్థిరమైన శక్తి స్థాయిలను నిర్వహించడంలో సహాయపడుతుంది. మీరు ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని పొందడంలో సహాయపడుతుంది. మధ్యాహ్నం అలసటను నివారిస్తుంది. గ్రీకు యోగర్ట్ లో ప్రోటీన్ మరియు ప్రోబయోటిక్స్ పుష్కలంగా ఉంటాయి.

## గీతంలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహణ

బెంగళూరులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, 1928లో సర్ సి.వి. రామన్ రామన్ ఎఫెక్ట్ యొక్క అద్భుతమైన ఆవిష్కరణను గుర్తుచేసుకునేందుకు రెండు రోజుల జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకను ముగించింది, ఈ సందర్భంగా ఉన్నత స్థాయి విద్యా చర్చలు, పరిశోధన ప్రదర్శనలు మరియు బలమైన శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో విద్యార్థుల పోటీలు జరిగాయి. ఈ సంవత్సరం, భారత ప్రభుత్వ ప్రకటనకు అనుగుణంగా "సైన్స్‌లో మహిళలు" అనే థీమ్‌తో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. శాస్త్రీయ విచారణ మరియు వ్యవస్థాపక స్ఫూర్తి మధ్య అంతరాన్ని తగ్గించడానికి రూపొందించిన "ఐడియా ఛాలెంజ్"తో రెండు రోజుల వేడుక ప్రారంభమైంది, తరువాత ఐఐఎస్సీ బెంగళూరు నుండి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మీటాలి సింగ్ మరియు ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి ప్రొఫెసర్ ప్రొఫెసర్ మహిమా కౌశిక్ రెండు ఆకర్షణీయమైన ఉపన్యాసాలు ఇచ్చారు. రెండవ రోజు వేడుకలకు ముఖ్య అతిథిగా ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ నుండి ప్రొఫెసర్ జి. రవీంద్ర కుమార్, గౌరవ అతిథి ప్రొఫెసర్ మహిమా కౌశిక్, గీతం విశ్వవిద్యాలయం ప్రో వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ బసవరాజ్ కటగేరి మరియు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రెజి ఫిలిప్ హాజరయ్యారు.

## సెబీకి డీఆర్‌హెచ్‌పీ సమర్పించిన ఫిన్‌టెక్ యూనికార్న్ 'మనీవ్యూ'

వినియోగదారు ఆధారిత, డిజిటల్ మాధ్యమానికి చెందిన, క్రెడిట్ ఆధారిత ఫిన్‌టెక్ ప్లాట్‌ఫాం మనీవ్యూ లిమిటెడ్ ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీవో) ద్వారా నిధులను సమీకరించేందుకు క్యాపిటల్ మార్కెట్స్ నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ)ని సమర్పించింది. దీని ప్రకారం తాజాగా షేర్ల జారీ ద్వారా కంపెనీ రూ. 1,500 కోట్లు సమీకరించనుండగా, సెల్లింగ్ షేర్‌హోల్డర్లు 13.6 కోట్ల వరకు షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో విక్రయించనున్నారు. డిఫాల్ట్ లాస్ గ్యారంటీ (డీఎల్‌జీ) అరేంజ్‌మెంట్స్ కింద రూ. 650 కోట్లు రుణ వితరణకు, అనుబంధ సంస్థ Whizdm ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో రూ. 450 కోట్ల పెట్టుబడి కోసం, మిగతా మొత్తాన్ని కార్పొరేట్ అవసరాల కోసం కంపెనీ వినియోగించుకోనుంది.

ఓఎఫ్ఎస్‌లో పాల్గొంటున్న ప్రమోటర్ సెల్లింగ్ షేర్‌హోల్డర్లలో పునీత్ అగర్వాల్, సంజయ్ అగర్వాల్ ఉండగా, ప్రమోటర్ గ్రూప్ సెల్లింగ్ షేర్‌హోల్డర్లలో చిత్రా అగర్వాల్, ఇన్వెస్టర్ సెల్లింగ్ షేర్‌హోల్డర్లలో ఇంటర్నెట్ ఫండ్ III పీటీఈ, యాక్సెల్ ఇండియా IV (మారిషస్) రిబ్బిట్ క్యాపిటల్ మొదలైనవి ఉన్నాయి. తాజా షేర్ల జారీ ద్వారా సమీకరించిన నిధులను ఆర్థిక సేవల వ్యాపార విస్తరణకు సంస్థ వినియోగించుకోనుంది. ఐఐటీ ఢిల్లీ గ్రాడ్యుయేట్స్ అయిన పునీత్ అగర్వాల్, (ఎండీ ఌ సీఈవో), సంజయ్ అగర్వాల్ (ఈడీ, సీటీవో) 2014లో మనీవ్యూని ప్రారంభించారు.

యాక్సెల్, టైగర్ గ్లోబల్, రిబ్బిట్ క్యాపిటల్ మొదలైన దిగ్గజాలు ఇన్వెస్ట్ చేశాయి. విస్తృత స్థాయి లెండింగ్ పార్ట్‌నర్స్ నెట్‌వర్క్ దన్నుతో క్రెడిట్ కార్డులు, ఎర్న్‌డ్ వేజ్ యాక్సెస్, గృహ రుణాలు, ప్రాపర్టీపై రుణాలు, బీమా, డిజిటల్ గోల్డ్ తదితర ఆర్థిక సాధనాలను మనీవ్యూ అందిస్తోంది. 2025 డిసెంబర్ 31 నాటికి కంపెనీ నిర్వహణలోని ఆస్తుల పరిమాణం (ఏయూఎం) రూ. 19,814 కోట్లుగా ఉంది. 2025 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ. 2,379 కోట్ల ఆదాయాన్ని రూ. 240 కోట్ల లాభాన్ని ప్రకటించింది. యాక్సిస్ క్యాపిటల్, బీవోఎఫ్ఏ సెక్యూరిటీస్ ఇండియా, ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్, కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ ఈ ఇష్యూకి బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి.

# వార్ ప్రభావం: సెన్సెక్స్ 1100 పాయింట్లు పతనం

### మదుపర్లకు ₹10 లక్షల కోట్లు నష్టం




పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ ఉద్రిక్తతలు దలాల్‌స్ట్రీట్‌పై భారీ ప్రభావం చూపించాయి. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి, ముఖ్యంగా హార్ముజ్ జలసంధి మూసివేత భయాలు, ప్రపంచ ఇంధన సరఫరాపై ఆందోళనలను పెంచాయి. దీనివల్ల ముడి చమురు ధరలు ఎగసిపడగా, ద్రవ్యోల్బణం మళ్లీ పెరిగే అవకాశముందన్న భయాలు మదుపర్లను కుదిపేశాయి. ఫలితంగా దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా పతనమై మదుపర్ల సంపదలో సుమారు ₹10 లక్షల కోట్ల మేర ఆవిరైంది.
ప్రధాన సూచీ సెన్సెక్స్ ఉదయం నుంచే నష్టాల్లో ప్రారంభమై ఇంట్రాడేలో ఒక దశలో 1700 పాయింట్లకు పైగా క్షీణించింది. చివరకు 1122.66 పాయింట్ల నష్టంతో 79,116.19 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 385.20 పాయింట్లు కోల్పోయి 24,480.50 వద్ద స్థిరపడింది. మార్కెట్ పతనంతో బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.456 లక్షల కోట్లకు పడిపోయింది. ఇది ఒక్కరోజులోనే మదుపర్లకు భారీ నష్టాన్ని మిగిల్చింది.
సెన్సెక్స్ 30 సూచీలో భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా మినహా మిగతా దాదాపు అన్ని షేర్లు నష్టాల్లో ముగిశాయి. టాటా స్టీల్, ఎల్అండ్‌టీ, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్టీపీసీ వంటి భారీ కంపెనీల షేర్లు గణనీయంగా పడిపోయాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 82 డాలర్లకు చేరుకోగా, బంగారం ధరలు కూడా పెరుగుతూ ఔన్సుకు 5185 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి.
అమెరికా--ఇరాన్ యుద్ధ పరిస్థితులు మార్కెట్ పతనానికి ప్రధాన కారణంగా మారాయి. ఇరాన్‌పై అమెరికా--ఇజ్రాయెల్ సంయుక్త చర్యలు కొనసాగుతుండగా, యుద్ధం మరికొన్ని వారాలు కొనసాగవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొనడం పెట్టుబడిదారుల్లో భయాందోళనలు పెంచింది. టెహ్రాన్, బీరుట్‌లపై జరిగిన తాజా దాడులు పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చాయి. యుద్ధం దీర్ఘకాలం సాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడవచ్చన్న అంచనాలు ఉన్నాయి.
ముడి చమురు ధరల పెరుగుదల భారత్‌కు మరో పెద్ద సవాలుగా మారింది. దేశ చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండటంతో ధరల పెరుగుదల కరెంటు ఖాతా లోటు, ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అదే సమయంలో అమెరికా ఫెడ్, ఆర్‌బీఐ వడ్డీ రేట్ల తగ్గింపును వాయిదా వేసే అవకాశాలపై కూడా మార్కెట్‌లో ఆందోళనలు నెలకొన్నాయి.
ఇక రూపాయి విలువ కూడా తీవ్రంగా పడిపోయింది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.18 వద్ద జీవనకాల కనిష్ఠానికి చేరుకోవడం విదేశీ నిధుల ప్రవాహంపై ప్రభావం చూపింది. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) వరుసగా విక్రయాలు కొనసాగిస్తూ మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీశారు. ఇటీవల రూ.3,295 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించడం మార్కెట్‌లో అనిశ్చితిని పెంచింది. మొత్తం మీద అంతర్జాతీయ ఉద్రిక్తతలు, చమురు ధరల పెరుగుదల, రూపాయి

## డేటా సెంటర్లే టార్గెట్: అమెరికా ఆర్థిక నాడిపై ఇరాన్ దాడి వ్యూహం



ఇరాన్‌పై ఇజ్రాయెల్--అమెరికా సంయుక్త దాడుల తర్వాత పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. ప్రతిదాడుల భాగంగా ఇరాన్ అమెరికా ఆస్తులను లక్ష్యంగా చేసుకుంటూ వ్యూహాత్మక దాడులకు దిగుతోంది.
తాజా సమాచారం ప్రకారం గల్ఫ్ ప్రాంతంలోని అమెజాన్ వెబ్ సేవలు (ఎడబ్ల్యుఎస్) డేటా సెంటర్లపై డ్రోన్ దాడులు జరిపింది. డిజిటల్ మౌలిక వసతులనే లక్ష్యంగా చేసుకోవడం వెనుక స్పష్టమైన ఆర్థిక-సాంకేతిక వ్యూహం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.
సాంకేతిక యుగంలో డేటా ఇంధనంతో సమానం. క్లౌడ్ సేవలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ నిల్వ వ్యవస్థలన్నీ డేటా సెంటర్లపైనే ఆధారపడి ఉంటాయి. ఈ నేపథ్యంలో అమెరికా వ్యాపార ప్రయోజనాలకు నేరుగా దెబ్బతీయాలంటే డేటా మౌలిక సదుపాయాలపై దాడి చేయడమే సమర్థవంతమని ఇరాన్ అంచనా వేసినట్లు తెలుస్తోంది. యూఏఈ, బహ్రెయిన్‌లలోని తమ సెంటర్లపై దాడులు జరిగాయని ఎడబ్ల్యుఎస్ ధృవీకరించడంతో కొన్ని సేవల్లో అంతరాయం ఏర్పడినట్లు సమాచారం.
డేటా సెంటర్లు భారీ పెట్టుబడులతో నిర్మించబడే మౌలిక వసతులు. అమెరికాకు చెందిన బిగ్ టెక్ సంస్థలు గల్ఫ్ ప్రాంతాన్ని డిజిటల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు భారీ ప్రణాళికలు అమలు చేస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ యూఏఈలో బిలియన్ల డాలర్ల పెట్టుబడులు ప్రకటించగా, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గల్ఫ్‌ను గ్లోబల్ ఏఐ కేంద్రంగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.
ఈ పరిణామాల మధ్య ఎడబ్ల్యుఎస్ సెంటర్లపై దాడులు జరగడం అమెరికా ఆర్థిక నాడిపై ఒత్తిడి తేవాలన్న ప్రయత్నంగా కనిపిస్తోంది.
దాడుల అనంతరం అమెజాన్ షేర్లు ప్రీ-మార్కెట్ ట్రేడింగ్‌లో పడిపోవడం పెట్టుబడిదారుల ఆందోళనను ప్రతిబింబించింది.
యుద్ధరంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలక పాత్ర పోషిస్తున్నది. లక్ష్యాల గుర్తింపు, డ్రోన్ నావిగేషన్, రియల్‌టైమ్ డేటా విశ్లేషణ వంటి అంశాల్లో ఏఐ వినియోగం పెరుగుతోంది. అమెరికా సైన్యం మానవాతీత రూపొందించిన క్లౌడ్ వంటి ఏఐ మోడళ్లను వినియోగిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో స్థానిక డేటా సెంటర్లను దెబ్బతీయడం ద్వారా అమెరికా-ఇజ్రాయెల్ సాంకేతిక ఆధిపత్యాన్ని తగ్గించాలన్నదే ఇరాన్ వ్యూహమని నిపుణులు అంచనా వేస్తున్నారు.
డేటా సెంటర్లపై దాడి 'అట్రిషన్ వార్'లో భాగమని విశ్లేషణలు సూచిస్తున్నాయి. నేరుగా సైనిక స్థావరాలపై దాడి చేయడం కంటే ఆర్థిక, సాంకేతిక మౌలిక వసతులను దెబ్బతీస్తే శత్రుదేశం ఖర్చులు పెరుగుతాయి. ఌ బ్యాంకింగ్, ఈ-కామర్స్, సోషల్ మీడియా, గేమింగ్, హెల్త్‌కేర్ వంటి అనేక రంగాలు డేటా సెంటర్లపై ఆధారపడి ఉంటాయి. ఒకే దెబ్బతో బహుళ రంగాలపై ప్రభావం చూపేలా ఇరాన్ వ్యూహం రూపొందించిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.
మొత్తం మీద డేటా సెంటర్లను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా యుద్ధాన్ని సాంకేతిక రంగానికి విస్తరించే ప్రయత్నం జరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఇది కేవలం సైనిక సమరమే కాకుండా ఆర్థిక-డిజిటల్ ఆధిపత్య పోరుగా మారుతోందన్న సంకేతాలు ఇస్తోంది. ముందుముందు ఈ తరహా దాడులు పెరిగే అవకాశం ఉందని భద్రతా వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

## రూపాయి ఆల్‌టైమ్ లోస్ యుద్ధ ప్రభావం తీవ్రం




భారత రూపాయి అమెరికా--ఇరాన్ సంక్షోభం ప్రభావంతో తీవ్రంగా క్షీణించింది. ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో బుధవారం రూపాయి 92.16 వద్ద ముగిసింది, ఇది తాత్కాలికంగా ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 67 పైసలు క్షీణించినట్లు ఫారెక్స్ మార్కెట్ లో నమోదయింది. ఈ క్షీణత విదేశీ పెట్టుబడుల ఆందోళన మరియు మధ్యప్రాచ్య ఉద్రిక్తతల వల్ల కొనసాగుతున్నది.
ప్రపంచ ఫారెక్స్ మార్కెట్‌లో "రిస్క్ ఆఫ్" పరిస్థితులు కొనసాగడంతో డాలర్ బలపడింది. ఆరు ప్రధాన కరెన్సీలతో పోలిస్తే డాలర్ ఇండెక్స్ 98 స్థాయిని దాటి ట్రేడింగ్ అవుతోంది. రూపాయి ఇంటర్‌బ్యాంక్ మారక ద్రవ్య మార్కెట్‌లో 92.05 వద్ద ప్రారంభమై, ఒక దశలో 92.35 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. చివరికి 92.16 వద్ద ముగిసింది, ఇది గత ముగింపు స్థాయి 91.49తో పోలిస్తే 67 పైసల నష్టం.
మధ్యప్రాచ్యలో ఇరాన్‌పై అమెరికా దాడులు, హోర్ముజ్ జలసంధి మార్గం ద్వారా ఇంధన సరఫరాలకు ఉన్న ముప్పు కారణంగా చమురు ధరలు ఎగసిపడ్డాయి. ప్రపంచ చమురు బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో బ్యారెల్‌కు 82.46 డాలర్ల వద్ద, 1.29 శాతం పెరుగుదలతో ముగిసింది. ఇంధన ధరల పెరుగుదల రూపాయి పై ఆందోళనను మరింత పెంచింది.
దేశీయ ఈక్విటీ మార్కెట్లు కూడా ఒత్తిడిని ఎదుర్కొన్నారు. బీఎస్ఈ సెన్సెక్స్ 1,122.66 పాయింట్లు క్షీణించి 79,116.19 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 385.20 పాయింట్లు పడిపోయి 24,480.50 వద్ద స్థిరపడింది. ఈ మార్కెట్ నష్టాలు పెట్టుబడిదారుల ధైర్యాన్ని తగ్గించాయి మరియు రూపాయి పై ప్రెజర్‌ను పెంచాయి.
మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం, ప్రపంచ అనిశ్చిత పరిస్థితులు, విదేశీ నిధుల ఉపసంహరణ, దేశీయ ఈక్విటీ మార్కెట్లలో భారీ అమ్మకాలు రూపాయిపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో, భవిష్యత్‌లో మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు మరియు గ్లోబల్ ఆర్థిక పరిస్థితులు రూపాయి విలువపై కీలకంగా ఉండనున్నాయి.

## శామ్‌సంగ్ హెచ్చరిక మెమొరీ చిప్ ధరలు అధికంగా పెరుగుతున్నాయి

దక్షిణకొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శామ్సంగ్ ఎలక్ట్రానిక్స్ మేమొరీ చిప్ ధరల పెరుగుదల అంతర్జాతీయ సమస్యగా మారినట్లు పేర్కొంది. జేబీ పార్క్, శామ్‌సంగ్ (నైరుతి ఆసియా) అధ్యక్షుడు, సీఈఓ, ఈ పరిస్థితి ఎలక్ట్రానిక్స్, మొబైల్ పరిశ్రమలపై ప్రభావం చూపుతోందని చెప్పారు. సంస్థ వ్యూహాత్మక భాగస్వామ్యాల ద్వారా సరఫరాలను సమర్థవంతంగా నిర్వహిస్తుందని ధీమా వ్యక్తం చేసింది.
పరిస్థితిని జాగ్రత్తగా గమనిస్తూ, శామ్‌సంగ్ మార్కెట్ మార్పులకు అనుగుణంగా వ్యాపార నిర్ణయాలు తీసుకుంటుందని స్పష్టం చేసింది. సరఫరా పరంగా మెరుగైన స్థానంలో ఉన్నామని, చిప్ ధరల ప్రభావాన్ని తగ్గించడానికి అన్ని మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలిపారు. కంపెనీ దీర్ఘకాలిక వ్యూహాల్లో చిప్‌ల సరఫరా నిలకడను ప్రాధాన్యం ఇవ్వనుంది.
వచ్చే సంవత్సరాలు కూడా సమస్య కొనసాగుతుందని శామ్‌సంగ్ అంచనా వేశింది. 2027 వరకు మెమొరీ చిప్‌ల కొరత కొనసాగుతుందని, ముఖ్యంగా ఏఐ డేటా కేంద్రాలకు పెరుగుతున్న డిమాండ్ కారణంగా సమస్య తీవ్రమవుతుందని పేర్కొన్నారు. ఈ పరిస్థితి గ్లోబల్ టెక్ మార్కెట్లో ఉత్పత్తి నిలకడపై ప్రతికూల ప్రభావం చూపుతోంది.
కొరత కారణంగా బడ్జెట్ మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఎల్ఈడీ టీవీలు మరియు ఇతర గృహోపకరణాలపై ధరల పెరుగుదల కనిపిస్తోంది. తయారీదారులు సరఫరా సమస్యలతో ఇబ్బంది పడుతున్నందున, కొంత భాగంలో నిల్వలు కూడా తక్కువగా ఉన్నాయి.
మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నట్లు, చిప్ ధరల పెరుగుదల కంటే గ్లోబల్ సప్లై చైన్ వ్యత్యాసాలు మరింత కీలకంగా ఉంటాయి. తక్షణం తగ్గించడానికి వ్యూహాత్మక భాగస్వామ్యాలు మరియు సాంకేతిక పరిష్కారాలు అవసరం, లేకపోతే తక్కువ ధరల యంత్రాంగాలూ, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ధరలపై ప్రభావం కొనసాగుతూనే ఉంటుంది.

## డిఇజి, సిటీ వి76 మిలియన్ల రుణంతో శ్రీరామ్ ఫైనాన్స్ మద్దతు

చెన్నై:డిఇజి (డ్యూష్ ఇన్వెస్ట్మెంట్స్ అండ్ ఎంట్విక్‌లంగ్స్‌గెసెల్‌స్‌చాఫ్ట్ ఎం బి హెచ్) మరియు సిటీ కలిసి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు డాలర్లు 76 మిలియన్ల రుణాన్ని అందించారు. సహ-ఫైనాన్సింగ్ నిర్మాణంలో డిఇజి యూరో 40 మిలియన్ల రుణాన్ని అందించింది, సిటీ భారత్‌లో రూ. 260 కోట్ల రుణాన్ని అందించింది. సిటీ ఈ ఫైనాన్సింగ్‌లో లీడ్ అరేంజర్ మరియు కోఆర్డినేటర్‌గా వ్యవహరించింది.
ఈ ఫైనాన్సింగ్ భారత్‌లో తక్కువ ప్రాధాన్యతా విభాగాలకు, ఎంఎస్ఎంఈలు, మహిళా రుణగ్రహీతలు, ఈవి ఫైనాన్సింగ్ మరియు తక్కువ సేవలందే ప్రాంతాల కస్టమర్లకు రుణాలను అందించడానికి రూపొందించబడింది. డిఇజి ద్వారా అందిన రుణం శ్రీరామ్ ఫైనాన్స్ నెట్‌వర్క్ ద్వారా ఎంఎస్ఎంఈలకు మరియు స్థానిక ఆర్థిక వ్యవస్థకు అందించే అధికారిక క్రెడిట్‌ను బలోపేతం చేస్తుంది.
సిటీ రుణం ప్రధానంగా ఆహార భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరియు చిన్న హోల్డర్ రైతులపై దృష్టి సారిస్తుంది. సరసమైన మూలధనానికి పరిమిత ప్రాప్యత ఉన్న చిన్న రైతులు మరియు స్థానిక వ్యాపారాలు ఈ ఫైనాన్సింగ్ ద్వారా మద్దతు పొందుతాయి. 2024లో సిటీ మరియు డిఇజి విజయవంతంగా జరిపిన గ్రామీణ క్రెడిట్ యాక్సెస్ లావాదేవీకి ఇది రెండవ సహకార ఫైనాన్సింగ్ చొరవ.
శ్రీరామ్ ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఉమేష్ రేవంకర్ ప్రకారం, ఈ నిధులు చిన్న వ్యాపారాలు, మహిళా వ్యవస్థాపకులు, ఈవి దత్తత మరియు చిన్న భూస్వామ్య రైతులకు మద్దతు ఇస్తాయి. గ్రామీణ మరియు సెమీ-అర్బన్ భారతదేశంలో వారి లోతైన ఉనికితో అత్యవసరమైన కస్టమర్లకు ఈ ఫైనాన్సింగ్ అందించబడుతుంది.
డిఇజి గ్లోబల్ హెడ్ ఫైనాన్షియల్ ఇన్స్టిట్యూషన్స్ గుడ్రున్ బుష్ ప్రకారం, ఈ పెట్టుబడి అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో స్థిరమైన ప్రైవేట్-రంగ వృద్ధిని పెంపొందించే డిఇజి లక్ష్యానికి అనుగుణంగా ఉంది. సిటీ ఇండియా ఎండీ అనురాధ చౌదరి చెప్పినట్లుగా, ఈ సహ-ఫైనాన్సింగ్ ప్రపంచ ఆర్థిక సంస్థల భాగస్వామ్య సామర్థ్యాన్ని మరియు స్థిరమైన అభివృద్ధి ప్రభావాన్ని అన్‌లాక్ చేయడాన్ని సూచిస్తుంది.
డిఇజి, మరియు సిటీ సహ-ఫైనాన్సింగ్ ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ ప్రాధాన్యత లేని, తక్కువ సేవలందే విభాగాలకీ చేరుకోవడంలో మద్దతు అందిస్తుంది. ఎంఎస్ఎంఈలు, మహిళా వ్యవస్థాపకులు, ఈవి దత్తత, మరియు చిన్న భూస్వామ్య రైతులు వంటి కస్టమర్లకు రుణాలు అందించడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. ఈ సహకారం భారత్‌లో సమ్మిళిత, వాతావరణ-సానుకూల ఫైనాన్సింగ్ విధానాలను ముందుకు తీసుకెళ్లడానికి కంపెనీల నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

## టెస్లాకు ప్రిఫర్డ్ ఫైనాన్సర్‌గా యాక్సిస్ బ్యాంక్

### దేశవ్యాప్తంగా ఈవీ ఫైనాన్సింగ్‌కు ఊతం



ముంబై: ఎలక్ట్రిక్ వాహనాల సంస్థ టెస్లాకు ప్రాధాన్య ఫైనాన్సర్‌గా (ప్రిఫర్డ్ ఫైనాన్సర్) నిలిచే దిశగా భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు యాక్సిస్ బ్యాంక్ తెలిపింది. ఈ భాగస్వామ్యంతో దేశవ్యాప్తంగా టెస్లా కస్టమర్లకు ప్రత్యేక ఈవీ రుణ సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. దీని ప్రకారం ముఖ్య నగరాలు, వర్ధమాన ఈవీ హబ్‌లలో డిజిటల్ ఆధారిత ఫైనాన్సింగ్ ఆప్షన్లు అందుబాటులో ఉంటాయి. ప్రీమియం ఈవీ కొనుగోలుదారుల కోసం నగదు ప్రవాహానికి అనుగుణ రీపేమెంట్ పథకాలు, గరిష్ఠంగా 10 ఏళ్ల రుణ వ్యవధి, పూర్తిగా డిజిటల్ ఆన్‌బోర్డింగ్ వంటి సౌకర్యాలు అందించనున్నారు. భారత్‌లో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు ఇది దోహదపడుతుందని, కస్టమర్లకు సౌకర్యవంతమైన మరియు అనువైన ఫైనాన్సింగ్ పరిష్కారాలు అందించడమే లక్ష్యమని యాక్సిస్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మునీష్ శర్దా తెలిపారు.

## యుద్ధ వేళ గోల్డ్ గిఫ్ట్ భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు



యుద్ధ ఉద్రిక్తతల మధ్య సాధారణంగా బంగారం ధరలు పెరుగుతాయని భావిస్తారు. అయితే ఈసారి పరిస్థితి భిన్నంగా మారింది. అంతర్జాతీయ మార్కెట్లలో ఒడిదుడుకుల మధ్య దేశీయంగా బంగారం, వెండి ధరలు గణనీయంగా తగ్గాయి. పెళ్లిళ్ల సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ పరిణామం మగువలకు, సామాన్య కుటుంబాలకు కొంత ఊరట కలిగిస్తోంది.

గత కొన్ని రోజులుగా వరుసగా పెరుగుతూ వచ్చిన పసిడి ధరలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. గ్లోబల్ మార్కెట్లో లాభాల స్వీకరణ (ప్రాఫిట్ బుకింగ్), డాలర్ బలపడటం, అంతర్జాతీయ బాండ్ల యీల్డ్స్ పెరగడం వంటి కారణాల వల్ల బంగారం ధరలు దిగివచ్చినట్లు మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల దేశీయ బులియన్ మార్కెట్లలో కూడా ధరలు క్షీణించాయి.

ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర గణనీయంగా తగ్గగా, 22 క్యారెట్ల పసిడి కూడా వేల రూపాయల మేర చౌకైంది. అదే విధంగా వెండి ధరలు కూడా కిలోకు గణనీయంగా పడిపోయాయి. పరిశ్రమల డిమాండ్ మందగించడం, అంతర్జాతీయ మార్కెట్లో ఒత్తిడి వంటి అంశాలు వెండి ధరలపై ప్రభావం చూపుతున్నాయి.

పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం కొనుగోళ్లు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలు బంగారం ధరలు తగ్గినప్పుడే కొనుగోళ్లు చేయడానికి ఆసక్తి చూపుతాయి. ఈ నేపథ్యంలో తాజా ధరల తగ్గుదల వారికి ఉపశమనం కలిగిస్తోంది. జువెలరీ దుకాణాల్లో కొనుగోళ్లు మళ్లీ ఊపందుకునే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి.

అయితే అంతర్జాతీయ పరిస్థితులు ఇంకా అస్థిరంగానే ఉన్నాయి. యుద్ధం ముదిరితే మళ్లీ సురక్షిత పెట్టుబడిగా బంగారం డిమాండ్ పెరిగే అవకాశముంది. అందువల్ల ధరల్లో మరోసారి హెచ్చుతగ్గులు ఉండొచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. కొనుగోలు చేయాలనుకునే వారు మార్కెట్ పరిస్థితులను గమనించి నిర్ణయం తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. మొత్తం మీద యుద్ధ ఉద్రిక్తతల నడుమ బంగారం, వెండి ధరలు తగ్గడం వినియోగదారులకు శుభవార్తగా మారింది. ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్‌లో ఉన్న కుటుంబాలకు ఇది ఆర్థికంగా కొంత భారం తగ్గించినట్టే.

## అదానీ గంగవరం పోర్టు రికార్డు కంటైనర్ త్రూపుట్




భారతదేశంలోని అత్యంత లోతైన మరియు ఆధునిక ఓడరేవులలో ఒకటైన అదానీ గంగవరం పోర్టు బుధవారం ఫిబ్రవరి 2026లో రికార్డు స్థాయిలో 12,637 టీఈయూల నెలవారీ కంటైనర్ త్రూపుట్‌ను సాధించింది, ఇది అక్టోబర్ 2025లో దాని మునుపటి అత్యుత్తమ 11,545 టీఈయూలను అధిగమించింది. ఈ మైలురాయి పోర్టు యొక్క అధునాతన మౌలిక సదుపాయాలు, యాంత్రిక కార్యకలాపాలు, డీప్-డ్రాఫ్ట్ బెర్త్‌లు మరియు సమర్థవంతమైన మల్టీమోడల్ కనెక్టివిటీని ప్రతిబింబిస్తుంది, ఇవి నౌకల టర్నరౌండ్ మరియు మొత్తం ఉత్పాదకతను మెరుగుపరిచాయని పోర్ట్ ఇక్కడ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ విజయం కార్యాచరణ శ్రేష్ఠత మరియు విశ్వసనీయ లాజిస్టిక్స్ పరిష్కారాల పట్ల వారి నిబద్ధతను నొక్కి చెబుతుందని, భారతదేశ తూర్పు తీరంలో ప్రాధాన్యత గల గేట్‌వేగా అదానీ గంగవరం పోర్టు స్థానాన్ని బలోపేతం చేస్తుందని పోర్ట్ మేనేజ్‌మెంట్ తెలిపింది.

## తమిళనాడులో కొత్త ప్లాంట్ కోసం ఎంఆర్ఎఫ్ రూ.5,300 కోట్లు పెట్టుబడి




టైర్ తయారీ దిగ్గజం ఎంఆర్ఎఫ్ లిమిటెడ్ బుధవారం తమిళనాడు ప్రభుత్వంతో రాష్ట్రంలో కొత్త ప్లాంట్ ఏర్పాటుకు నాన్-బైండింగ్ అవగాహన ఒప్పందం పై సంతకం చేసినట్లు తెలిపింది. కంపెనీ ప్రకారం, గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్ట్‌ను 12 సంవత్సరాల కాలంలో రూ.5,300 కోట్ల పెట్టుబడితో అభివృద్ధి చేయనున్నారు. శివగంగ జిల్లాలోని సిప్కాట్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఈ ప్లాంట్ ఏర్పాటు చేయబడుతుంది. ప్రతిపాదిత ప్లాంట్ ఆటోమోటివ్ టైర్లు మరియు అనుబంధ ఉత్పత్తులను తయారు చేస్తుంది మరియు దాదాపు 1,000 మందికి ఉపాధిని కల్పిస్తుందని భావిస్తున్నారు. ఈ ఒప్పందం కట్టుబడి ఉండదని మరియు వర్తించే చట్టాల ప్రకారం అనుకూలీకరించిన ప్రోత్సాహక ప్యాకేజీ, భూమితో సహా మౌలిక సదుపాయాల మద్దతు మరియు చట్టబద్ధమైన ఆమోదాలకు లోబడి ఉంటుందని ఎంఆర్ఎఫ్ తెలిపింది.

## ఎయిర్‌టెల్ వినియోగదారులకు 4జీ డేటా కూడా అపరిమితం


భారతి ఎయిర్‌టెల్ పోస్ట్‌పెయిడ్ వినియోగదారులకు శుభవార్త ప్రకటించింది. ఇప్పటికే అందిస్తున్న అన్‌లిమిటెడ్ 5జీ సేవలతో పాటు ఇప్పుడు 4జీ డేటాను కూడా అపరిమితంగా అందిస్తోంది. వ్యక్తిగత మరియు ఫ్యామిలీ పోస్ట్‌పెయిడ్ ప్లాన్లను కంపెనీ అప్‌డేట్ చేసింది. అధికారిక ప్రకటన విడుదల చేయకపోయినా, వెబ్‌సైట్‌లో మార్పులు చేసింది. తొలుత 10 సర్కిళ్లలో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ అన్‌లిమిటెడ్ సేవలను ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించింది. అయితే 'అపరిమిత' డేటా అంటే నెలకు 300 జీబీ వరకు హైస్పీడ్ డేటా అందుబాటులో ఉంటుంది.

అప్‌డేట్ చేసిన ప్లాన్ల ప్రకారం, రూ.449 వ్యక్తిగత ప్లాన్‌లో ఒక ప్రైమరీ సిమ్, అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, 300 జీబీ వరకు అన్‌లిమిటెడ్ 4జీ, 5జీ డేటాతో పాటు ఎయిర్‌టెల్ ఎక్స్ట్రీమ్‌ప్లే, జియోహాట్‌స్టార్ (3 నెలలు) లభిస్తాయి. రూ.549 ప్లాన్‌లో అదనంగా డిస్నీ హాట్‌స్టార్ (12 నెలలు), అమెజాన్ ప్రైమ్ (6 నెలలు) వంటి ఓటీటీ ప్రయోజనాలు ఉన్నాయి. రూ.699 ప్లాన్‌లో రెండు సిమ్‌లు (1 ప్రైమరీ ం 1 అదనపు) ఉండగా, ఇద్దరూ అన్‌లిమిటెడ్ సేవలను పొందవచ్చు. చిన్న కుటుంబాల కోసం రూ.999 (1ం2), రూ.1199, రూ.1399 (1ం3 సిమ్‌లు) ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఓటీటీ ప్రయోజనాలతో పాటు యాపిల్ టీవీ, యాపిల్ మ్యూజిక్ కూడా లభిస్తాయి. ఐదుగురికి సరిపోయే ప్రీమియం ప్లాన్ రూ.1749కు అందుబాటులో ఉండగా, ఇందులో ఒక ప్రైమరీతో పాటు నాలుగు అదనపు సిమ్‌లు కలిపి మొత్తం ఐదు సిమ్‌లు ఉంటాయి.

## రాయల్ బ్రదర్స్‌తో సుజుకి టూవీలర్లు రెంటల్




సుజుకి మోటార్‌సైకిల్ ఇండియా తమ టూవీలర్లను కస్టమర్లకు మరింత సులభంగా అందించేందుకు రాయల్ బ్రదర్స్ రెంటల్స్‌తో భాగస్వామ్యం చేసింది. ప్రారంభంలో సుజుకీ ఈ--యాక్సెస్ వాహనాలతో ప్రారంభమయ్యే ఈ సర్వీస్, భవిష్యత్తులో ఇతర ద్విచక్ర వాహనాలకు కూడా విస్తరించబడేలా ప్రణాళికలు ఉన్నాయని సంస్థ తెలిపింది. రాయల్ బ్రదర్స్ ప్లాట్‌ఫారమ్ ద్వారా కస్టమర్లు తమ అవసరాలకు అనుగుణంగా 24 గంటల నుంచి 1 ఏడాది వరకు రెంటల్ ఆప్షన్లను ఎంచుకోవచ్చు. ఈ రెంటల్ సర్వీస్ హైదరాబాద్, విజయవాడ, వైజాగ్, ఆగ్రా వంటి నగరాల్లో అందుబాటులో ఉంటుంది, కాబట్టి వినియోగదారులు సౌకర్యవంతంగా తమకు కావలసిన వాహనాన్ని అద్దెకు తీసుకోవచ్చు. కస్టమర్లు ఈ సర్వీస్ ద్వారా వాహనాన్ని తాము కోరుకునే సమయానికి, అవసరానికి మ్యాచ్ తీసుకొని, అవసరానికంత మాత్రమేగా అద్దెగా ఇవ్వగలరు. రెంటల్‌తో పాటు సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్లు కూడా అందుబాటులో ఉన్నాయి, దీని ద్వారా కస్టమర్లు నెలవారీ, క్వార్టర్, లేదా ఏడాది పొడవునా వాహనం వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఇది ప్రత్యేకంగా నగరాలలో ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొనే, తాత్కాలిక వాహన అవసరమున్న వినియోగదారుల కోసం సౌకర్యవంతమైన పరిష్కారం.




# రాజ్యసభ బరిలో బీజేపీ హేమాహేమీలు..

● తొమ్మిది మంది అభ్యర్థులను ప్రకటించిన హైకమాండ్

న్యూఢిల్లీ : పార్లమెంటు పెద్దల సభ (ఎగువ సభ) అయిన రాజ్యసభ ఎన్నికల కోసం బీజేపీ తన వ్యూహాలకు పదును పెట్టింది. వివిధ రాష్ట్రాల నుంచి ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేసే క్రమంలో.. తొమ్మిది మంది అభ్యర్థుల పేర్లతో కూడిన జాబితాను బీజేపీ హైకమాండ్ విడుదల చేసింది. పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారికి కీలక నేతలతో పాటు వివిధ కీలక అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ఎంపిక జరిగింది.

**బీహార్ నుంచి నితిన్ నబీన్, శివేష్ కుమార్**

బీహార్ నుంచి ఇద్దరు కీలక నేతలకు అవకాశం దక్కింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌కు పార్టీ పెద్దపీట వేసింది. ఆయనతో పాటు శివేష్ కుమార్ పేరును ఖరారు చేస్తూ హైకమాండ్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర రాజకీయాల్లో పట్టున్న వీరిద్దరూ కేంద్ర స్థాయిలో పార్టీ వాణిని బలంగా వినిపిస్తారని అధిష్ఠానం భావిస్తోంది.

**అస్సాం, ఒడిశాల నుంచి ఇద్దరు ఇద్దరి చొప్పున..**

ఈశాన్య రాష్ట్రమైన అస్సాం నుంచి తేరష్ గోవాలా, జోగేన్ మోహన్ పేర్లను ప్రకటించారు. అలు తూర్పు తీర రాష్ట్రమైన ఒడిశా నుంచి మన్మోహన్ సామల్, సుజిత్ కుమార్ ల బరిలో దిగుతున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమించిన వీరికి రాజ్యసభ బెర్త్ లు కల్పించడం ద్వారా కార్యకర్తల్లో నూతనోత్తేజాన్ని నింపాలని బీజేపీ యోచిస్తోంది.

**ఛత్తీస్‌గఢ్, హర్యానా, బెంగాల్ ప్రాతినిధ్యం**

మిగిలిన రాష్ట్రాల విషయానికొస్తే.. ఛత్తీస్‌గఢ్ నుంచి లక్ష్మీ వర్మను అభ్యర్థిగా ఎంపిక చేశారు. హర్యానా కోటా నుంచి సంజయ్ భాటియా పేరును ఖరారు చేశారు. ఇక పశ్చిమ బెంగాల్ నుంచి సీనియర్ నేత రాహుల్ సిన్హాకు అవకాశం కల్పించారు. రాష్ట్రాల్లో పార్టీ ఎదుగుదలకు తోడ్పడిన నాయకులకు ఈ జాబితాలో ప్రాధాన్యం లభించింది. ఈ ఎంపిక ప్రక్రియలో అనుభవం, విధేయతకు అధిష్ఠానం పెద్దపీట వేసింది. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వీరంతా ఏకగ్రీవంగా లేదా భారీ మెజారిటీతో విజయం సాధిస్తారనే ధీమాను పార్టీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.





## అసోం అసెంబ్లీ ఎన్నికలు

# కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితా రిలీజ్



గ్యాంగ్‌టక్ : అసోం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న తమ అభ్యర్థుల తొలి జాబితాను ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మంగళవారం ప్రకటించింది. 42 మందితో కూడిన ఫస్ట్ లిస్టు రిలీజ్ చేసింది. ఈ మేరకు కేసీ వేణుగోపాల్ అభ్యర్థుల జాబితా విడుదల చేశారు. ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చీఫ్, సీనియర్ నాయకులు గౌరవ్ గొగొయి జోర్హాట్ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. అలాగే రాష్ట్ర కాంగ్రెస్ శాసనసభా పక్షనేత దేబబ్రత సైకియా నజీరా నియోజకవర్గం నుంచి బరిలో బరిలో దిగనున్నారు.కాగా, అసోం రాష్ట్రంలో 126 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ స్థానాలకు వచ్చే నెలలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. గత రెండు పర్యాయాలుగా అధికారానికి దూరమైన కాంగ్రెస్ ఈసారి ఎలాగైనా ప్రభుత్వంలోకి రావాలని వ్యూహాలు రచిస్తోంది. అందులో భాగంగానే ప్రత్యర్థి పార్టీల కంటే ముందే కాంగ్రెస్ తమ అభ్యర్థుల లిస్ట్ రిలీజ్ చేసింది. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే అధికారంలో ఉంది.

# ఇరాన్ యుద్ధంలో డిజిటల్ విప్లవం



● డేంజర్ బెల్స్ మోగిస్తున్నఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ● ఇజ్రాయెల్ కచ్చితమైన దాడులవెనుక మూడు ఏఐ టూల్స్.

న్యూఢిల్లీ : ప్రస్తుతం ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం కేవలం క్షిపణులకే పరిమితం కాలేదు. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి పూర్తిస్థాయి ःఏఐ యుద్ధంःగా చరిత్రలో నిలిచిపోనుంది.ఒకప్పుడు సైనికుల మేధస్సు, ధైర్యంపై ఆధారపడిన యుద్ధాలు, ఇప్పుడు అల్గారిథమ్స్, డేటా అనలిటిక్స్ వైపు మళ్లాయి. ఇజ్రాయెల్ అమలుచేస్తున్న ఆధునిక యుద్ధతంత్రం భవిష్యత్తులో జరగబోయే యుద్ధాలకు మార్గదర్శనం కానున్నది. అసలు ఈ యుద్ధంలో ఏఐ ఎలా ఉపయోగిస్తున్నారో తెలుసుకుందాం. ఇజ్రాయెల్ రక్షణ దళాలు ప్రధానంగా మూడు ఏఐ వ్యవస్థలను ఒక వ్యూహం ప్రకారం వాడుతున్నాయి. వీటిద్వారా ఇరాన్ లో ఏ లక్ష్యాలను టార్గెట్ చేయాలి.? ఏ వ్యక్తులను టాప్ ప్రయారిటీలోకి తీసుకోవాలి? వారిని ఎలా ట్రాక్ చేయాలి? అన్న అంశాలకు ఏఐ చిటికెలో సమాధానాలు ఇస్తున్నాయి. ఇవే ఇప్పుడు ఇజ్రాయెల్ వజ్రాయుధాలుగా మారాలి. అవేమిటంటే..

**ది గోస్పెల్ :** ఇది ఇజ్రాయెల్ తయారుచేసిన సీక్రెట్ ఏఐ టూల్. ఇది ఇరాన్ పై నిరంతరం తిరుగుతున్న డ్రోన్లు, శాటిలైట్లనుంచి థర్మల్ ఇమేజెస్ తీసుకుని ఏ భవనాల్లో ఎక్కువ సెక్యూరిటీ లేదా అనుమానాస్పద కదలికలు ఉన్నాయో గుర్తిస్తుంది. అంటే ఏదైనా ఎమర్జెన్సీలో ముఖ్యమైన నేతలు ఎక్కడ కలుసుకుంటున్నారో కచ్చితంగా అంచనా వేస్తున్నది. అంటే లావెండర్ మానిటర్ చేస్తున్న 37వేలమందిలో ముఖ్యులు ఎక్కడైతే సమావేశానికి హాజరవుతున్నారో ఆ భవనాన్ని గుర్తిస్తుంది. అది ఎన్ని అంతస్తులు ఉన్నది? దానిని గోడలు ఎంతమందంతో ఉన్నాయి? ఆ భవానాన్ని 360డిగ్రీల్లో పరిశీలించి.. వారంతా ఏ గదిలో సమావేశమ య్యారు? అన్న సమాచారాన్ని గుర్తిస్తుంది. దీంతోపాటు మిసైళ్ల నిల్వలు ఉన్న ప్రాంతాలను కూడా ఇది గుర్తిస్తుంది. మిసైళ్లనుంచి వెలువడే ప్రత్యేకమైన వేడి (థర్మల్ సిగ్నేచర్)ని గుర్తించి.. అక్కడ ఎన్ని మిసైళ్లు ఉన్నాయో? కూడా 100శాతం పక్కగా సమాచారం ఇస్తున్నది. గతంలో ఇజ్రాయెల్ నిఘా విభాగం ఇలాంటి లక్ష్యాలను ఏడాదికి 50 మాత్రమే గుర్తించేది. కానీ, ఇప్పుడు రోజుకు 100కుపైగా ఈ టూల్ గుర్తిస్తున్నది. **లావెండర్ :**దీనిని ఒక మాల్ వేర్. దీనిని ఇరాన్ లోని సీసీటీవీ వ్యవస్థలోకి పంపి.. అక్కడినుంచి వ్యక్తులను ట్రాక్ చేస్తుంది. నిజానికి చాలా కాలంగా సొంత ఇంటర్నెట్ వ్యవస్థను నడు పుతున్నది. ఇది గూగుల్ లేకపోతే ఇతర అమెరికన్ సంస్థల చేతుల్లో కాకుండా సొంత వ్యవస్థ కావడంతో ఎలాంటి ప్రమాదం లేదని ఇరాన్ భావించింది. అయితే, ఇప్పుడు అందరూ అనుమానిస్తున్న విషయం ఏమిటంటే ఈ వ్యవస్థనే ఇజ్రా యెల్ హ్యాక్ చేసి తీసుకున్న డేటాను లావెండర్ అనే ఏఐ రియ ల్ టైమ్‌లో మానిటర్ చేసి ఇజ్రాయెల్ టార్గెట్ చేసిన వ్యక్తులను గుర్తించి వాళ్ల ప్రతి కదలికను ఇజ్రాయెల్ రక్షణ దళమైన ఐడీఎఫ్‌కు ఇస్తున్నది. ఇది ఎంత పవర్ ఫుల్ టూల్ అంటే ఇరాన్‌లో సుమారు 37వేలకుపైగా వ్యక్తుల డేటాను ఎప్పటికప్పుడు చెక్ చేస్తున్నది. లావెండర్ యాప్‌లో భాగమైన మరో టూల్‌బ్లూ వోల్ఫ్ ఇదిముఖాన్ని గుర్తించి.. కచ్చితమైన సమాచా రాన్ని కమాండ్ సెంటర్ కు పంపుతుంది. ఆ వ్యక్తి వద్ద ఎలాంటి ఎలక్ట్రానిక్ డివైజులు ఉన్నా యన్న సమాచారం కూడా సేకరిస్తుంది.

**వేర్ ఈజ్ డాడీ?** ఇది మరో టూల్. గోస్పెల్ టూల్ గుర్తించిన కమాండ్ సెంటర్ కి లావెండర్ టూల్ గుర్తించిన వ్యక్తి రాగానే ఈ టూల్ ఫైనల్ కాల్ ఇస్తుంది. అంటే మిసైల్ అటాక్ చేసేందుకు సిద్ధమని ఇజ్రాయెల్ సైన్యానికి సిగ్నల్ ఇస్తుంది. ఆ భవనాన్ని పేల్చేందుకు ఎంత పెలోడ్ అవసరం. దానికి అందుబాటులో ఉన్న ఏ మిసైల్ సరైనదో కూడా చెప్తుంది. ఖమేనీ మరణం తర్వాత సుప్రీం లీడర్ ను ఎన్నుకునేందుకు ముఖ్య నేతలు సమావేశమైన భవనంపై కూడా దాడి జరగడానికి ఈ టూల్సే కారణమని సైనిక నిపుణులు పేర్కొంటున్నారు.

**ఇరాన్ ఎదురుదాడి.. ःలో–టెక్ః వ్యూహం :**అత్యాధునిక ఏఐని ఎదుర్కోవడానికి ఇరాన్ కూడా వినూత్న పద్ధతులను అనుసరిస్తున్నది. బహిరంగ ప్రదేశాల్లో నకిలీ క్షిపణి లాంచర్లను ప్రదర్శించి ఏఐని తప్పుదోవ పట్టించడంతోపాటు ముఖ్యమైన నేతలు ఒకేచోట సమావేశం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఖమేనీ చనిపోవడంతోనే ముఖ్యనేతలందరూ స్మార్ట్‌ఫోన్లను నిషేధించి, పాతకాలపు ల్యాండ్ లైన్ టెలిఫోన్లతో పాటు కొరియర్లు అంటే మనుషులతో సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటున్నారు

# ప్రజలను ప్రేమించే నేను కావాలా?

## ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని నడిపే స్టాలిన్ కావాలా?

**- టీవీకే చీఫ్ విజయ్**



చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌పై తమిళగ వెట్రి కజగం (టీవీకే) చీఫ్ విజయ్ తీవ్ర విమర్శలు చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను ప్రేమించే విజయ్ కావాలా? లేదా ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని నడిపే స్టాలిన్ సర్ కావాలా? అని ప్రజలను కోరారు. సీఎం స్టాలిన్ తనను సైలెంట్‌గా ఉంచడానికి ప్రయత్నించినప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంట్లో ఉన్న విజయ్‌లను (అభిమానులు, కార్యకర్తలనుద్దేశించి) నిశబ్దంగా ఉంచలేరని ఎద్దేవా చేశారు. తంజావురులో జరిగిన బహిరంగ సభలో విజయ్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "తాను నటించిన జననాయగన్ చిత్రానికి మద్దతు ప్రకటించినందుకు సీఎం స్టాలిన్‌కు ధన్యవాదాలు. తమిళనాడు త్వరలో టీవీకే సర్కార్ అధికారంలోకి వస్తుంది. మత్స్యకారులారా ఆశాజనకంగా ఉండండి. మీ రక్షణ పూర్తి హామీ ఇస్తాం. స్టాలిన్ నన్ను మౌనంగా ఉంచడానికి ప్రయత్నించవచ్చు. కానీ రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో ఉన్న విజయ్‌లను మీరు మౌనంగా ఉంచలేరు. వారు ఇప్పటికే తమ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు" అని విజయ్ పేర్కొన్నారు.

# ఇరాన్ న్యూక్లియర్ బాంబ్ లేదు

● తయారు చేస్తున్నట్లు ఎలాంటి ఆధారాలు లేవు ● ఇరాన్ వద్ద అణు గ్రేడ్ యురేనియం నిల్వలున్నాయి

● ఇది ఆందోళన కలిగించే విషయం : ఐఏఈఏ డైరెక్టర్ జనరల్--రాఫెల్ గ్రోస్సీ




న్యూఢిల్లీ : ఇరాన్ అణు ఆయుధాలను నిర్మిస్తుందన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపణల నేపథ్యంలో అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ ) కీలక ప్రకటన చేసింది. ఇరాన్ న్యూక్లియర్ బాంబులు తయారు చేస్తుందని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవని ×ూజూూ డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రోస్సీ వెల్లడించారు. అయితే, ఇరాన్ వద్ద అణు గ్రేడ్ యురేనియం నిల్వ ఉండటం మాత్రం ఆందోళన కలిగించే విషయమని స్పష్టం చేశారు."ఇరాన్ అణు కార్యక్రమంపై నాకు వచ్చిన రిపోర్టుల ఆధారంగా నేను కచ్చితంగా, స్పష్టంగా చెప్పగలను. ఇరాన్ న్యూక్లియర్ ఆయుధాలు తయారు చేస్తుందని అనడానికి ఎలాంటి ఆధారాలు లేవు. కానీ, దాని దగ్గర సుసంపన్నమైన భారీ యురేనియం నిల్వలు ఉన్నాయి. అయితే, వీటిని పరిశీలించేందుకు మా సంస్థ ఇన్స్పెక్టర్లకు అనుమతి ఇవ్వకపోవడం ఆందోళనను రేకెత్తిస్తోంది.ఈ భద్రతా సమస్యలను పరిష్కరించడంలో ఐఏఈఏ ఎస్ ఇరాన్ సహాయం చేయకపోతే అణు కార్యక్రమం శాంతియుతంగా ఉందని ఏజెన్సీ హామీ ఇవ్వలేదు." అని ఐఏఈఏ డైరెక్టర్ జనరల్--రాఫెల్ గ్రోస్సీ అన్నారు.

అంతకుముందు ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా ఇరాన్ అణ్వాయుధాన్ని నిర్మాణ కార్యక్రమం గురించి ఐఏఈఏ కి ఎటువంటి సమాచారం లేదని డీజీ రాఫెల్ గ్రోస్సీ అన్నారు. "సైనిక సామగ్రిని భారీ మొత్తంలో అన్యాయంగా సేకరించడం, తనిఖీల్లో పారదర్శకత లేకపోవడం వంటి తీవ్రమైన ఆందోళన కలిగించే అనేక అంశాలు ఉన్నాయి. కానీ, అణ్వాయుధాన్ని నిర్మించడానికి ఒక క్రమబద్ధమైన కార్యక్రమం ఉందని సూచించే సమాచారం మాకు ఎప్పుడూ లేదు. కాబట్టి మనం ఈ రెండు విషయాలను బ్యాలెన్స్ చేసుకోవాలి. ఈ పనులన్నీ గమనిస్తే అమెరికా, ఇజ్రాయెల్ సహా ఇతర దేశాలకు ఇది నేరుగా అణ్వాయుధ తయారీకి ఉద్దేశించిందనే అభిప్రాయాన్ని కలిగిస్తాయి. అయితే, ఈ విషయంలో ఐఏఈఏ కు ఎలాంటి ఉద్దేశాలు లేవు. కానీ ఆందోళన చెందడానికి మాత్రం కారణాలు కనిపస్తున్నాయి." అని ఐఏఈఏ డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రోస్సీ అన్నారు. ఇరాన్‌పై దాడి చేయకపోతే వారి చేతుల్లోకి అణ్వాయుధాలు వచ్చేవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఐఏఈఏ డీజీ స్పందించారు.

అంతకుముందు ఇస్లామిక్ పాలకులను ःవెర్రి వ్యక్తులుः (క్రేజీ పీపుల్) అని అభివర్ణించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్, వారికి అణ్వాయుధం అందుబాటులో ఉంటే ఉపయోగించి ఉండేవారన్నారు. "మనం ప్రస్తుతం చేస్తున్న దాడులు చేయకపోతే మీరు అణు యుద్ధాన్ని ఎదుర్కొని ఉండేవారు. ఇప్పటికే వారు అనేక దేశాలను నాశనం చేసి ఉండేవారు మీకు తెలుసా? ఇప్పుడు వారు మానసిక అనారోగ్యంతో ఉన్నారు. ఇలాంటి క్రేజీ పీపుల్ వద్ద అణ్వాయుధం ఉంటే, వారు దానిని ఉపయోగించి ఉండేవారు" అని ట్రంప్ అన్నారు. మరోవైపు రాడికల్స్‌కు విధ్వంసక ఆయుధాలు అందుబాటులో లేనప్పుడు ప్రపంచం మెరుగ్గా ఉంటుందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అన్నారు. "ఇరాన్‌ను మతపరమైన పిచ్చివాళ్లు నడుపుతున్నారు. వారికి అణ్వాయుధాలు కలిగి ఉండాలనే ఆశయం ఉంది. క్షిపణులు, డ్రోన్లు, ఉగ్రవాదం పేరిట వారు అణ్వాయుధాలను అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. దీంతో ఆ విషయాలకు భయపడి ప్రపంచం వారిని ఏం చేయదని వారి ఆలోచన. అందుకే ఇప్పుడు వారి పని పట్టాల్సిన సమయం ఆసన్నమైంది. వారి నౌకాదళాన్ని, క్షిపణులు, డ్రోన్లు, వాటిని తయారు చేసే సామర్థ్యాన్ని నాశానం చేయాలని అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తీసుకున్నాడు. దీంతో వారు ఎప్పటికీ అణ్వాయుధాన్ని పొందే అవకాశం ఉండదు. అందుకే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇదే సరైన నిర్ణయం. ఈ రాడికల్ మతాధికారులకు ఇలాంటి ఆయుధాలు అందుబాటులో లేనప్పుడే ప్రపంచం సురక్షితమైన ప్రదేశంగా ఉంటుంది. వారు ఇప్పుడు వాటిని ఎలా ఉపయోగిస్తున్నారో మీరు చూస్తారు. వారు వీటిని ఎక్కువగా కలిగి ఉంటే ఒక సంవత్సరం తర్వాత వాటిని ఎలా ఉపయోగిస్తారో ఊహించుకోండి," అని ఆయన అన్నారు.

# రూపాయికి యుద్ధం సెగ..

## డాలర్‌తో పోలిస్తే ఆల్ టైమ్ కనిష్టానికి పతనం..



న్యూఢిల్లీ పశ్చిమాసియాలో ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య దాడులు తీవ్రం కావడంతో భారత రూపాయి విలువ బుధవారం కుప్పకూలింది. ముడిచమురు ధరలు ఆకాశాన్ని తాకడం, అంతర్జాతీయ మార్కెట్లో డాలర్‌కు డిమాండ్ పెరగడంతో రూపాయి విలువ ఎన్నడూ లేని విధంగా 92.41 వద్ద చరిత్రాత్మక కనిష్ట స్థాయికి చేరుకుంది.

మంగళవారం 91.47 వద్ద ముగిసిన రూపాయి విలువ, బుధవారం ఉదయమే 92 మార్కును దాటేసింది. చివరకు బ్లూమ్‌బర్గ్ డేటా ప్రకారం 92.15 వద్ద స్థిరపడింది. ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా సరఫరా గొలుసు దెబ్బతింటుందనే ఆందోళనతో ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 2 డాలర్ల కంటే ఎక్కువ పెరిగాయి. భారత్ తన చమురు అవసరాల కోసం దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడటం వల్ల, చమురు ధరలు పెరిగిన ప్రతిసారీ రూపాయిపై ఒత్తిడి పెరుగుతోంది.

**రిజర్వ్ బ్యాంక్ జోక్యం :** రూపాయి విలువ మరీ వేగంగా పడిపోకుండా ఉండేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (=దీ×) రంగంలోకి దిగింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా డాలర్లను విక్రయిస్తూ ఒడిదుడుకులను అదుపు చేసే ప్రయత్నం చేస్తోంది. అయితే, ఆర్‌బీఐ ఒక నిర్దిష్ట స్థాయి వద్ద రూపాయిని ఆపడం కంటే, పతనం వేగాన్ని తగ్గించడంపైనే దృష్టి పెట్టిందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. "ప్రస్తుతానికి ఈ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందనే దానిపై స్పష్టత లేదు. పరిస్థితులు ఇలాగే కొనసాగి, ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 90 డాలర్లకు చేరితే.. రూపాయి విలువ 93 లేదా 94 స్థాయికి పడిపోయే ప్రమాదం ఉంది" అని మెక్లే ఫైనాన్షియల్ సర్వీసెస్ డిప్యూటీ సీఈఓ రితేష్ భన్సాలీ వివరించారు.కర్యూర్ వైశ్యా బ్యాంక్ ట్రెజరీ హెడ్ వీఆర్‌సీ రెడ్డి మాట్లాడుతూ.. "అస్థిరత కొనసాగుతున్నంత కాలం రూపాయి 92–93 మధ్య ఊగిసలాడవచ్చు. ఆర్‌బీఐ నిరంతరం మార్కెట్‌ను గమనిస్తూ ఒడిదుడుకులను నియంత్రించే ప్రయత్నం చేస్తోంది" అని పేర్కొన్నారు.

**హోర్ముజ్ జలసంధి మూసివేత.. భారత్‌కు పెను ముప్పు:** భారతదేశానికి ఇది ఒక పెద్ద సవాలుగా మారింది. ఎందుకంటే భారత్ దిగుమతి చేసుకునే ముడిచమురులో సుమారు 50 శాతం ःహోర్ముజ్ జలసంధిః గుండానే వస్తుంది. ప్రపంచంలోని మొత్తం చమురు రవాణాలో ఐదో వంతు ఈ మార్గం ద్వారానే జరుగుతుంది. ఇరాన్ ఈ మార్గాన్ని అడ్డుకుంటే, భారత్‌కు చమురు సరఫరా నిలిచిపోయి ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది.

# అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలపై ఐఆర్ జిసి భీకర దాడులు



● 40 క్షిపణులు, 230 డ్రోన్లతో 17వ విడత దాడులు ● అమెరికా స్థావరాలే లక్ష్యంగా క్షిపణులు ప్రయోగించినట్లు వెల్లడి

న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరుకున్నాయి. ఇరాన్ సైనిక విభాగం ःఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ః (ఐఆర్జీసీ) బుధవారం దాడులను తీవ్రతరం చేసింది. అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలపై 17వ విడత దాడులను ప్రారంభించినట్లు అధికారికంగా ప్రకటించింది. దీన్ని ःఆపరేషన్ ట్రూ ప్రామిస్ 4ః గా ఇరాన్ వెల్లడించింది. ఇదే సమయంలో ప్రపంచ ఇంధన జీవనాడి హర్మూజ్ కూడా కీలక ప్రకటన చేసింది. ఈ జలసంధిలో చమురు నౌకలకు అమెరికా సైన్యం రక్షణ కల్పిస్తుందని ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ట్రంప్నకు ఐఆర్జీసీ కౌంటర్ ఇచ్చింది. హర్మూజ్ జలసంధిపై పూర్తి నియంత్రణ తమకు ఉన్నట్లు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రకటించింది. అంతేకాకుండా ఈ జలసంధి నుంచి ఏమైనా నౌకలు ప్రయాణిస్తే ధ్వంసం చేస్తామని హెచ్చరించింది. ఐఆర్జీసీ ఈ ప్రకటనతో ట్రంప్నకు కౌంటర్ ఇచ్చినట్టు అయ్యింది.

**ःఅమెరికా యుద్ధనౌకపై దాడి చేశాంః** హిందూ మహాసముద్రంలో ఒక అమెరికన్ యుద్ధనౌకపై దాడి జరిపినట్లు ఐఆర్జీసీ తెలిపింది. దాడి సమయంలో ఒక అమెరికన్ ట్యాంకర్ నుంచి ఇంధనం నింపుకుంటోందని, ఈ దాడి కారణంగా రెండు నౌకలలోనూ మంటలు చెలరేగినట్లు తెలిపింది. ఆక్రమిత ప్రాంతాల్లోని అనేక సున్నిత, వ్యూహాత్మక లక్ష్యాలపై దాడులు చేశామని, అలాగే ఖతార్, యూఏఈ, కువైట్ ప్రాంతాల్లోని అమెరికా స్థావరాలపై ప్రతిదాడులు నిర్వహించామని తెలిపింది. కువైట్, ఖతార్ , ఇరాక్లోని అగ్రరాజ్య స్థావరాలపై 230 డ్రోన్లతో దాడులు తెలిపింది. ఇజ్రాయెల్ లక్ష్యంగా 40 క్షిపణులు ప్రయో గించినట్లు తెలిపింది. ఇక ఇరాన్ చేసిన దాడుల్లో గల్ఫ్ దేశాల్లో ఇప్పటివరకు 8 మంది మృతిచెందారు.

680 మంది అమెరికన్ సైనికులు చనిపోయారు: ఐఆర్‌జీసీ ఇరాన్ చేపట్టిన ప్రతీకార దాడిలో 680మందికిపైగా అమెరికన్ సైనికులు చనిపోయారని తమ నిఘా వర్గాలు తెలిపాయని ఐర్జీసీ తెలిపింది. బహ్రెయిన్‌లోని ఒక కీలకమైన అమెరికా వైమానిక స్థావరం ఈ దాడుల్లో పూర్తిగా దెబ్బతిన్నదని, అక్కడి కమాండ్ సెంటర్లు ధ్వంసం కావడంతో ఆ బేస్ ప్రస్తుతం పనిచేయలేని స్థితికి చేరుకుందని ఇరాన్ స్పష్టం చేసింది.

దాడులు ఆపే ఉద్దేశం లేదు : యూఎస్ సెంట్రల్ కమాండ్ మరోవైపు అమెరికా కూడా ఈ దాడులను ఆపే ఉద్దేశం లేదని యూఎస్ కమాండ్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ తెలిపారు. అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త బలగాలు ఇరాన్‌లో నిరంతరం దాడులు నిర్వహించాయని చెప్పారు. ,ःమా బీ–2, బీ–1 బాంబర్లు ఇరాన్‌లోని పలు క్షిపణి కేంద్రాలపై కచ్చితమైన దాడులు జరిపాయి. గత రాత్రి బీ–52 బాంబర్ దళం బాలిస్టిక్ క్షిపణి స్థావరాలు, కమాండ్ అండ్ కంట్రోల్ పోస్టులపై దాడి చేసింది. ఇప్పటివరకు 17 ఇరానీ నౌకలను ధ్వంసం చేశాం. అరేబియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధి, గల్ఫ్ ఆఫ్ ఒమన్ ప్రాంతాల్లో ప్రస్తుతం ఒక్క ఇరానీ నౌక కూడా సముద్రయానంలో లేదు. మేం ఇరాన్ మిగిలిన మొబైల్ బాలిస్టిక్ లాంచర్లను వెంబడిస్తున్నాం. ఇరాన్ ఇప్పటికే 500కు పైగా బాలిస్టిక్ క్షిపణులు, 2,000కు పైగా డ్రోన్లు ప్రయోగించింది. పౌరులను లక్ష్యంగా చేసుకుంటుంది. అయితే ఇరాన్ ప్రతిదాడి సామర్థ్యం క్షీణిస్తోంది. మా సైనిక శక్తి పెరుగుతోందిః అన్నారు.

**ఐదో రోజుకు చేరిన ఘర్షణ :** అమెరికా–ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీతో సహా పలువురు కీలక నేతలు మరణించారు. ఆ తర్వాత ప్రారంభమైన పశ్చిమాసియా ఘర్షణ ఐదో రోజుకు చేరింది. ప్రతీకారంగా టెహ్రాన్ అమెరికా సైనిక స్థావరాలు,ఇజ్రాయెల్ ఆస్తులపై ప్రాంతవ్యాప్తంగా ప్రతిదాడులు కొనసాగిస్తోంది. అటు ఇజ్రాయెల్–అమెరికా కూడా దాడులను కొనసాగిస్తూనే ఉంది.

# మధ్యతరగతిపై ఆర్థిక పిడుగు!

● భారతీయుల చావుకొచ్చిన యుద్ధం ● భారీగా పెరగనున్న ధరలు.. ● సామాన్యులలో ఆందోళన

న్యూఢిల్లీ ఇరాన్ – ఇజ్రాయెల్ – అమెరికా మధ్య చెలరేగిన ఉద్రిక్తలు రోజు రోజుకు మరింత తీవ్రతరం అవుతున్నాయి. ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా దాడి చేస్తుంటే.. ఇరాన్ గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై క్షిపణుల వర్షం కురిపిస్తోంది. అయితే నానాటికి ముదురుతున్న యుద్ధ పరిస్థితులు.. భారత్ పై పెను ప్రభావం చూపొచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా సామాన్యుడి నెత్తిన ఈ యుద్ధం గుడిబండలా మారొచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకీ ఈ యుద్ధం భారత్ పై ఎలాంటి ప్రభావం చూపనుంది? ధరలు ఏ విధంగా పెరగనున్నాయి? భారత్ కు సొంతంగా చమురు నిల్వలు లేవా?

**పెట్రోల్, డీజిల్ ముప్పు :** యుద్ధం ముదిరితే అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల నుండి 140 డాలర్ల వరకూ పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. చమురు దిగుమతిపై ఎక్కువగా ఆధారపడుతున్న భారత్ పై ఇది ప్రభావం చూపనుంది. దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు గణనీయంగా పెరగవచ్చు. ముడిచమురు ధరలో ఒక డాలర్ పెరుగుదల భారత దిగుమతి బిల్లును దాదాపు 2 బిలియన్ డాలర్ల వరకు పెంచుతుంది.

**నిత్యవసరాలు, గ్యాస్ పెరుగుదల! :** పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే దేశంలో ఆటోమేటిక్ గా రవాణా ఖర్చులు పెరుగుతాయి. దీని వల్ల పప్పులు, కూరగాయాలు, నూనెలు, ప్యాక్ చేసిన ఆహార పదార్థాల (బిస్కెట్లు, సబ్బులు వంటివి) ధరలు పెరగొచ్చు. మరోవైపు గ్యాస్ ధరలు సైతం పెరగనున్నట్లు ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. భారత్ తన ఎల్పీజీ అవసరాల్లో దాదాపు 80 శాతం పైగా గల్ఫ్ దేశాలపై ఆధారపడుతూ వస్తోంది. యుద్ధం వల్ల వంటగ్యాస్ సరఫరాకు ఆటంకం కలిగి ధరలు భారీగా పెరగొచ్చు. అదే జరిగితే హోటల్స్, రెస్టారెంట్స్ లో ఆహార పదార్థాల ధరలు సైతం పెరిగే అవకాశముంది.


**అర్బుజ్ జలసంధి ముప్పు..** ప్రపంచంలోని ముడిచమురు రవాణాలో దాదాపు 20%.. ఇరాన్ ఆధీనంలోని అర్బుజ్ జలసంధి గుండానే జరుగుతోంది. భారత్ వచ్చే సరఫరాలో 50 శాతం వరకూ చమురు ఈ మార్గం గుండానే వస్తోంది. ప్రస్తుత యుద్ధం నేపథ్యంలో ఈ జలసంధిని ఇరాన్ ఏ క్షణమైనా మూసివేస్తుందన్న ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే భారత్ కు వచ్చే చమురు సరఫరాపై ప్రభావం పడొచ్చు. భారత్ వద్ద ప్రస్తుతం సుమారు 9.5 రోజులకు సరిపడా అత్యవసర చమురు నిల్వలు (విశాఖపట్నం, మంగళూరు, పదూర్ వద్ద) ఉన్నాయి. చమురు కంపెనీల వద్ద ఉన్న నిల్వలతో కలిపి భారత్ వద్ద సుమారు 25 రోజులకు సరిపడ చమురు ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

**జలసంధికి ప్రత్యామ్నాయ మార్గం** చమురు నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో భారత్ తన దిగుమతుల కోసం గల్ఫ్ దేశాలకు బదులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిపుణులు సూచిస్తున్నారు. రష్యా, అమెరికా, పశ్చిమ ఆఫ్రికా దేశాలు, లాటిన్ అమెరికా నుండి కొద్దిరోజుల పాటు చమురును దిగుమతి చేసుకుంటే మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే రష్యా చమురు విషయంలో భారత్ కు భరోసా కల్పించింది. భారత్ అవసరాలకు తగినంత క్రూడ్ ఆయిల్ ను సరఫరా చేసేందుకు తాము సిద్ధమని ప్రకటించింది. మరోవైపు అర్బుజ్ జలసంధికి ప్రత్యామ్నాయంగా చమురు తరలించే మార్గాలను సైతం భారత్ అన్వేషించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇందులో భాగంగా గల్ఫ్ దేశాల నుండి ఎర్ర సముద్రం (=వం ూము) పోర్టుల ద్వారా పైప్‌లైన్ల సాయంతో చమురును తరలించే మార్గాలను అన్వేషించాలని నిపుణులు సూచిస్తున్నారు.



# శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌక మునక..

## 100 మందికిపైగా గల్లంతు?



కొలంబో: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ.. శ్రీలంక తీరంలో అనూహ్య ఘటన చోటుచసుకుంది. తమ దేశ దక్షిణ తీరంలో మునిగిపోతున్న ఓ ఇరాన్ యుద్ధ నౌక నుంచి 32 మందిని రక్షించి, ఆసుపత్రిలో చేర్చినట్లు శ్రీలంకకు చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని, ఏడుగురికి అత్యవసర చికిత్స అందిస్తున్నామని వెల్లడించారు."గాలె తీరానికి 40 నాటికల్ మైళ్ల దూరంలో ःఐఆర్ఐఎస్ దేనాః అనే ఇరాన్ యుద్ధ నౌక ప్రమాదంలో ఉన్నట్లు శ్రీలంక నౌకాదళానికి సమాచారం అందింది. వెంటనే సహాయక చర్యల కోసం నౌకలు, ఎయిర్‌ఫోర్స్ విమానాలను పంపాం. ఈ నౌకలో 180 మంది ఉన్నట్లు సమాచారం. వారిలో దాదాపు 30 మందిని రక్షించాం" అని విదేశాంగ మంత్రి విజిత హెరాత్ పార్లమెంటుకు తెలిపారు. ఇజ్రాయెల్, అమెరికా దాడులు.. ఇరాన్ ప్రతిదాడులతో పశ్చిమాసియా అట్టుడుకున్న వేళ ఈ ఘటన ప్రాధాన్యం సంతరించుకుంది. నౌక ఎలా దెబ్బతింది? సిబ్బంది ఎలా గాయపడ్డారు? అనే వివరాలు తెలియరాలేదు. అయితే, ఈ నౌకపై జలాంతర్గామి దాడి జరిగిందని, 100 మందికిపైగా గల్లంతయ్యారని, 78మంది గాయపడ్డారనిఅంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. ःఐఆర్ఐఎస్ దేనాః.. ఇరాన్ కొత్త యుద్ధ నౌకల్లో ఒకటి. ప్రస్తుతం అమెరికా ఆంక్షల జాబితాలో ఉంది. ఇటీవల విశాఖ తీరంలో నిర్వహించిన విన్యాసాల్లో పాల్గొని, తిరుగు ప్రయాణంలో ఉండగా ఈ ఘటన జరిగినట్లు సమాచారం.

# నాకు ఏస్థానం ఇవ్వాలో అధిష్టానానికి తెలుసు

## సీఎం కుర్చీ కోసం విప్లవం అవసరం లేదు - కర్నాటక డిప్యూటీ సిఎం డీకే శివకుమార్ వ్యాఖ్యలు



బెంగళూరు: కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశం మరోసారి చర్చకు వచ్చింది. ఈ విషయంపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం స్థానం దక్కాలంటే విప్లవం లేవనెత్తాల్సిన అవసరం లేదని.. కాలమే నిర్ణయిస్తుందని అన్నారు. పార్టీ కోసం తాను చేస్తున్న కృషి అందరికీ తెలుసన్నారు. ఏ సమయంలో తనకు ఏ స్థానం ఇవ్వాలనే విషయంపై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందన్నారు.

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సహా పార్టీ కేంద్ర నాయకత్వం కర్ణాటక సీఎం మార్పుపై చర్చలు జరిపినట్లు వస్తోన్న వార్తల గురించి తనకు ఎటువంటి సమాచారం లేదన్నారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై తానెప్పుడూ బహిరంగంగా ప్రకటనలు చేయలేదని శివకుమార్ అన్నారు. ఆ పదవి ఖాళీ అయినప్పుడే మరొకరికి అవకాశం వస్తుందన్నారు. కానీ అలా కావాలని తానెప్పుడూ కోరుకోలేదన్నారు. తాను ప్రజల కోసం పలు పోరాటాలు చేశానని.. కానీ పదవి కోసం ఎప్పుడూ పోరాడలేదని అన్నారు.

**మాది పాలు–తేనె వంటి బంధం: సిద్ధరామయ్య**

సీఎం స్థానం కోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు మధ్య విభేదాలు నెలకొన్నట్లు వస్తున్న వార్తలను సిద్ధరామయ్య కొట్టిపడేశారు. అవన్నీ ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ఆరోపణలని అన్నారు. డీకే శివకుమార్‌కు మద్దతుగా ఉన్న ఎమ్మెల్యేల ఫోన్లను తాను ట్యాపింగ్ చేయించినట్లు విపక్ష నేత ఆర్.అశోక్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలు–తేనె వంటి తమ బంధాన్ని ఎలాగైనా నాశనం చేయాలనే ఉద్దేశంతోనే వారు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు.




# అయోమయంలో బీఆర్ఎస్ క్యాడర్

● పార్టీలో ఉండాలా.. పోవాలా.. అని సంశయం ● ఆగమాగం అంతా గందరగోళం ● అధికారంలో ఉన్నప్పుడు పార్టీ బలోపేతం పట్టని నాయకులు ● ఇప్పుడైనా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బీఆర్ఎస్ పార్టీ ఫోకస్ చేస్తుందా?

తెలంగాణ బ్యూరో: పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బీఆర్ఎస్ పార్టీ ఫోకస్ పెడుతుందా? లేదా? అనేది చర్చకు దారితీసింది. అసలు కమిటీ వేసి బీఆర్ఎస్ నేతలకు శిక్ష తరగతులు నిర్వహిస్తుందా? పార్టీ అనుబంధ సంఘాలు ఉన్నాయా? ఉంటే అవి పని చేస్తున్నాయా? అసలు పార్టీ బలోపేతం ఎప్పుడూ? మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కమిటీల ఏర్పాటు చేస్తారా? చేయరా? చేస్తే ఎప్పుడు? అనేది ప్రశ్నగా మారింది. అధికారంలో ఉన్నప్పుడు పార్టీ బలోపేతంపై ఫోకస్ పెట్టని బీఆర్ఎస్ అధిష్టానం ప్రతిపక్షంలో ఉన్నప్పుడైనా దృష్టి సారించడం లేదనేది ఇప్పుడు పార్టీ కేడర్ లోనే జరుగుతుంది.

**2023 ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు**

బీఆర్ఎస్ పార్టీ 2017లో పార్టీ గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలు వేసింది. ఆతర్వాత పార్టీ బలోపేతంపై దృష్టిసారించలేదు. కేవలం సభ్యత్వ నమోదు చేయించింది. కానీ కమిటీలు వేయలేదు. సుమారు 8 ఏళ్లుగా పార్టీ కమిటీలు వేయలేదు. అయితే 2023 ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు రావడం, ప్రధానప్రతిపక్ష పార్టీగానే మిగిలింది. ఆ తర్వాత వచ్చిన ఏ ఎన్నికల్లోనూ ఆశించిన ఫలితాలు సాధించలేదు. అంతేకాదు పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కొన్ని స్థానాల్లో పోటీకి దూరంగా ఉంది. రాష్ట్రంలో జరిగిన ఉప ఎన్నికల్లోనూ విజయం సాధించలేకపోయింది. దీనికి తోడు సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లోనూ అనుకున్న స్థాయిలో సత్తాచాటలేకపోయామని పార్టీ కీలక నేతలే ప్రకటించారు. కానీ ఈ ఫలితాలు రావడానికి కారణాలను మాత్రం పార్టీ అధిష్టానం సమీక్షించడం లేదని పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు. ఓటములపై పున:సమీక్షించకపోవడంతోనే వరుస ఓటములకు కారణమని, దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడంతోనే ప్రతికూల ఫలితాలు వస్తున్నాయనేది పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

**ఓటములకు కారణం..**

ఏ పార్టీ అయినా క్షేత్రస్థాయి నుంచి బలంగా ఉంటేనే ఏ ఎన్నికలు వచ్చినా సత్తాచాటుతుంది. అనుకూలమైన ఫలితాలు వస్తాయి. కానీ కేడర్ ను, పార్టీని బలోపేతం చేయకుండా ఆశించిన ఫలితాలు రావాలని గులాబీ పార్టీ అధిష్టానం ఆశిస్తుంది. కానీ సంస్థాగతంగా పార్టీ నిర్మాణంపై దృష్టి సారించక పోవడమే ఓటములకు కారణమని పార్టీ సీనియర్లు బహిరంగంగానే పేర్కొంటున్నారు. పార్టీ నేతలకే పదవులు లేకుండా ఎలా పనిచేస్తారని ప్రశ్నలు సైతం ఉత్పన్నమవుతున్నాయి. కేడర్ తో ఉత్సాహంగా పనిచేయించాలంటే గ్రామ కమిటీలు పూర్తి స్థాయిలో వేసినప్పుడు మాత్రమే సాధ్యమని పలువురు పేర్కొంటున్నారు. అందుకు మాత్రం పార్టీ దృష్టిసారించడం లేదు. కనీసం పార్టీ మెంబర్ షిప్ సైతం చేస్తామని ప్రకటించిన అధిష్టానం.. ఆ దిశగా మాత్రం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఏ కార్యచరణతో ప్రజల ముందుకు వెళ్లాలో తెలియక పార్టీ నేతలు సతమతమవుతున్నారు.

ప్రభుత్వ వ్యతిరేక అంశాల పై..బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ సైతం పూర్తి స్థాయిలో లేదు. కమిటీలో ఉన్న నేతలు ఇతర పార్టీల్లోకి వెళ్లడంతో వాటిని కూడా భర్తీ చేయలేదు. మరోవైపు ఇతర పార్టీల నుంచి మళ్లీ బీఆర్ఎస్ లో చేరిన సీనియర్ నేతలకు సైతం పదవులు ఇవ్వలేదు. దీంతో వారు సైతం నిరాశకు గురవుతున్నారు. దీనికి తోడు ఇప్పటికీ మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలే నియోజకవర్గ ఇన్ చార్జులుగా కొనసాగుతుండటంతో అక్కడ పార్టీ బలోపేతం కావడం లేదని, ప్రజల నుంచి సైతం పార్టీకి సరైన స్పందన రావడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్నప్పటికీ గులాబీ పార్టీకి మాత్రం సానుకూలత రావడం లేదని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ వ్యతిరేక అంశాలపై పోరాటం చేస్తే తప్ప గులాబీవైపు ప్రజలు చూస్తారని పలువురు పేర్కొంటున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మాత్రమే టీఆర్ఎస్ పార్టీ శిక్షణ తరగతులు నిర్వహించింది. అప్పుడు యాక్టీవ్ కార్యక్రమాలతో నిత్యం ప్రజల్లో నేతలు ఉండేవారు. తర్వాత అధికారంలోకి వచ్చాక ఎన్నడూ సంస్థాగత నిర్మాణంపై కానీ.. శిక్షణ తరగతుల గురించి కానీ ఆలోచన చేయలేదు. ఇదే సమయంలో ప్రధాన ప్రతిపక్షంగా ప్రజా ఉద్యమాలను నిర్మించడంలో బీఆర్ఎస్ నాయకత్వం ఆలోచన చేయడం లేదని సొంత పార్టీ నేతలే పేర్కొంటున్నారు.




**బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం**

పార్టీ సంస్థాగత బలోపేతంతో పాటు.. సభ్యత్వ నమోదును ప్రారంభిస్తామని గత ఏడాది ప్రారంభంలో బీఆర్ఎస్ ముఖ్య నేతలు మీడియా ముందుకు ప్రకటించారు. గత ఏప్రిల్ 27న బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభను వరంగల్ లో గ్రాండ్ గా నిర్వహించింది. మళ్లీ బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం దగ్గరికి వస్తున్నప్పటికీ.. పార్టీ సంస్థాగత నిర్మాణంపై గులాబీ పార్టీ నాయకత్వం దృష్టి పెట్టలేదు. అన్ని జిల్లాల్లో శిక్షణా తరగతులు సైతం నిర్వహిస్తామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ గతంలో చెప్పినా నేటికీ ఆచరణ కి నోచుకోలేదు. పార్టీకి అనుబంధ సంఘాలు ఉన్నాయా లేవా? అనేది ఇప్పుడు చర్చకు దారితీసింది. పార్టీ కీలక నేతలు తప్ప అనుబంధ సంఘాలు విద్య, నిరుద్యోగ, ఉద్యోగ, రైతు, మహిళల, ఎస్సీ, ఎస్టీ విభాగాలు పోరాట బాటపట్టిన దాఖలాలు లేవు. పదవుల కోసం నేతలు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం స్పందించి సంస్థాగత నిర్మాణంపై దృష్టిసారిస్తుందా? లేదా? అనేది పార్టీలో చర్చకుదారితీసింది.

## ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో కలకలం

● మరోమారు వివాదస్పద వ్యాఖ్యలు చేసిన కొండా మురళి
● వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి సుస్మిత పోటీ చేయడం ఖాయమంటూ రచ్చ

వరంగల్ : తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మరిచిపోయిన పాత సంఘటను గుర్తు చేస్తూ మాట్లాడటం ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో సంచలనంగా మారింది. గత రెండేళ్ళుగా తరచూ వివాదంలో చిక్కుకుంటున్న మురళి వ్యాఖ్యలు తాజాగా మరోసారి చర్చనీయాంశంగా మారాయి. మొన్నామధ్య ఒక సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో మంత్రి మాజీ పీఏను అరెస్టు చేసేందుకు పోలీసులు వచ్చిన సమయంలో మంత్రి కుమార్తె సుస్మిత పోలీసులను తిట్టడమే కాకుండా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే అంశాన్ని కొండా మురళి గుర్తుచేయడం కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.వరంగల్ జిల్లా పరకాల నియోజకవర్గ పరిధిలోని కొమ్మాల జాతర సందర్భంగా ప్రభ బండ్లు కట్టిన నేపథ్యంలో మంగళవారం రాత్రి కార్యకర్తల నుద్దేశించి కొండా మురళి 'నా బిడ్డ సుస్మిత ఇక్కడనే ఉంటది. మీ బాగోగులు చూసుకుంటది. నా కంటే ధైర్యవంతురాలు. మొన్ననే మీరు చూసింద్రు. వాడెవడు.. వీడెవడు.. కొండా మురళికి అడ్డెవడు? మొన్న ఇంటి ముందు చూసింద్రు. చిట్టక్క తిట్టాలంటే ఎవన్నిబడితేవాన్ని తిడుతది. వాడూ వీడూ అనే తేడా చూడదు. కార్యకర్తల కోసం ఏదైనా చేస్తది' అన్నారు. అదే సమయంలో వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి సుస్మిత పోటీ చేయడం ఖాయమంటూ మరో చర్చను లేవనెత్తారు. ఈ సందర్భంగా కొండా సుస్మిత మాట్లాడుతూ వారంలో రెండు రోజులు వంచనగిరిలో మీకు అందుబాటులో ఉంటానని చెప్పారు. పరకాల నుంచే తన ప్రస్థానాన్ని ప్రారంభిస్తానని ప్రకటించారు. కొండా మురళి, సుస్మిత వ్యాఖ్యలతో మరోసారి కాంగ్రెస్ వర్గాల్లో కలకలం రేగుతోంది. సీఎంను తిట్టినప్పటికీ తర్వాత రాజీ కుదిరిందని వార్తలు వచ్చాయి. ఇప్పటికే విపక్ష బీఆర్ఎస్ ఈ అంశాన్ని పదేపదే లేవనెత్తుతుండగా తాజాగా కొండా మురళి ఈ సంఘటన గుర్తుచేయడం... మారిన గాయాన్ని రేపినట్లుగా ఉందని కాంగ్రెస్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. గతంలో కొండా మురళి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలపై చేసిన వ్యాఖ్యల అంశం క్రమశిక్షణ కమిటీ పరిధిలో ఉంది. దీంతో పాటు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటితో, పశ్చిమ ఎమ్మెల్యే నాయినితో విభేదాలు నెలకొన్నాయి. మేడారం జాతర సందర్భంగా కూడా వివాదాస్పదంగా మారారు. ఈ నేపథ్యంలో కొండా మురళి మాట్లాడుతూ పరకాల మా అడ్డా అంటూ కొత్త వివాదానికి తెరతీశారనే అభిప్రాయం రాజకీయ పరిశీలకుల్లో వ్యక్తమవుతున్నది. పరకాలలో ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయన బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ చేరి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

## తెలంగాణ వర్సిటీలో హోలీ సంబరాల వివాదం

**విద్యార్థుల మధ్య ఘర్షణ - పలువురికి గాయాలు**

భిక్కనూరు: తెలంగాణ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లి శివారులో ఉన్న వర్సిటీ సౌత్ క్యాంపస్ వసతిగృహంలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. హోలీ సంబరాల అనంతరం సీనియర్, జూనియర్ విద్యార్థులు రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరం దాడులకు పాల్పడ్డారు. దీంతో పలువురికి గాయాలయ్యాయి. వర్సిటీ సిబ్బంది వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వసతిగృహం వద్దకు స్థానిక ఎస్సై ఆంజనేయులు, వార్డెన్ డాక్టర్ యాలాద్రి అక్కడికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు. విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

## తెలంగాణలో జనసేన బలోపేతమే ధ్యేయం


● జనసేన పార్టీలో భారీగా చేరికలు ● మహిళలను జనసేనలో ప్రోత్సహిస్తాం
● మహిళలను జనసేన పార్టీలోకి ఆహ్వానించిన ముమ్మారెడ్డి ప్రేమ కుమార్




తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: మహిళలను జనసేన పార్టీలో ప్రోత్సహిస్తామని జనసేన రాష్ట్ర నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ అన్నారు. బుధవారం జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు పవన్ నాయుడు ఆధ్వర్యంలో సైబరాబాద్ కార్పొరేషన్ కో-ఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ సమక్షంలో మహిళలు ఉద్యమి క్రియాశీలక సభ్యత్వం లో నమోదు చేసుకొని జనసేన పార్టీలోకి అధికారికంగా చేరారు. వారికి ప్రేమకుమార్ పార్టీ కండువా కప్పి, వారిని సాదరంగా జనసేన లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రేమకుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జనసేన ను బలోపేతం చేయడం లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో జనసేన పార్టీలో మహిళలకు ప్రత్యేక గౌరవం ఇస్తామన్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలు సమాజ సేవ పట్ల ఆయనకున్న అంకితభావం అనేక మందిని ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా మహిళలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని, వారి భాగస్వామ్యం పార్టీ బలాన్ని మరింత పెంచుతుందని అన్నారు. జనసేన పార్టీ సామాన్య ప్రజల హక్కుల కోసం, పారదర్శక పాలన కోసం, యువత మరియు మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు కట్టుబడి ఉందని ఆయన వివరించారు. పార్టీలో చేరిన మహిళలు సమాజ సేవలో చురుకుగా పాల్గొని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జోన్ కో- ఆర్డినేటర్లు మండలి దయాకర్, కొల్లా శంకర్, మండలి అనిల్, అడక్ కమిటీ సభ్యులు అనిత గాలి,వేముల మహేష్ ,పోలేబోయిన శ్రీనివాస్, రణదీప్, యోగేష్, జాల రవి, తుంగల రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల భద్రతకే మా తొలి ప్రాధాన్యత

**జాతీయ భద్రతా వారోత్సవాలలో టీజీఎస్ ఆర్టీసీ వీసీ ఎండీ వై.నాగిరెడ్డి**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : జాతీయ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, వర్క్‌షాప్‌లు మరియు ఉత్పత్తి యూనిట్లలో భద్రతా వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం అన్ని యూనిట్లలో 'భద్రతా దినోత్సవాన్ని' నిర్వహించి, సిబ్బందికి భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా హైదరాబాద్ బస్ భవన్ లో టీజీఎస్ ఆర్టీసీ వీసీ & ఎండీ వై.నాగిరెడ్డి మాట్లాడుతూ...కార్పొరేషన్‌లో పనిచేసే ప్రతి ఉద్యోగి, సూపర్వైజర్ ల భద్రత సంబంధిత అధికారులు తమ ప్రాథమిక బాధ్యతగా గుర్తించాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ "కార్మికులు, ఉద్యోగుల భద్రతే మా ప్రధాన ధ్యేయమని. బస్ డిపోలు , వర్క్‌షాప్‌లలో భారీ యంత్రాలు, వెల్డింగ్ పరికరాలు, ఇంధన నిర్వహణ వంటి క్లిష్టమైన పనులు చేసేటప్పుడు కార్మికులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి" అని ఆయన సూచించారు. ప్రతి సంవత్సరం మార్చి 4న జాతీయ భద్రతా దినోత్సవాన్ని జరుపుకుంటామని, ఈ ఏడాది వారం రోజుల పాటు అట్టడుగు స్థాయి వరకు అవగాహన కల్పించేలా భద్రతా వారోత్సవాలు నిర్వహించేలా అన్ని గ్యారేజీలు, జోనల్ వర్క్‌షాప్‌లు మరియు బాడీ బిల్డింగ్ యూనిట్లకు ( ఆదేశాలు జారీ చేసినట్లు ఎండీ నాగిరెడ్డి తెలిపారు. సురక్షితమైన పని వాతావరణం వల్ల ఉద్యోగుల ప్రాణాలకు రక్షణ లభించడమే కాకుండా, సంస్థ యొక్క ఖ్యాతి కూడా పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిహెచ్.వెంకన్న, ఈడీ ( ఇఎఎమ్ ), పలువురు ఉన్నతాధికారులు పాల్గొని భద్రతా ప్రతిజ్ఞ చేశారు.

# లాలూచీలకే బదిలీలా?




● ఎక్సైజ్ శాఖలో పదోన్నతులు, బదిలీలపై ఆరోపణలు ● ఒక వర్గం మెరిట్.. మరో వర్గం సీనియారిటి అని వాదనలు
● ఎనిమిది యేండ్లుగా పారదర్శక లోపం ● నిబంధనలకు విరుద్ధంగానా? అనుకూలంగానా?
● అధికారులు ఎలా వ్యవహరిస్తారన్న దానిపై అనుమానాలు

తెలంగాణ బ్యూరో: యేండ్లు గడుస్తున్న ఉద్యోగంలో తృప్తి లేదు. పనిచేసిన చేయకపోయినా ఉన్నత అధికారులతో లాలూచి పడే ఉద్యోగులకే బదిలీలు, పదోన్నతి. ఎక్సైజ్ నిబంధనలను పక్కకు పెట్టి కేవలం అనుకూల వ్యక్తులకే బదిలీల్లో అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలలో ఉన్న ఎక్సైజ్ శాఖ కానిస్టేబుల్లో రెండు వర్గాలుగా వీడిపోయినట్లు తెలుస్తుంది. ఒక వర్గం మెరిట్.. మరో వర్గం సీనియారిటి అని వాదిస్తున్నారు. గత కొన్నేండ్లుగా కనీసం బదిలీలు లేక అవస్థలు పడుతున్నారని సమాచారం. ప్రభుత్వంలోని పెద్దలు నిబంధనలకు విరుద్ధంగా, అనుకూలంగా వ్యవహిరిస్తారా వేచి చూడాలిసిందే.

**ఖాళీలను భర్తీ చేయడంలో నిర్లక్ష్యం..**

ఎక్సైజ్ కానిస్టేబుళ్ల ప్రమోషన్లలో గందరగోళం నెలకొంది. గత ఎనిమిది ఏళ్లుగా జిల్లాలో ఎక్సైజ్ కానిస్టేబుల్స్ బదిలీలు, ప్రమోషన్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఇప్పటికే 45 ఎక్సైజ్ కానిస్టేబుల్ ఖాళీలు ఉండగా వాటిని భర్తీ చేయడంలోనూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ఈ ఎక్సైజ్ కానిస్టేబుళ్ల ప్రమోషన్లలో సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని కొందరీ వాదనైతే... అదే కాదు మెరిట్ ప్రకారమే ప్రమోషన్లు ఇవ్వాలని మరికొందరు కానిస్టేబుళ్లు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఒకవైపు ప్రమోషన్ల గొడవ ఒకటైతే.. అసలు 8 ఏళ్లుగా జిల్లాలో బదిలీలు లేక చాలామంది కానిస్టేబుళ్లు ఆందోళనకు గురవుతున్నారు. ఈ సమస్య ఎక్సైజ్ కమిషనర్ వద్ద ఉన్నప్పటికీ ఆయన తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ప్రమోషన్లు రాక అసహానం..:** తెలంగాణలోని అన్ని జిల్లాల్లో సీనియార్టీ ప్రకారమే ఎక్సైజ్ కానిస్టేబుల్ ప్రమోషన్లు జరిగినప్పటికీ రంగారెడ్డి జిల్లాలో మాత్రం ప్రమోషన్లలో ఈ గందరగోళం నెలకొంది. రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్ జిల్లాల పరిధి(సి డి -6)లో ఈ సమస్యతో వెల్ల తరబడి పనిచేస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుళ్లు ప్రమోషన్లు రాక అ సహానానికి గురవుతున్నారు. కొందరు ఎక్సైజ్ కానిస్టేబుళ్లు ఈ సమస్య వల్ల హెచ్ ఆర్ ఏ కోల్పోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ సమస్య పరిశీలించిన హైకోర్టు ఏజ్ ఆఫ్ సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు మాత్రం అవేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఈ సమస్యను కోర్టులోనే తేల్చుకోవాలని ఎక్సైజ్ హైదరాబాద్ నోడల్ సుపరిండెంట్ పంచాక్షరి చెబుతున్నట్లు విమర్శలున్నాయి.

**సీనియార్టీ ప్రకారమే..**


ఎక్సైజ్ కానిస్టేబుల్ ప్రమోషన్లు లేక పోవడంతో పాటు కొత్త నియమకాలు కూడా లేకపోవడంతో పరిస్థితి గందరగోళంగా మారిందని చెప్పవచ్చు. ఇప్పటికైనా ఎక్సైజ్ కమిషనర్ ఈ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీనియార్టీ ప్రకారమే ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆ ప్రమోషన్లు జరుగుతున్నప్పటికీ ఓ యూనియన్ నాయకుడు మెరిట్ వాదనను తీసుకొచ్చి అక్రమ మార్గంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ ప్రమోషన్లు పొందేటట్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరో రెండు మూడు ఏళ్లలో పదవి విరమణ పొందబోతున్న చాలామంది ఎక్సైజ్ కానిస్టేబుల్ ప్రమోషన్లకు నోచుకోలేకపోతున్నామని, ఇప్పటికైనా ఎక్సైజ్ కమిషనర్ ఈ సమస్యను పరిశీలించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

# ముఖ్యమంత్రి అంటే ఢిల్లీ పర్యటనలేనా?

● కాంగ్రెస్ సర్కార్‌కు విజన్ లేదు, మిషన్ లేదు ● కమిషన్లకే పరిమితమైన కాంగ్రెస్ సర్కార్
● రెండేళ్లలో ఐఏఎస్ అధికారుల బదిలీలు 60 సార్లు చేస్తారా? ● సీఎం రేవంత్ రెడ్డి 60 సార్లు ఢిల్లీ వెళ్లారు
● ప్రజల కోసం పనిచేస్తామని అధికారంలోకి వచ్చి ఢిల్లీ పర్యటనలు చేస్తారా? ● మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: కాంగ్రెస్ సర్కారుకు విజన్ లేదు... మిషన్ లేదు... కేవలం కమీషన్లతో పాలన నడిపిస్తూ, అధికారాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా మారిందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ ఘాటుగా విమర్శించారు. బుధవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బిజెపి మాజీ ఎమ్మెల్యే డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా రెండేళ్ల పాలన పూర్తి చేసుకుంటున్నారు. ఈ రెండు సంవత్సరాల కాలంలో దేశంలోని ఏ రాష్ట్రంలోనూ చూడని విధంగా పరిపాలనా అస్థిరత తెలంగాణలో కనిపిస్తోందని భారతీయ జనతా పార్టీ మాజీ ఎమ్మెల్యే డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ గారు విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయ్యాయి. అదే సమయంలో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి కూడా రెండేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకుంటున్నారు. ఈ రెండు సంవత్సరాల వ్యవధిలో జరిగిన పరిణామాలను చూస్తే, దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇలాంటి పరిస్థితి కనిపించలేదేమో అన్న భావన కలుగుతోందని ఎన్.వి.ఎస్.ఎస్. విమర్శించారు. గత రెండేళ్లలో సుమారు 60 సార్లు రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగాయని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ఇతర ఉన్నతాధికారుల బదిలీలు కూడా దాదాపు 60 సార్లకు పైగానే జరిగాయని తెలిపారు. పరిపాలనలో స్థిరత్వం లేకపోవడం, ఒక స్పష్టమైన దిశా నిర్దేశం లేకపోవడం వల్లే ఇంత భారీ స్థాయిలో బదిలీలు జరుగుతున్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనల విషయానికొస్తే, తన పదవిని పదిలం చేసుకోవడానికే 60 సార్లకుపైగా ఢిల్లీకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఇది రాష్ట్ర ప్రయోజనాల కంటే వ్యక్తిగత రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని సూచిస్తోందని అన్నారు. మొత్తానికి, ఇది ఒక దశ, దిశలేని ప్రభుత్వం లాగా పనిచేస్తోందని, దూరదృష్టి లోపించిందని, పాలనపై పట్టులేకపోవడమే ఇన్నిసార్లు ఉన్నతాధికారుల బదిలీలకు కారణమని భారతీయ జనతా పార్టీ అభిప్రాయపడుతోందని ప్రభాకర్ స్పష్టం చేశారు. నిన్న జరిగిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 99 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రకటించి, అన్ని కలెక్టర్లు కనీసం 10 రోజులు గ్రామాల్లోనే ఉండి ప్రజల్లో తిరగాలని ఆదేశించడం గమనార్హమని ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ వ్యాఖ్యానించారు. అంటే గత రెండు సంవత్సరాలుగా అధికారులు గ్రామాల్లో తిరగలేదా? ప్రజలను నేరుగా కలవలేదా? అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతోందని అన్నారు. ఇదే విషయాన్ని ఇంతకుముందు జరిగిన సీఎల్పీ సమావేశంలో కూడా ఎమ్మెల్యేలకు "జనాల్లోకి వెళ్లాలి, ప్రజల సమస్యలు పట్టించుకోవాలి" అని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ పరిణామాలను బట్టి చూస్తే, "నోబడీ ఈజ్ లిసనింగ్ టు హానరబుల్ సీఎం" అన్న భావన స్పష్టమవుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి చెప్పినా అమలు జరగడం లేదంటే, పాలనపై పట్టులేదనే విషయం బయటపడుతోందని అన్నారు. మొత్తానికి ఈ ప్రభుత్వానికి స్పష్టమైన విజన్ లేదు, మిషన్ లేదు --- కేవలం కమిషన్ కోసం మాత్రమే పని చేస్తున్నట్టుగా కనిపిస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించారు. జీహెచ్ఎంసి పరిధిని విస్తరించి 300 సీట్లతో గ్రేటర్ హైదరాబాద్ ఏర్పాటు చేసి, ఆ తర్వాత కొద్ది రోజుల్లోనే మూడు ముక్కలు చేయడం దూరదృష్టి లోపానికి ఉదాహరణ అన్నారు. ఒక నిర్ణయం తీసుకునే ముందు స్పష్టమైన ప్రణాళిక, లక్ష్యం ఉండాలన్నారు. పురపాలక సంఘాల రిజర్వేషన్ల విషయంలో జిహెచ్ఎంసిని ఒకటిగా చూపించి రిజర్వేషన్లు ఖరారు చేసి, అనంతరం మూడు భాగాలుగా విభజించడం రిజర్వేషన్ ప్రక్రియను దెబ్బతీసే చర్యగా కనిపిస్తోందన్నారు.




# మాట ఇచ్చి తప్పడం కాదు అమలు చేయాలి

● యేటా బీసీల సంక్షేమానికి ఇస్తా అన్న హామీ ఏమయింది ● బీసీలకు బడ్జెట్లో 200 కోట్లు కేటాయించాలి
● 290 గురుకులాలు 325 కాలేజీ హాస్టల్లకు సొంత భవనాలు నిర్మించాలి ● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : బీసీల బడ్జెట్ 25వేల కోట్లు కేటాయించాలి ముఖ్యమంత్రికి ఆర్. కృష్ణయ్య బహిరంగ లేఖ వచ్చే ఆర్థిక సంవత్సరం బీసీల సంక్షేమానికి, అభివృద్ధికి బీసీల బడ్జెట్ 25వేల కోట్లు కేటాయించాలని, 290 బీసీ గురుకుల పాఠశాలలకు, 325 కాలేజీ హాస్టళ్ళు సొంత భవనాలు నిర్మించాలని ఆర్. కృష్ణయ్య ముఖ్యమంత్రి బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో యేటా 25వేల కోట్లు కేటాయిస్తామని ప్రకటించారు. కానీ ఇంతవరకు 10వేల కోట్లకు మించి కేటాయించడం లేదు. ఖర్చు పెట్టడం లేదు. గత రెండు సంవత్సరముగా బీసీ సంక్షేమ అభివృద్ధి కుంటు పడింది. కొత్త పథకాలు లేవు. ఫీజులు, స్కాలర్షిప్లు చెల్లించడం లేదు. బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయడం లేదు. ఒక హాస్టల్ బిల్డింగ్ కానీ, గురుకుల పాఠశాల బిల్లులు గాని కట్టలేదు. చివరకు ఒక పైసా ఖర్చు లేని స్థానిక సంస్థల రిజర్వేషన్లు 42 శాతంకు పెంచుతామని వాగ్దానం చేసి పెంచలేదు. బీసీ వ్యతిరేకం చర్యలకు పాల్పడుతున్నారు. పేరుకి బీసీ సంక్షేమ శాఖ కాని ఒక బీసీ ఉన్నత అధికారిని కమిషనర్, సెక్రటరీ బీసీని నియమించలేదు. బీసీలను విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో అణచివేస్తున్నారని ధ్వజమెత్తారు.ఈ వ్యతిరేక వైఖరి మార్చుకోకపోతే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈ బడ్జెటులో క్రింది పద్దులతో బడ్జెటు కేటాయించాలి. బిసి కార్పొరేషన్ కు సబ్సిడీ రుణాల కోసం రూ.4 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలి. ఒక్కొక్క కుటుంబానికి 10 లక్షల సబ్సిడీ ఇవ్వాలి.2. 290 బీసీ గురుకుల పాఠశాలలు అన్నీ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. భవనాలు, సరైన వసతి సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆశించిన విద్యా ప్రమాణాలు- లక్ష్యాలు నెరవేరడం లేదు. కేంద్ర ప్రభుత్వం 80 శాతం నిధులు ఈ పద్దు క్రింద భవనాల నిర్మాణం కోసం 5 వేల కోట్లు ఇవ్వాలి. కావున దశలవారీగా గురుకుల పాఠశాలల భవనాల నిర్మాణం చేయడానికి రాష్ట్ర బడ్జెట్లో 20 శాతం కింద 400 కోట్లు బడ్జెట్ కేటాయించాలని కోరారు. మిగతా 80 శాతం కేంద్రం నుంచి తీసుకోవాలి.3. రాష్ట్రంలో 325 కాలేజీ హాస్టళ్ళు కొనసాగుతున్నాయి. అన్ని కాలేజీ హాస్టళ్ళు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అద్దె భవనాలకు ఏటా కోట్ల రూపాయల అద్దెలు చెల్లిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం 80 శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం మ్యాచింగ్ గ్రాంటు క్రింద దశలవారీగా సొంత భవనాలు నిర్మించడానికి ఈ బడ్జెట్లో 500 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నాము. వి.దీ.జ కార్పొరేషన్ కు 2 వేల కోట్లు కేటాయించాలి. 12 బి.సి కులాల పెడరేషన్లకు జనాభా నిష్పత్తిలో 2వేల కోట్లు కేటాయించాలి. ఇంజనీరింగ్/ ఎంబీఏ/ ఎంసీఏ/ పీజీ/ డిగ్రీ/ఇంటర్ తదితర కాలేజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థుల మొత్తం ఫీజుల స్కీమును పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఎస్.టి./ఎస్.సి/ మైనారిటీ విద్యార్థులకు ఇస్తున్న మాదిరిగా బిసి/ఇబిసి విద్యార్థులకు కూడా పూర్తి ఫీజులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము. విదేశీ విద్య స్టైఫండ్ స్కీమ్ క్రింద అర్హులందరికీ స్టై పండు ఇవ్వడానికి దీని బడ్జెట్ 60 కోట్ల నుంచి 300 కోట్లకు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నాము. బి.సి అడ్వకేట్లకు ఇచ్చే స్టై పండ్ నెలకు రూ.1000 నుంచి 10 వేలకు పెంచాలి. బడ్జెటు కేటాయించాలి.. 2.2.20 ఎన్.ఐ.టి తదితర కోర్సులకు కూడా పూర్తి ఫీజులు చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ఫీజులు కట్టలేక చాలామంది బిసిల సీట్లు వదులు కుంటున్నారు. ఈ సంవత్సరంలో అదనంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం కు ఒక బి.సి గురుకుల పాటశాలలు మంజూరు చేయాలి. బి.సి స్టడీ సర్కిల్ కు 200 కోట్లు కేటాయించాలి. కోచింగ్ పద్ధతులు మార్చాలి. అర్హులందరికీ ఋాజ, పోలీస్, గ్రూప్-1,2,3,4 సివిల్స్, బ్యాంకింగ్, రైల్వే ఇతర పోటీ పరిక్షలకు కోచింగ్ ఇవ్వాలి. బి.సి కాలేజీ హాస్టల్ విద్యార్థులకు పాకెట్ మని నెలకు 500 మంజూరు చేయాలి. రాజ విద్యార్థులకు ఇస్తు బి.సి విద్యార్థులకు ఇవ్వకపోవడం న్యాయమా.13. కులాంతర వివాహాలు చేసుకొనే బి.సి కులాల వారికి ప్రోత్సాహక పారితోషికం 2 లక్షల 50 వేలకు పెంచాలి. పెంచారు. కాని బి.సి లకు పెంచలేదు. అదే మాదిరి పెంచాలి అని ఆశిష్ణయ్య పేర్కొన్నారు.

# భూములు కోల్పోయే రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటాం: మంత్రులు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ములుగు జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను ప్రాధాన్యం ఆధారంగా త్వరగా పూర్తి చేస్తామని మంత్రులు తెలిపారు. భూసేకరణ పూర్తయ్యాక సీఎం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించి పనులు ప్రారంభిస్తామని మంత్రులు వెల్లడించారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ములుగు జిల్లా పరిధిలోని వివిధ ఇరిగేషన్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై సమీక్షించారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ.. ములుగు జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను ప్రాధాన్యం ఆధారంగా త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. భూసేకరణకు సంబంధించిన అంచనాలు, ప్రతిపాదనలను 15 రోజుల్లో సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆ విషయంలో నా కుమార్తె సుస్మిత ఎవర్నీ వదలిపెట్టదు అని కొండా మురళి స్పష్టం చేశారు. నా ఆస్తులపై దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారు: అంబటి రాంబాబు భూసేకరణ పూర్తయ్యాక సీఎం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించి పనులు ప్రారంభిస్తామని మంత్రులు



తెలిపారు. అన్ని ప్రక్రియలు పూర్తయ్యాక పరిహార చెల్లింపుకు సిద్ధంగా ఉన్నామని.. భూములు కోల్పోయే రైతులకు మంచి ప్యాకేజీ ఇచ్చి అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. స్వయంగా తామే రైతుల వద్దకు వెళ్లి భూసేకరణ ప్రక్రియ చేపడతామని మంత్రులు వెల్లడించారు. గత ప్రభుత్వం భూసేకరణ, పరిహారంపై మొండిగా వ్యవహరించిందని విమర్శించారు. తమ ప్రభుత్వం రైతుల పక్షాన ఉందని, వారికి అమోదయోగ్యమైన ప్యాకేజీ ఇచ్చి భూములు సేకరిస్తామని చెప్పారు. రామప్ప - లక్నవరం ఇంటర్ లింకింగ్ ప్రాజెక్టుకు అదనపు నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పనిచేసి ములుగు రైతులకు సాగునీరు అందించాలని మంత్రులు ఆదేశించారు. దేవాదుల ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణపై 15 రోజుల్లో మరోసారి సమావేశం నిర్వహించి ప్రత్యేకంగా చర్చిస్తామని మంత్రులు పేర్కొన్నారు. సమ్మక్క సారాలమ్మ ప్రాజెక్టుపై చత్తీస్‌గఢ్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందని, అక్కడ ముంపు బాధితులకు పరిహారం చెల్లిస్తామని స్పష్టం చేశారు. పెండింగ్ పనుల జాప్యంపై కాంట్రాక్టర్లపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఏవైనా ఇబ్బందులుంటే పరిష్కరిస్తామని మంత్రులు పేర్కొన్నారు.

# శాంతికాముకుడా?

# యుద్ధ పిపాసా?

## యుద్ధ కాంక్షతో రగిలిపోతున్న ట్రంప్

## ప్రపంచశాంతి ముసుగేసుకున్నాడని విమర్శ



**ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ మొదపెట్టిన ఈ యుద్ధం మరో 4-5 వారాలు సాగవచ్చని ట్రంప్ చెప్తున్నప్పటికీ, ఇరాన్ దూకుడు, ప్రతిదాడులు చూస్తుంటే మరో 2-3 నెలలు సాగినా ఆశ్చర్యం లేదనిపిస్తుంది. ఉక్రెయిన్ వెనుక అమెరికాతో సహా యూరోపియన్ దేశాలున్నాయి కనుక నాలుగేళ్ళుగా పోరాడగలుగుతోంది. కానీ ఇరాన్ వెనుక ఎవరూ లేరు కదా? కనుక ట్రంప్ చెప్పినట్లు మహా అయితే మరో 4-5 వారాలుపోరాడగలదు. ఆ తర్వాత చేతులెత్తేయక తప్పదని అభిప్రాయపడుతున్నారు. మరిన్ని వివరాలలోకి వెళితే...**

దశాబ్దాగా రగులుతున్న ఇజ్రాయెల్-ఇరాన్ వైరం.. యుద్ధానికి దారితీసింది. దీనికి అమెరికా కూడా తోడవడంతో.. యుద్ధం పీక్ స్టేజ్‌కి చేరింది. ఇజ్రాయెల్, అమెరికా కలిసి.. ఇరాన్‌పై చేపట్టిన ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీతో.. మిడిల్ ఈస్ట్ అల్లకల్లోలంగా మారింది. ఇరాన్ న్యూక్లియర్ ప్రోగ్రాం, దాని బాలిస్టిక్ మిసైల్ సామర్థ్యంపై అమెరికా జరిపిన చర్చవిఫలం కావడంతో.. ఉద్రిక్తత మొదలయ్యాయ్. ఇరాన్ తన అణు కేంద్రాలను మూసివేయడానికి నిరాకరించడం, ప్రాంతీయంగా తన ప్రాక్సీ గ్రూపులకు మద్దతు కొనసాగించడంతో.. యుద్ధ వితావరణం ఏర్పడింది. ఇరాన్- ఇజ్రాయెల్ సంక్షోభం ఒక్కసారిగా భగ్గుమంది. ఇరాన్ పై ఇజ్రాయెల్ భీకర దాడికి దిగింది. ఏకంగా ఆ దేశ రాజధాని టెహ్రాన్ పై మిస్సైళ్లు, డ్రోన్ బాంబులతో విరుచుకుపడుతోంది. అమెరికాతో కలిసి ఇజ్రాయెల్ ప్రారంభించిన జాయింట్ ఆపరేషన్ ఇది. టెహ్రాన్ లో వరుస పేళ్లు సంభవిస్తోన్నాయి. దట్టమైన పొగఆ నగరాన్ని ఆవరించింది. ఎప్పుడేం జరుగుతుందో, ఎక్కడ ఏ బాంబు పడుతుందో తెలియని పరిస్థితునెలకొన్నాయి.

**భారత్ అలర్ట్**

ఈ పరిణామాలపై భారత్ అలర్ట్ అయింది. ఇరాన్, ఇజ్రాయెల్ లల్లో నివసించే పౌరులకు అడ్వైజరీని జారీ చేసింది. అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అనవసర ప్రయాణాలను మానుకోవడం లేదా వాయిదా వేసకోవాలని కోరింది. ఈ మేరకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఇరాన్, ఇజ్రాయెల్ లోని భారత రాయబార కార్యాలయం ఓ ప్రకటనను విడుదల చేశాయి. ఇక్కడ భారతీయులందరూ రాయబార కార్యాలయంతో నిరంతరం సంప్రదింపుల్లో ఉండాలని పేర్కొంది.

**రణరంగంగా మారిన గల్ఫ్..**

యూఎస్ ఎయిర్ బేస్‌లే లక్ష్యంగా ఇరాన్ దాడులకు దిగడంతో గల్ఫ్ దేశాలన్నీ రణరంగంగా మారాయి. బహ్రెయిన్ రాజధాని మనామాతో పాటు దుబాయ్, దోహా, అబుదాబిలోని పప్రాంతాల్లో ఇరాన్ అటాక్ చేసింది. దీంతో సోమవారం ఉదయం పేళ్ల శబ్దావినిపించాయని స్థానికుఇంటర్నేషనల్ మీడియాకు వెల్లడించారు. యుద్ధ ప్రభావంతో ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే దుబాయ్ విమానాశ్రయాన్ని గంటల తరబడి మూసివేశారు. అక్కడ ఒక విలాసవంతమైన హోటల్‌పై క్షిపణి దాడి జరిగింది. ఇరాక్‌లోని ఎయిర్‌పోర్టు సమీపంలో రెండు డ్రోన్లను ఆ దేశ గగనతల రక్షణ వ్యవస్థకూల్చేశాయి

. బాగ్దాద్ విమానాశ్రయం, ఇర్బిల్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ అనుకూల మిలిషియా గ్రూప్ డ్రోన్ దాడుచేసింది. సైప్రస్‌లోని బ్రిటన్ నౌకాదళ స్థావరంపై డ్రోన్ దాడి జరిగింది. ఈ దాడిలో స్వల్ప నష్టం జరిగిందని ఆ ప్రభుత్వం వెల్లడించింది. ఇక, ఇజ్రాయెల్‌లో సైరన్ల మోత మోగింది. ఇరాన్ నుంచి వచ్చే క్షిపణులను తమ డిఫెన్స్ సిస్టమ్ అడ్డుకుంటున్నదని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ వెల్లడించాయి.

### ఒకే సారి ఎనిమిది దేశాలపైకి మిస్సైళ్లు



అమెరికా, ఇజ్రాయెల్ కలిసి చేస్తున్న దాడులకు ఇరాన్ రివర్స్ ఎటాక్ ప్రారంభింది. ఒకే సారి ఎనిమిది దేశాలపైకి మిస్సైళ్లు వదుతోంది. ఇరాన్ తనపై జరుగుతున్న దాడులకు ప్రతిస్పందనగా కేవలం ఇజ్రాయెల్, అమెరికాలను మాత్రమే కాకుండా, వారి మిత్రదేశాలను, ఈ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలను కూడా లక్ష్యంగా చేసుకుంటోంది. తాజా సమాచారం ప్రకారం, ఇరాన్ తన క్షిపణులను ఇజ్రాయెల్ లోని ప్రధా నగరాలతో పాటు, జోర్డాన్, బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేంట్స్ లలో ఉన్న అమెరికా వ్యూహాత్మక స్థావరాల వైపు మళ్ళించింది. అమెరికా దళాలకు సహకరిస్తున్న ఏ దేశమైనా తమకు శత్రువేనని, వారి భూభాగాలను అమెరికా దాడులకు వేదికగా ఉపయోగిస్తే తీవ్ర పరిణామాఉంటాయని ఇరాన్ హెచ్చరించింది. ఇజ్రాయెల్, అమెరికాపై నేరుగా దాడి చేయడమే కాకుండా ఇతర దేశాలపై మిస్సైల్స్ పంపడానికి ప్రధాన కారణం ప్రాంతీయ హెచ్చరిక. అమెరికాకు మధ్యప్రాచ్యంలో ఉన్న సైనిక పట్టును బలహీనపరచడం ద్వారా ఆ దేశాన్ని ఒత్తిడిలోకి నెట్టాలని ఇరాన్ భావిస్తోంది. అలాగే, ఇజ్రాయెల్ చుట్టూ ఉన్న దేశాఅమెరికాకు సహకరించకుండా భయపెట్టడం ద్వారా యుద్ధాన్ని విస్తరించడం ఇరాన్ వ్యూహం. ఇలా చేయడం ద్వారా ఇజ్రాయెల్ రక్షణ కవచం పై ఒత్తిడి పెంచి, వారిని అన్ని వైపుల నుండి ముట్టడించాలని ఇరాన్ ప్రయత్నిస్తోంది. ఇరాన్ మిత్రపక్షాలైన హిజ్బుల్లా, హౌతీ రెబల్స్ కూడా ఈ యుద్ధంలోకి ప్రవేశించి వివిధ దిశల నుండి దాడుప్రారంభించాయి. ఇది పశ్చిమ ఆసియా మొత్తాన్ని ఒక మహా యుద్ధ భూమిగా మారుస్తోంది.

**అణ్వాయుధాలే లక్ష్యం**

ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య జరుగుతున్న ప్రత్యక్ష యుద్ధం ఒక్కరోజులో మొదలైంది కాదు. 2023 అక్టోబర్‌లో హమాస్.. ఇజ్రాయెల్‌పై చేసిన దాడి దీనికి ప్రధాన కారణం. హమాస్ వెనుక ఇరాన్ మద్దతుందని, ఇజ్రాయెల్ బలంగా నమ్ముతోంది. అప్పటి నుంచి ఇరాన్ మద్దతున్న హిజ్బుల్లా, హౌతీల్లాంటి గ్రూపు.. ఇజ్రాయెల్‌పై దాడుచేస్తూనే ఉన్నాయ్. ఇప్పుడు.. ఇరాన్ అణ్వాయుధాలుతయారుచేయకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ యుద్ధం జరుగుతోంది. ఇరాన్ దగ్గరున్న బాలిస్టిక్ మిసైల్ వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేయడమే టార్గెట్‌గా పెట్టుకున్నారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ నివాసం, ప్రెసిడెంట్ కార్యాలయం, ఇతరకీలక భద్రతా సంస్థలులక్ష్యంగా దాడుజరిగాయి.

**ఇరాన్ ముప్పు నిర్మూలించడమే లక్ష్యం**

ఈ దాడులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇరాన్ వల్ల తలెత్తుతున్న తక్షణ ముప్పును నిర్మూలించాలనేదే ముఖ్య ఉద్దేశమని అన్నారు. తద్వారా అమెరికాతో పాటు ప్రపంచ దేశాలను రక్షించడమే తమ లక్ష్యమని ప్రకటించారు. అమెరికా సైన్యం ఇరాన్‌లో పెద్ద ఎత్తున యుద్ధ కార్యకలాపాలను ప్రారంభించిందని ఆయన వెల్లడించారు. ఇరాన్‌కు అణ్వాయుధాఉండకూడదని ఆయన తేల్చిచెప్పారు. అక్కడి క్షిపణులు,నౌకాదళాన్ని పూర్తిగా నాశనం చేస్తామని హెచ్చరించారు. ఇరాన్ అణ్వాయుధాకలిగి ఉండకూడదని, ఇది అమెరికా సైనిక శక్తిని సవాచేయకూడదని ఆయన చెప్పారు. ఇరాన్ క్షిపణులన్నింటినీ ధ్వంసం చేస్తామని, రక్షణ వ్యవస్థను నేలమట్టం చేస్తామని స్పష్టం చేశారు ఇది పూర్తిగా ధ్వంసమై తీరుతుందని అన్నారు. ఇది ఇక్కడితో ఆగదని, ఇరాన్ నౌకాదళాన్ని అంతం చేస్తామని ట్రంప్ అన్నారు. ఇరాన్ ఇస్లామిక్ రివ్యూషనరీ గార్డ్స్ తమ ఆయుధాలను విడిచిపెట్టితే పూర్తి స్వేచ్ఛను ఇస్తామని, లేదంటే అంతాన్ని ఎదుర్కొంటారని స్పష్టం చేశారు.



ఇరాన్ అణు కార్యక్రమంపై ఒప్పందానికి ఒత్తిడి తీసుకురావడానికి అమెరికా ప్రాంతంలో భారీ సంఖ్యలో యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలను మోహరించింది. దేశవ్యాప్తంగా నిరసనల తర్వాత ఇరాన్ దేశీయంగా సమస్యలను ఎదుర్కొంటున్న తరుణంలో ట్రంప్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చూస్తున్నారు. ఇరాన్ యుద్ధాన్ని నివారించాలని ఆశించినప్పటికీ, యురేనియం సుసంపన్నం చేసుకునే తమ హక్కును సమర్థించుకుంటుంది.

**ఏడు దేశాలపై దాడులు!**

యుద్ధాలకు తెర దించి ప్రపంచ శాంతిని సుస్థిరం చేస్తానని రెండోసారి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా పెట్టుకున్న ఒట్టును ట్రంప్ సింపుల్‌గా గట్టుమీద పెట్టేశారు. ఈ ఏడాది కాలంలో కనీసం ఏడు దేశాలపై దాడులకు తెగబడ్డారు! బాధిత దేశాల్లో ఇరాక్‌తో మొదపెట్టి సోమాలియా, ఇరాన్, యెమన్, సిరియా, నైజీరియా, తాజాగా వెనెజువెలా దాకా ఉన్నాయి. ఈ జాబితాలో తర్వాతి పేరు గ్రీన్‌లాండే అయ్యేలా కన్పిస్తోంది. ఆ దీవిని ఆక్రమించేందుకు యూరప్ దేశాలతో తగాదాలకు కూడా ట్రంప్ వెనకాడటం లేదు! 2024 జనవరి 20 నుంచి ఈ జనవరి దాకా అమెరికా తన మిత్ర దేశాలతో కలిసి కనీసం 658 వాయు, డ్రోన్ దాడులకు పాల్పడ్డట్టు ఆర్మ్‌డ్ కాన్‌ఫ్లిక్ట్ లొకేషన్ అండ్ ఈవెంట్ డేటా మానిటర్ పేర్కొంది!

**బెదిరింపుల దౌత్యం**

దౌత్య మర్యాదలకు, సాటి దేశాధినేతలకు ఇవ్వాల్సిన కనీస గౌరవాదరాలకు కనీవినీ ఎరగని రీతిలో పాతర వేశారు ట్రంప్. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని వైట్‌హౌస్ ముఖాముఖిలో మీడియా సాక్షిగా దారుణంగా అవమానించి ప్రపంచమంతా ముక్కున వేలేసుకునేలా చేశారు. అంతటితో ఆగలేదు. పురు దేశాధినేతలను ఉద్దేశించి మీడియాముఖంగా బెదిరింపులకు దిగడం, వారితో తన ప్రైవేట్ సంభాషణలను బయటపెట్టడం పరిపాటిగా మార్చుకున్నారు. తద్వారా తనతో భేటీ అంటేనే వాళ్లు తీవ్ర విముఖత చూపేదాకా తెచ్చుకున్నారు.

**ఇరాన్ ప్రతీకారం**

సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారం తీర్చుకోవడమే లక్ష్యంగా ఇరాన్ ముందుకు సాగుతోంది. అమెరికా, ఇజ్రాయెల్‌పై భీకర దాడులకు దిగుతోంది. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై దాడుచేస్తోంది. యూఏఈలోని అమెజాన్ డేటా సెంటర్‌పై ఇరాన్ దాడుచేసింది. ఈ నేపథ్యంలోనే ఇరాన్‌కు చెందిన 506 డ్రోన్లు, 152 మిస్సైల్స్‌ను యూఏఈ కూల్చేసింది. కువైట్‌పై ఇరాన్ 97 మిస్సైల్స్, 283 డ్రోన్లను ప్రయోగించింది. ఈ దాడిలో ఒకరు మృతి చెందగా.. 30 మందికి గాయాఅయ్యాయి. ఇరాన్ ప్రయోగించిన 45 మిస్సైల్స్, 9 డ్రోన్లను బహ్రెయిన్ కూల్చేసింది.

**ఇరాన్ ఐఆర్‌జీసీ, మిలిటరీ దళాలకు ట్రంప్ ఆఫర్**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివ్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ), మిలిటరీ దళాలకు ఆఫర్ ఇచ్చారు. ఆయుధావదిలేసిన వారికి రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. లేకపోతే చావు తప్పదని ఆయన హెచ్చరించారు. యుద్ధం నాగు వారాలపాటు జరగొచ్చని అన్నారు. తమ దళాలు జరిపిన దాడుల్లో 48 మంది ఇరాన్ నేతచనిపోయారని ఆయన వెల్లడించారు. ఇరాన్‌తో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

**ఇరాన్‌లో యూఎస్ సెంట్రల్ కమాండ్**

కాగా, ఇస్లామిక్ రివ్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ)కు చెందిన ప్రధాన కార్యాలయంపై యూఎస్ సెంట్రల్ కమాండ్ దాడుచేసింది. ఈ దాడుల్లో కార్యాలయం ధ్వంసం అయినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. గత 47 ఏళ్లలో ఐఆర్‌జీసీ దళావెయ్యి మందికిపైగా అమెరికన్లను హతమార్చాయని ఎక్స్‌లో పోస్టు పెట్టింది. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ కేంద్రాలను ధ్వంసం చేశామని తెలిపింది. ఇరాన్‌కు చెందిన యుద్ధవిమానాలను కూడా ధ్వంసం చేశామని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.

### భారత్‌పై పెట్రో బాంబ్?



యుద్ధం వల్ల అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భగ్గుమన్నాయి. అమెరికా వెస్ట్ టెక్సస్ ఇంటర్మీడియట్ క్రూడ్ ధర 3.19 శాతం పెరిగి 67.29 డాలర్లకు చేరగా, బ్రెంట్ క్రూడ్ 72.87 డాలర్లకు చేరుకుంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ధర బ్యారెల్ కు 100 డాలర్లను తాకుతుందని బార్‌క్లేస్ బ్యాంక్ అంచనా వేసింది. ధర ఈ స్థాయికి చేరితే మనదేశంలో పెట్రోల్, డీజిల్ ధర రూ.10 వరకు పెరిగే అవకాశం ఉంది. రష్యాఉక్రెయిన్ యుద్ధ సమయంలోనూ చమురు ధర 120 డాలర్ల దాకా వెళ్లినప్పటికీ ఆ తర్వాత తగ్గింది. ప్రపంచ చమురు సరఫరాలో ఐదో వంతు వాటా ఉన్న హార్ముజ్ జలసంధిపై ఇరాన్‌కు పట్టు ఉండటంతో చమురు సరఫరాకు ఆటంకం కలుగుతుందనే ఆందోళన పెరిగింది. దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే భారత్ పై ఈ ప్రభావం తీవ్రంగా ఉండనుంది. ఇంధన ధరల వల్ల ద్రవ్యోల్బణం పెరగడంతో పాటు కరెంట్ అకౌంట్ లోటు ఎగిసేఅవకాశం ఉంది. ఈపరిణామాల నేపథ్యంలో భారత్ వద్ద 76 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయని కేంద్రం ప్రకటించింది. ఓపెక్ దేశాలు చమురు ఉత్పత్తిని పెంచితే మార్కెట్ పై ఒత్తిడి తగ్గే అవకాశం ఉంది. మనదేశం రోజుకు 5.5 మిలియన్ బ్యారెళ్ల చమురును వాడుతుంది. ఇందులో రెండు మిలియన్‌బ్యారళ్లు హార్ముజ్ మీదుగానే వస్తోంది. క్రూడ్ ధర ఒక్క డాలర్ పెరిగినా.. ఏటా ప్రభుత్వంపై రూ.13 వేల కోట్ల భారం పడుతుంది. గత ఏడాది మనదేశం 160 బిలియన్ డాలర్ల విలువైన క్రూడ్‌ను కొనుగోలు చేసింది.

**సిరియాలో అమెరికా సేనలు**

సిరియాలో అరాచకానికి పాల్పడుతున్న ఐసిస్ ఉగ్రవాద సంస్థపై అమెరికా సైన్యం విరుచుకుపడింది. అగ్రరాజ్యం తన సైనిక పటిమను ప్రదర్శిస్తూ సిరియాలోని ఉగ్రవాద శిబిరాలే లక్ష్యంగా భారీ స్థాయిలో వైమానిక దాడులు నిర్వహించింది. అమెరికా సైనికులపై జరిగిన దాడులకు ప్రతీకారంగానే ఈ చర్యచేపట్టినట్లు పెంటగాన్ వర్గాధృవీకరించాయి. సిరియాలో ఐసిస్ ఉగ్రవాదులు జరిపిన ఘాతుకంలో ఇద్దరు అమెరికా సైనికు.. ఒక పౌరుడు ప్రాణాకోల్పోయారు. ఈ ఘటనను అత్యంత తీవ్రంగా పరిగణించిన అమెరికా రక్షణ శాఖ ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పాలని నిర్ణయించింది. అమెరికా పౌరుల రక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఈ దాడుల ద్వారా స్పష్టమైన సంకేతాపంపింది.

**భయాందోళనలో మధ్యప్రాచ్యం**

సిరియాలో నెలకొన్న అస్థిరతను ఆసరాగా చేసుకుని ఐసిస్ మళ్లీ పుంజుకోవాలని చూస్తోంది. ఈ క్రమంలో అమెరికా జరిపిన దాడుఉగ్రవాద అణచివేతలో కీలకమని రక్షణ రంగ నిపుణుభావిస్తున్నారు. అయితే ఉగ్రవాద నెట్‌వర్క్‌ను దెబ్బతీయడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా భద్రత పెరుగుతుంది. ఈ దాడుల వల్ల మధ్యప్రాచ్య ప్రాంతంలో ఉద్రిక్తతపెరిగి ఇతర దేశాల ప్రమేయానికి దారితీసే ప్రమాదం ఉంది. సిరియా గడ్డపై శాంతి నెలకొంటుందా లేక ఈ దాడుమరో పెద్ద యుద్ధానికి దారితీస్తాయా అన్నది ఇప్పుడు అంతర్జాతీయ సమాజంలో చర్చనీయాంశంగా మారింది.

**దౌత్య మార్గాఇప్పటికీ తెరిచే ఉన్నాయి**

యుద్ధం విషయంలో తమ దౌత్య మార్గాలు ఇప్పటికీ తెరిచే ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అయితే, చర్చజరుగుతాయో.. లేదో తాను చెప్పలేనని పేర్కొన్నారు. ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ, మిలిటరీ దళాఆయుధావీడితే వారికి రక్షణ కల్పిస్తామని ట్రంప్ భరోసా ఇచ్చారు. లేదంటే చావు తప్పదని హెచ్చరించారు. తన ఆఫర్‌ను వాడుకొని ఇరాన్ ప్రజస్వేచ్ఛ పొందాలని పిపునిచ్చారు.

ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లరిజానీ స్పందించారు. అమెరికా దళాఇరాన్‌పై వైమానిక దాడు, నావికా దాడునిర్వహిస్తున్నట్లు వార్తవస్తున్నాయి. ఈ పరిణామం అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర ప్రభావాలను చూపనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా గ్లోబల్ ఫైనాన్షియల్ మార్కెట్లపై దీని ప్రభావం ఎక్కువగా ఉండొచ్చని భావిస్తున్నారు. రాబోయే కొద్ది రోజుల్లో అంతర్జాతీయ పెట్టుబడి మార్కెట్లలో భారీ ఊగిసలాటచోటుచేసుకునే అవకాశం ఉంది. భద్రతా ఆందోళనపెరిగిన కారణంగా బంగారం, వెండి వంటి సేఫ్-హేవన్ ఆస్తుకొత్త గరిష్టాలకు చేరుకునే అవకాశముందని మార్కెట్ వర్గాచెబుతున్నాయి.

**యుద్ధం ఇక్కడితో ఆగిపోవచ్చు.... కానీ...**

నిజమే ఈ యుద్ధం ఇక్కడితో ఆగిపోవచ్చు. కానీ ఏదో రోజు అమెరికా కూడా ఈ యుద్ధానికి మూల్యం చెల్లించాల్సి రావచ్చు. అది ఎప్పుడు ఏవిధంగా అనేది ఎవరికీ తెలీదు. ఎందుకంటే ఈ యుద్ధమే ప్రపంచంలోని ముస్లిం దేశాలన్నిటినీ ఏకం చేసే అవకాశం ఉంది గనుక! అమెరికా తమ కళ్ళని తమ వేళ్ళతోనే పొడుచుకునేలా చేస్తూ తమని వాడుకుంటోందని గ్రహించలేనంత అమాయకలు ఎకారు గల్ఫ్ దేశాధినేత. అమెరికా ఇలా దండయాత్రచేస్తూ, ఒక్కొక్క దేశాన్ని తన అధీనంలోకి తెచ్చుకుంటుంటే ఎవరూ చూడరనుకోవడం పిల్లి కళ్ళు మూసుకొని పాతగుతున్నట్లే కదా? ఆఫ్ఘనిస్తాన్ కోసం మా అమెరికన్ల కష్టార్జితం (పన్ను సొమ్ము), అమెరికన్ సైనికుల ప్రాణాబలివ్వాల్సిన అవసరం లేదని ఆ దేశం నుంచి అమెరికా దళాలను వెనక్కు తెచ్చేసింది ట్రంప్ దొరగారే. ఇప్పుడు ఆయనే ఇరాన్‌తో యుద్ధం చేయడం కోసం అమెరికన్ల కష్టార్జితాన్ని, అమెరికన్ సైనికుల ప్రాణాపణంగా పెడుతున్నారు.. అంటే ట్రంప్ ఆలోచనలోనే పెద్ద లోపం ఉందా?అంటే కాదనే చెప్పాలి. ఎందుకంటే, ఆఫ్ఘనిస్తాన్‌లో ఎంత ఖర్చు చేసినా, ఎన్ని ప్రాణాబలిపెట్టినా అమెరికాకు పైసా ప్రయోజనం లేదు. కనుక అక్కడ యుద్ధం వద్దనుకున్నారు. కానీ ఇరాన్‌లో చమురు నిక్షేపాన్నాయి. కనుక యుద్ధం చేస్తున్నారు. ఇది ట్రంప్ ద్వంద వైఖరికి చక్కటి నిదర్శనం. కానీ ఈ యుద్ధం అనుకున్న దానికంటే ఇంకా ఎక్కువ కాలం కొనసాగి అమెరికా ఆర్ధిక వ్యవస్థ దెబ్బ తిన్నా, అమెరికన్ సైనికుల శవపేటికఇంకా పెరిగినా ట్రంప్ పట్ల దేశ ప్రజలలో వ్యతిరేకత పెరుగుతుంది. ట్రంప్ దురహంకారంతో ఇప్పటికే అనేక మిత్ర దేశాలను దూరం చేసుకున్నారు. గల్ఫ్ దేశాలలో అమెరికాకు కొత్త శత్రువుసృష్టించి అమెరికా భద్రతకు ముప్పు కొనితెచ్చుకుంటున్నారు. అయితే ఆయన రేపు పదవీకాలం పూర్తయితే చేతుదుపుకొని దిగి వెళ్ళిపోతారు. కానీ ఆయన చేసిన ఈ నిర్వాకాల వలన అమెరికాకు ఎప్పటికీ ప్రమాదం పొంచే ఉంటుంది. కనుక అమెరికాని పులి మీద సవారీ చేయిస్తున్నట్లే లెక్క. కానీ కర్రున్నవాడిదే బర్రె అన్నట్లు ఇప్పుడు ట్రంప్ చేతిలో ఆ కర్రుంది. కనుక ఆయన దిగిపోయే వరకు ఆయన ఆడిందే ఆట పాడిందే పాట! ఎవరూ ఆయనని ఆపలేరు! ఆయన సంగతి తెలిసీ అయన చేతికి కర్ర అందించిన పాపానికి ఆయన కొట్టే ఇలాంటి దెబ్బభరించాల్సిందో తప్పదు!

**వెంకటేశ్వరదాస్ - కల్చరల్ రిపోర్టర్,**

**విశాఖపట్నం - 99892 65111**

### భారతీయ వంటింటి వరకు సెగ



ఈ యుద్ధం కేవలం ఇరాన్, ఇజ్రాయెల్‌లకే పరిమితం కాదు. దీని సెగ భారతీయ వంటింటి వరకు తగలబోతోంది. ఇంధన సెగ: సోమవారం నుంచి పెట్రోల్, డీజిల్ ధరఆకాశాన్నంటే ప్రమాదం ఉంది. భద్రత: పశ్చిమ ఆసియాలో లక్షలాది మంది భారతీయుఉపాధి పొందుతున్నారు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, కేరళ వంటి రాష్ట్రాల కుటుంబాతమ వారి భద్రతపై ఆందోళన చెందుతున్నాయి. విమానయానం: అంతర్జాతీయ విమాన మార్గామూతపడటంతో ప్రయాణాభారం కానున్నాయి. చరిత్రను గమనిస్తే.. చిన్న చిన్న సరిహద్దు గొడవలే ప్రపంచ యుద్ధాలకు దారి తీశాయి. ఇప్పుడు అగ్రరాజ్యం అమెరికా నేరుగా యుద్ధంలోకి దూకడం, ఇరాన్ అణ్వాయుధాల అంశం తెరపైకి రావడం చూస్తుంటే ప్రపంచం మరో పెను ప్రమాదంలో ఉన్నట్లు కనిపిస్తోంది. దౌత్య మార్గాల్లో శాంతి నెలకొనకపోతే, 2026 ఫిబ్రవరి 28వ తేదీని చరిత్ర ఃమూడో ప్రపంచ యుద్ధం ప్రారంభమైన రోజుఃగా గుర్తించే ప్రమాదం ఉంది.

# సూర్య సినిమా

# కోలీవుడ్ హీరోలంతా టాలీవుడ్ దారిలోకి

టాలీవుడ్ హీరోలెవరూ స్ట్రెయిట్ కోలీవుడ్ చిత్రాల్లో నటించింది లేదు. ఎంతో మంది బిగ్ స్టార్స్ఉన్నప్పటికీ ఎవరూ కూడా పెద్దగా నటించింది లేదు. టాలీవుడ్ నుంచే అప్పుడప్పుడు అటెంప్ట్ చేసారు తప్ప నేరుగా తమిళనాడు కెళ్లి నటించింది లేదు. కానీ కోలీవుడ్ హీరోలు మాత్రం టాలీవుడ్ కి దిగొచ్చి మరీ ఎంట్రీ ఇచ్చారు. తెలుగు సినిమా పాన్ ఇండియాలో సత్తా చాటిన తర్వాత టాలీవుడ్ లో మార్కెట్ కోసం సీరియస్ ప్రయత్నాలే చేసారు. అయితే దానికి కారణం లేకపోలేదు. తెలుగు ప్రేక్షకులు కంటెంట్ బావుంటే చాలు హీరోలు..భాషతో సంబంధం లేకుండా అక్కున చేర్చుకుంటారు. ఈ విధంగా ఏ ఇండస్ట్రీలోనూ ఉండదు. ఇప్పటి వరకూ విజయ్, ధనుష్, సూర్య, కార్తీ నటించిన సినిమాలు తెలుగులోకి అనువాదం మాత్రమే అయ్యేవి. ఆ రకంగా తమకంటూ కొంత ఫ్యాన్ బేస్ ఏర్పరుచుకున్నారు. కానీ స్ట్రెయిట్ తెలుగు సినిమాలు చేయడం మొదలు పెట్టిన తర్వాత సన్నివేశం మారింది.

ప్రస్తుత పరిస్థితులు మారాయి. తెలుగు ఆడియన్స్ కు ఈ హీరోలు మరింత దగ్గరవ్వడం మొదలైంది.




శేఖర్‌కమ్ముల కుభేర చిత్రంలో ధనుష్

ధనుష్ హీరోగా శేఖర్ కమ్ములా తెరకెక్కించిన 'కుభేర' ఎంత పెద్ద విజయం సాధించిందో తెలిసిందే. పాన్ ఇండియాలో రిలీజ్ అయిన సినిమా కమర్షియల్‌గా మంచి విజయాన్ని అందుకుంది. అంతకు ముందు వెంకీ అట్లూరీ దర్శకత్వంలో 'సార్' చిత్రంలోనూ ధనుష్ హీరోగా నటించి డీసెంట్ హిట్ అందుకున్నాడు. ఇలా రెండు తెలుగు సినిమాలు ధనుష్ టాలీవుడ్ ఇమేజ్‌ను రెట్టింపు చేసాయి. అలాగే దళపతి విజయ్ వంశీ పైడిపల్లి దర్శకత్వం వహించిన 'వారసుడు' సినిమాతో టాలీవుడ్లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. విమర్శ కుల ప్రశంసలందుకున్న చిత్రంగా నిలిచింది. ఫ్యామిలీ కాన్సెప్టుకు ఓ సెక్షన్ ఆడియన్స్ బాగానే కనెక్ట్ అయ్యారు. విజయ్ పొలిటికల్‌గా కెరీర్‌ని ప్లాన్ చేసుకోవడంతో సీరియస్‌గా అటు వైపు ఆలోచన చేస్తున్నాడు? టాలీవుడ్ సినిమాలే టార్గెట్‌గా పెట్టుకుంటే ఇక్కడా పెద్ద స్టార్‌గా ఎదిగేవారు. అందులో ఎలాంటి సందేహం లేదు. అలాగే శివకార్తికేయన్ 'ప్రిన్స్' సినిమాతో టాలీవుడ్లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. అనుదీప్ కె.వి దర్శకత్వం వహించిన సినిమా పెద్దగా వర్కౌట్ అవ్వలేదు. కానీ శివకార్తికేయన్ ఓ ఐడెంటిటీ వేయగలిగాడు. కార్తీ కూడా వంశీపైడిపల్లి దర్శకత్వం వహించిన 'ఊపిరి' సినిమాతో తెలుగులో లాంచ్ అయ్యాడు. అప్పటికే కార్తీ అంటే? తెలుగులో ప్రత్యేకమైన అభిమానం ఏర్పడింది. 'ఊపిరి' తర్వాత అదే అభిమానం రెట్టింపు అయింది. రవికుమార్ చౌదరి చాలా కాలం క్రితమే విక్రమ్ హీరోగా నైన్ అనే సినిమా చేసారు. కానీ ఇది పెద్దగా ఆడలేదు. తాజాగా సూర్య కూడా టాలీవుడ్‌లో లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. వెంకీ అట్లూరి దర్శకత్వం వహి స్తోన్న విశ్వ నాథ్ అండ్ సన్స్ చిత్రంతో ఎంట్రీ ఇస్తున్నారు. టైటిల్ తోనే సినిమాపై బజ్ నెలకొంది. ఓ డీసెంట్ ఫ్యామిలీ స్టోరీతో సూర్య అలరించడం ఖాయంగా కనిపిస్తుంది. అవకాశం వస్తే మరింత మంది తమిళ హీరోలు తెలుగు సినిమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. అలాగే టెక్నిషియన్లు కూడా ఇక్కడ హీరోలతో పని చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఒకప్పుడు పరిస్థితులకు పూర్తి భిన్నంగా కోలీవుడ్ కనిపిస్తోంది. మునుపటి కంటే తెలుగు నటులకు అక్కడా ఆదరణ పెరిగింది.



వెంకీ అట్లూరి సార్ చిత్రంలో ధనుష్



వంశీ పైడిపల్లి వారసుడు చిత్రంలో దళపతి విజయ్



హీరో కార్తి ఊపిరి మూవీ



శివకార్తికేయన్ ప్రిన్స్ మూవీ




హీరో సూర్య విశ్వనాథ్ అండ్ సన్స్



హీరో విక్రమ్ నైన్ మూవీ

# వారణాసి అరుదైన రికార్డ్



తెలుగు సినిమా స్థాయిని ప్రపంచ దేశాలకు పరిచయం చేసిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, ఇప్పుడు మరో సంచలనానికి తెరలేపుతున్న విషయం తెలిసిందే. సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా తెరకెక్కుతున్న వారణాసి చిత్రం విడుదలకు ముందే ఒక చారిత్రాత్మక మైలురాయిని చేరుకోబోతోంది. కేవలం ఇండియాలోనే కాదు, ప్రపంచ సినిమా చరిత్రలోనే నిలిచిపోయేలా ఈ చిత్ర బృందం ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. మంచు ఖండం అంటార్కిటికాలో షూటింగ్ జరుపుకోనున్న తొలి భారతీయ సినిమాగా వారణాసి అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకోబోతోంది. ఆ వివరాలు ఇలా వున్నాయి.. అంటార్కిటికాలో అడుగుపెట్టనున్న తొలి ఇండియన్ సినిమా: సాధారణంగా భారీ బడ్జెట్ సినిమాల్లో మంచు కొండలు లేదా సముద్ర తీరాలను చూపించాలంటే గ్రాఫిక్స్ వీఎఫ్ఎక్స్ పై ఆధారపడుతుంటారు. కానీ, రాజమౌళి మార్క్ అంటేనే సహజత్వం. అందుకే వారణాసి తదుపరి షెడ్యూల్ కోసం ఏకంగా అంటార్కిటికాలోని సౌత్ పోల్‌ను ఎంచుకున్నారు. ఇక ఈ విషయాన్ని స్వయంగా చిత్ర కథానాయిక ప్రియాంక చోప్రా, మహేష్ బాబుతో జరిగిన ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు. సెట్లు వేయడం కంటే, అసలైన లొకేషన్లలో షూటింగ్ చేస్తే వచ్చే ఆ అనుభూతే వేరని, అందుకే ఈ రిస్క్ తీసుకుంటున్నట్లు చిత్ర యూనిట్ భావిస్తోంది. సవాళ్లతో కూడిన సాహస యాత్ర: అంటార్కిటికా వంటి గడ్డకట్టే ప్రదేశంలో షూటింగ్ చేయడం అంటే మాటలు కాదు. అక్కడ ఉండే విపరీతమైన చలి, వాతావరణ మార్పులు మరియు సామాగ్రిని తరలించడం వంటివి చిత్ర బృందానికి పెద్ద సవాలుగా మారనున్నాయి. ఇక కేవలం విజువల్ ఎఫెక్ట్స్ నమ్ముకోకుండా, ఇంతటి కష్టతరమైన ప్రాంతానికి వెళ్లి షూటింగ్ చేయాలని నిర్ణయించుకోవడం ఈ సినిమాపై ఉన్న అంకితభావాన్ని చాటుతోంది. ఇక ఈ నిర్ణయంతో భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టు ఎక్కించేలా వారణాసి రూపుదిద్దుకుంటోంది. సినిమా అడ్వెంచర్ థ్రిల్లర్ కావడంతో, ఈ లొకేషన్లు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తాయని చెప్పడంలో సందేహం లేదు. భారతీయ సినీ చరిత్రలో సరికొత్త అధ్యాయం: ఒకప్పుడు కేవలం స్టూడియోలకే పరిమితమైన తెలుగు సినిమా, ఇప్పుడు ఖండాలు దాటి సౌత్ పోల్ వరకు వెళ్తుండటం నిజంగా గర్వకారణం. వారణాసి సాధించబోయే ఈ ఘనత కేవలం ఒక రికార్డు మాత్రమే కాదు, భవిష్యత్తు తరాల దర్శకులకు ఒక స్ఫూర్తి. ఇక షూటింగ్ ప్లాన్ చేసినట్లుగా సజావుగా సాగితే, ప్రపంచంలోనే అత్యంత కఠినమైన ప్రదేశాల్లో చిత్రీకరించబడిన సినిమాల జాబితాలో మన వారణాసి ముందు వరుసలో ఉంటుంది.

## 'మెన్షన్ హౌస్ మల్లేష్'

# నిజాయితీగా తీసిన సినిమా



శ్రీనాథ్ మాగంటి హీరోగా బాల సతీష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మెన్షన్ హౌస్ మల్లేష్'. గాయత్రి రమణ, సాయి కామాక్షి భాస్కర్ల హీరోయిన్స్. కనకమేడల ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాజేష్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలలై టీజర్, ట్రైలర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం మార్చి 6న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. హీరో శ్రీనాథ్ మాగంటి మాట్లాడుతూ.. ఈ సినిమాకి ఫస్ట్ హీరో మా ప్రొడ్యూసర్. ఆయనకు ఎన్ని ఇబ్బందులు ఉన్నా సరే ఎక్కడ రాజీ పడకుండా ఈ సినిమాని నిర్మించారు. అద్భుతమైన క్వాలిటీతో బయటికి తీసుకొచ్చారు. సెకండ్ హీరో మా డైరెక్టర్. నన్ను బలంగా నమ్మి ఈ క్యారెక్టర్ కి నేనైతే బాగుంటుందని హీరోగా పెట్టారు. మా నిర్మాత డైరెక్టర్ గారి నమ్మకాన్ని నిలబెట్టానని భావిస్తున్నాను. డీవోపీ అమ్మముత్తు, సురేష్ బొబ్బిలి గారి మ్యూజిక్ సినిమాకి మరింత బలాన్ని ఇస్తాయి. ఈ సినిమా చూస్తున్నప్పుడు మీరు ఒక ఊర్లో ఉన్న ఫీలింగ్ లోనే ఉంటారు. నేను హీరో అవుదామన్న ప్రతిసారి నీ మార్కెట్ ఏంటి అనే ప్రశ్న వస్తుంది. నిజానికి మీరు ఆదరిస్తేనే ఒక మార్కెట్ వస్తుంది. మంచి కథల్ని ఎన్నుకోవాలి, మంచి టెక్నీషియన్స్ తో పనిచేయాలి. ఈ సినిమాకి అదే చేశాను. ఈ సినిమాలో కామాక్షి గారు అద్భుతమైన పెర్ఫార్మన్స్ ఇచ్చారు. గాయత్రి కూడా చాలా చక్కని నటన కనబరిచారు. అలాగే ఈ సినిమాకి పనిచేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. ఈ సినిమా కోసం 100% ఎఫర్ట్ పెట్టాను. ఈ సినిమా నాకంటే నా టీం కోసం గెలవాలి. ఈ సినిమా గెలిస్తే ప్రతి ఒక్కరు గెలుస్తారు. చిన్న అడుగు వేసుకుంటూ ముందుకు వస్తున్నాం. మిమ్మల్ని ఎంటర్టైన్ చేయడం కోసమే మా జీవితాలు అంకితం. నిజాయితీతోనే ఈ సినిమా మీ ముందుకు తీసుకొస్తున్నాం. మార్చి 6న సినిమా థియేటర్లో రిలీజ్ అవుతుంది. అందరూ సినిమా చూసి నచ్చితే సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. అందరం థియేటర్స్ లో కలుద్దాం.




### సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని ఫ్యామిలీ

# అంతా ఎంజాయ్ చేయాలి

మిస్సమ్మ', 'అదిరందయ్యా చంద్రం', 'టాటా బిర్లా మధ్యలో లైలా' లాంటి క్లాసిక్ ఎంటర్‌టైనర్స్ తర్వాత శివాజీ, లయ జంటగా నటించిన సినిమా 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. లిటిల్ హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి లాంటి విజయాల తర్వాత ఈటీవీ విన్‌తో కలిసి ప్రముఖ నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి విడుదల చేస్తున్న సినిమా ఇది. తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేసింది. క్రైమ్-కామెడీ ఫ్యామిలీ థ్రిల్లర్‌గా వస్తున్న సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని సినిమాను ఈటీవీ విన్ అసోసియేషన్‌తో శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రిక్కి సమర్పణలో హీరో శివాజీ స్వయంగా నిర్మిస్తుండగా.. సుధీర్ శ్రీరామ్ తెరకెక్కించారు. మార్చి 6న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక ఎంతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాస్య బ్రహ్మ బ్రహ్మానందం, బండ్లగణేష్ అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా... బండ్ల గణేష్ మాట్లాడుతూ ఈటీవీవిన్ సంస్థ ఎంతో మంది నూతన ప్రతిభను ప్రోత్సాహిస్తున్నారు. శివాజీ నా ఆత్మబంధువు, సోదరుడు. శివాజీ ఎప్పుడూ బాగుండాలని కోరుకునే వ్యక్తి. ఈ సినిమా ఓటీటీ అనగానే డిజప్పాయింట్ అయ్యాను. సాయి, నితిన్‌కు ఫోన్ చేసి థియేటర్‌లో విడుదల చేయమని చెప్పాను. అనిల్ రావిపూడి సలహాతో ఈ సినిమా థియేటర్‌లో రావడం ఆనందంగా ఉంది. ఈ సినిమా సూపర్‌హిట్ కావాలని కోరుకుంటున్నాను. ఈటీవీ విన్ సంస్థ ఇలాగే కొత్తవారిని ఎంకరైజ్ చేయాలని కోరుకుంటున్నాను అన్నారు.

## పెద్ది లాంటి భారీ సినిమాలో రై రై రారా లాంటి గొప్ప పాట రాసే అవకాశం రావడం నా అదృష్టం

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మ్యాసీవ్ మాస్ ఎక్స్‌ట్రావగాంజా పెద్ది సెకండ్ సింగిల్ 'రై రై రా రా' పాట దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. రికార్డింగ్ బ్రేకింగ్ వ్యూస్ తో టాప్ వన్ లో ట్రెండ్ అవుతోంది. రామ్ చరణ్ గ్రేస్, చరిష్మా, ఎలక్ట్రిఫైయింగ్ డ్యాన్స్ మూమెంట్స్ అందరినీ అలరిస్తున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా అద్భుతమైన పిక్చరైజేషన్, ఏఆర్ రెహ్మాన్ మ్యూజిక్, అనంత శ్రీరామ్ లిరిక్స్, జానీ మాస్టర్ కొరియోగ్రఫీ అన్నీ కలిసి ఈ సాంగ్ వైరల్ హిట్ గా అదరగొట్టింది. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో పెద్ది రై రై రా రా పాట విశేషాలు పంచుకున్నారు లిరిక్ రైటర్ అనంత శ్రీరామ్.

**పెద్ది 'రై రై రా రా' పాటకు అద్భుతమైన రెస్పాన్స్ రావడం ఎలా అనిపించింది?**

రామ్ చరణ్ గారి రుద్రతాండవం, ఏఆర్ రెహమాన్ గారి ధీర శంఖారావం, రత్నవేలు గారి చిత్రీకరణలో ఉన్న మాయాజాలం, వీటన్నిటి మధ్యలో నుంచి కూడా పాటలో లిరిక్స్ బాగున్నాయి, ఫలానా లైన్ విను, ఫలానా లైన్ బాగుంది అని అన్ని చోట్ల సాహిత్యానికి ప్రశంసలు రావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఈ పాట ఆ అదృష్టాన్ని చేసుకుందనిపించింది.

-నిజానికి ఇది ఒక ప్రేమ పాట కాదు, ఐటెం సాంగ్ కాదు అయినప్పటికీ కూడా లైన్స్ గురించి మాట్లాడుతున్నారు.. దీనికి కారణం ఈ పాట సాహిత్యం ఇలా రావాలన్న దర్శకుడి సంకల్పం. బుచ్చిబాబు గారు సాహిత్యానికి చాలా ప్రాముఖ్యత ఇస్తారు. ఈ పాటలో ఎలాంటి సాహిత్యం ఉండాలి అనే దానిపై బుచ్చిబాబు గారు నేను చాలా సమయం కేటాయించాం. చాలా రాత్రులు రింగ్ రోడ్డు మీద అలా డ్రైవ్ చేస్తూ, కాఫీ షాపుల్లో కూర్చుని చాలా చర్చించాం. అలా నెలలు తరబడి మదనపడితే వచ్చిన పాట ఇది. ఈ తరానికి ముందు తరానికి కూడా గొప్ప సందేశాన్ని అందిస్తూనే మాస్ ని అలరించేలా ఈ పాటని రూపొందించడం జరిగింది.

-ఈ పాట రాయడానికి చాలా వెర్షన్స్ అనుకున్నాం. ఫైనల్ గా ఒక మంచి ప్రబోధాత్మక పాట గానే ఉండాలి అని నిర్ణయించాం. కాకపోతే ఇందులోనే వాడే భాష జనానికి దూరంగా ఉండకూడదు. వ్యవహారికంగా ఉండాలి. చెప్పే విషయం చాలా లోతుగా ఉండాలి అని బుచ్చిబాబు గారు చెప్పారు.
-ఇందులో హీరోకి కెప్టెన్ లక్షణాలు ఉండాలి. తన జట్టు ఆటగాళ్లని రై రారా అని పిలిచేలాగా వుండాలి. బుచ్చిబాబు గారు చెప్పిన ఈ మాటలు ఆయన దగ్గర నుంచే తీసుకుని పాటని ప్రారంభించడం జరిగింది. రై రై రా రా అని పెట్టడానికి ఇంకొక కారణం కూడా ఉంది ఇది. ప్రతి ఒక్కరికి ఈ పాట ఫిలాసఫీ రీచ్ అవ్వాలి. మన పల్లెటూరులో ప్రతి ఒక్కరిలో ఉపయోగించే రవాణా సౌకర్యం ఆర్టీసీ బస్సు. కండక్టర్ రైరై అనగానే బండి ముందు కదులుతుంది. ఆ శబ్దం యొక్క ప్రేరణలా ఈ జీవితమనే బస్సు ముందుకు వెళ్లాలి అన్న సూచన ఇచ్చేలాగా పాటను మొదలుపెట్టడం జరిగింది. ఈ పాటలో ఎక్కువమంది పాతేసుకోకోయలా.. నువ్వు నిన్నే నీ లోపల.. పాతికేళ్లకే..నువ్వు పాతబడిపోకురా.. ఈ లైన్ ని కోట్ చేస్తున్నారు. అంత మంచి పాట ఇంత పెద్ద సినిమాలో రాసిన అవకాశం రావడం చాలా అదృష్టంగా భావిస్తాను.

-సాహిత్యం ఒక్కటే కాదు జానీ మాస్టర్ గారి కొరియోగ్రఫీ, రత్నవేలు గారికి విజువల్స్, రామ్ చరణ్ గారు చూపించిన చరిష్మా గ్రేస్, రెహమాన్ గారి సంగీతం, గొంతు అన్నీ కూడా నువ్వు నువ్వా నేనా అన్నట్టుగా పోటీ పడడం వల్ల ఈ ఘనత సాధ్యమైంది. ఈ పాట క్రెడిట్ అందరికీ ఇవ్వాలి. అలా కాదు ఒక్కరికే ఇవ్వాలి అంటే మా అందరినీ నడిపించిన డైరెక్టర్ బుచ్చిబాబు గారికి ఇవ్వాలి, ఆయనకి స్వేచ్ఛనిచ్చిన రామ్ చరణ్ గారికి ఇవ్వాలి.

**ఈ పాట విన్న తర్వాత చరణ్ గారి రియాక్షన్ ఏంటి?**

-సాంగ్ విషయంలో పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. షూటింగ్ లోకేషన్ లో ఈ పాటను చరణ్ గారికి వినిపించాను. పాట విని నన్ను హత్తుకున్నారు.

**ఈ సాంగ్ మీకు ఛాలెంజింగ్ గా అనిపించిందా?**

-ఒక మంచి పాట రాయడం అలాగే మాస్ పాట రాయడం రెండూ కష్టం కాదు. మాస్ పరిభాషలో ఫిలాసఫీ చెప్పడం అనేది కత్తి మీద సాములా అనిపించింది. అందులోనూ రెహమాన్ గారి బాణీ మామూలుగా ఉండదు. ప్రతి లైన్ ప్రయోగాత్మకంగా ఉంటుంది. అర్థం చేసుకోవడానికి చాలా సమయం తీసుకున్నాను. ఈ పాట రాయడానికి చాలా కసరత్తు జరిగింది. దాదాపు రెండు నెలల వరకు సమయం తీసుకున్నా. పరాయి భాషల ప్రభావం లేని అచ్చ తెలుగు పాటిది.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044